fb/prajasakti, www.prajasakti.com

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 41 | విజయవాడ, ఆదివారం 11 ఫిబ్రవరి 2018 | 12 + 12 పేజీలు + స్నేహ వెల : 5.00

హైకోర్టు ఏర్పాటుకు తాత్కాలిక భవనాల పరిశీలన

ప్రజాశక్తి - యంత్రాంగం

అమరావతిలో హైకోర్టు ఏర్పాటుకు అనువైన తాత్కాలిక భవనాలను ఎపి, తెలంగాణా రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు జ్యూడికేషర్ బృందం సందర్శించింది. మూడురోజుల పర్యటనలో భాగంగా రెండోరోజైన శనివారం కృష్ణా, గుంటూరు జిల్లాలలోని పలు ప్రాంతాల్లో పర్యటించింది. గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ భవనాల సముదాయాలను, యూనివర్సిటీ పక్కన ఉన్న రామకృష్ణ టవర్స్ భవనాల సముదాయాన్ని, యూనివర్సిటీకి ఎదురుగా ఉన్న రెయిన్ ట్రీ విల్లాస్ భవనాలను, తుళ్లూరు మండలం నెక్కల్లు ప్రాంతాన్ని పరిశీలించింది. అనంతరం కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నంలో మిగతా 9లో



సిపిఎం 25వ రాష్ట్ర మహాసభల సందర్భంగా భీమవరం లూథరన్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తున్న ఏచూరి, వేదికపై నాయకులు



భీమవరం నగర వీధిలో నిర్వహించిన మహా ప్రదర్శన

ప్రజా పోరాటాలతోనే ఎర్ర జెండాకు పూర్వ వైభవం

- ఉద్యమాలకు అవకాశాలు పెరుగుతున్నాయి
- ఐక్యతను దెబ్బతీసేందుకు మత ఘర్షణలు
- దేశ సమగ్రతకు బిజెపి ప్రమాదం
- ప్రభుత్వ వ్యవస్థల్లోనూ ఆర్‌ఎస్‌ఎస్ జోక్యం
- దేశంలో పెరుగుతున్న ఆకలి మరణాలు, ఆత్మహత్యలు
- సిపిఎం 25 రాష్ట్ర మహాసభల ప్రారంభోపన్యాసంలో ఏచూరి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి-పర్స సత్యనారాయణనగర్(భీమవరం)

ప్రజాపోరాటాలతోనే ఎర్రజెండాకు పూర్వ వైభవం వస్తుందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగానూ, దేశంలోనూ నెలకొన్న పరిస్థితులు ఉద్యమాలకు అవకాశం కల్పిస్తున్నాయని అన్నారు. అనుకూల పరిస్థితులకు అనుగుణంగా పోరాటాలు చేయడం ద్వారానే ఉద్యమాలు బలోపేతమై వామపక్ష ఉద్యమానికి పూర్వవైభవం వస్తుందని ఏచూరి అన్నారు. శనివారం భీమవరంలో పర్స సత్యనారాయణనగర్లోని సింహాద్రి శివారెడ్డి ప్రాంగణంలో జరుగుతున్న సిపిఎం రాష్ట్ర 25వ మహాసభలను సీతారాం ఏచూరి ప్రారంభోపన్యాసం చేశారు. మహాసభ ప్రారంభంలో తొలుత వక్తలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు వేదిక మీదకు ఆహ్వానించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ప్రారంభోపన్యాసంతోపాటు, సాయంత్రం అల్లూరి సీతారామరాజునగర్లోని లూథరన్ గ్రౌండ్‌లో జరిగిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. సంస్కరణల పేరుతో పాలకులు ప్రజలను దోచుకుంటున్నారని, దీనికి వ్యతిరేకంగా ఎక్కడికక్కడ పెద్దఎత్తున ఉద్యమాలు ముందుకు వస్తున్నాయని తెలిపారు. ఈ ఉద్యమాలను దెబ్బతీసేందుకు ప్రజలు, వేదికల మధ్య ఐక్యతను దెబ్బతీసేందుకు బిజెపి మతోన్మాద హింసను పెంచుతోందని తెలిపారు. దీనివల్ల దేశ సమైక్యత ప్రమాదంలో పడుతోందని, నిరంకుశత్వం పెరుగుతోందని చెప్పారు. స్వాతంత్ర్య మిగతా 9లో

జమ్మూలో సైనిక శిబిరంపై ఉగ్ర దాడి

- ఇద్దరు మృతి, ముగ్గురికి గాయాలు
- పరిస్థితిని సమీక్షించిన హోం మంత్రి రాజ్‌నాథ్
- ఇది పాక్ పనే : ఫరూక్ అబ్దుల్లా



జమ్మూ : జమ్మూ కాశ్మీర్‌లోని సైనిక శిబిరంపై శనివారం ఉదయం 5 గంటల సమయంలో ఉగ్రవాదులు జరిపిన దాడిలో ఇద్దరు సైనికులు మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. జమ్మూ శివార్లలో ఉన్న సంజవాన్ సైనిక శిబిరంలోకి ఉగ్రవాదులు చొరబడి కాల్పులు జరిపినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని ఐజిపి తెలిపారు. ఈ ఘటనలో మృతి చెందిన సైనికులను మదన్ లాల్ చౌదరి, మహ్మద్ అష్రఫ్‌లుగా గుర్తించినట్లు ఆయన చెప్పారు. ఈ శిబిరంలోని రెసిడెన్షియల్ క్వార్టర్‌లో పలు సైనిక కుటుంబాలు నివసిస్తున్నాయి. ఉగ్రవాదులు దాడి చేసిన మిగతా 9లో

టిడిపి, బిజెపి తోడుదొంగలు

- పవన్ టిడిపిని, వైసిపి బిజెపిని విమర్శించకపోవడం అనైతికం
- సామాజిక న్యాయం కోసం పోరాటమే శిరోధార్యం
- బహిరంగ సభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి. రాఘవులు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రజలను మోసగించడంలో టిడిపి, బిజెపి తోడుదొంగలని, రాజకీయ నాటకాల్లో ఇరుపార్టీల నాయకులకు నంది అవార్డులు ఇవ్వొచ్చని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. 25వ రాష్ట్ర మహాసభల సందర్భంగా భీమవరం లూథరన్ హైస్కూల్ ప్రాంగణంలో ఆ పార్టీ జిల్లా డెల్టా కమిటీ కార్యదర్శి బి.బలరాం అధ్యక్షతన శనివారం జరిగిన బహిరంగ సభలో రాఘవులు మాట్లాడారు. 'పవన్ తన ప్రసంగాల్లో టిడిపిని విమర్శకుండా బిజెపి గురించి మాట్లాడుతారు.. వైసిపి నేత జగన్ బిజెపి ప్రస్తావన లేకుండా టిడిపిని విమర్శిస్తారు. ఇలా చేయడం నైతికం కాదు. ప్రజలను తప్పు దోవ పట్టించడమే. పవన్ టిడిపి చేసిన మోసం గురించి మాట్లాడాలి. జగన్ బిజెపి చేసిన అన్యాయం గురించి విమర్శించాలి' అని అన్నారు. ' రాష్ట్ర ప్రజలను మోసగించడంలో రెండు పార్టీ నేతల వైఖరి ఒక్కటే. ఇద్దరి గురించి మాట్లాడినప్పుడే నిజాయతీ రాజకీయాలవుతాయి.. వీరి మోసపూరిత వైఖరి గురించి ప్రజల ముందు ఎండగట్టాలి' అని అన్నారు. ప్రత్యేకహోదాతో పాటు, పునర్వ్యవస్థీకరణ చట్టంలోని హామీల అమలు కోసం వామపక్షాలు రాష్ట్ర విభజన జరిగినప్పటినుండే పోరాడు తున్నాయని, ఎన్నో జెఎసిలు ఉన్నాయని అన్నారు. 'వీటితో కలిసి రాకుండా పవన్ కళ్యాణ్ కొత్తగా జెఎసి అంటున్నారు. అది ఎందుకో అర్థం కాదు. ఉన్న వాటి తోనే ఆయన కలిసి పనిచేయవచ్చు.' అని అన్నారు. 'మిరప, పసుపు, వరి వంటి ఏ పంటకూ సరైన ధర లేకుండా పోయిందన్నారు. రైతాంగం సంక్షోభంలో ఉందని, రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు న్యాయం చేయడంలో కేంద్రబడ్జెట్‌లో మోడీసర్కార్ విఫలమైందని విమర్శించారు. గిట్టుబాటు ధర కోసం ప్రత్యేక చట్టం తేస్తేనే రైతులకు అన్నివిధాలా న్యాయం జరుగుతుందని చెప్పారు. బడా పారిశ్రామికవేత్తలకు మోడీ సర్కార్ రూ.లక్షల కోట్ల రుణాలను రద్దు చేసిందన్నారు. తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన రైతులు బ్యాంకుల వద్ద తీసుకున్న రెండుశాతం రుణాలను రద్దు చేయకపోవడం దారుణమన్నారు. రైతుల అప్పులను రద్దు చేయాలని సిపిఎం గట్టిగా కోరుతుందన్నారు. హక్కులు సాధించుకునేందుకు రైతులు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. రాష్ట్ర విభజన మిగతా 9లో

ఉద్యోగుల గర్జన

- ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్లు
- సిపిఎస్ రద్దు చేయాలని డిమాండ్



కర్నూలు జిల్లా పరిషత్ నుంచి ర్యాలీగా వస్తున్న పెన్షన్ సాధన సమితి నాయకులు, పాల్గొన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - యంత్రాంగం

కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పెన్షన్ సాధన సమితి ఆధ్వర్యాన రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తదితర ప్రజా సంఘాల నాయకులు శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. 'సిపిఎస్ అంతమే మా పంతం' అనే నినాదాలతో కలెక్టరేట్లన్నీ దద్దరిల్లాయి. పెన్షన్ అనేది ఎవరో ఇచ్చే భిక్ష కాదని, ఉద్యోగులు పోరాడి సాధించుకున్న హక్కు అని వక్తలు స్పష్టం చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని సూచించారు. రెండో దశలో చేపడుతున్న ఈ పోరాటంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిపిఎస్ రద్దుకు చర్యలు తీసుకోవాలని లేదంటే మూడో దశ పోరాటంలో భాగంగా మార్చిలో నిర్వహించే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సమయంలో లక్షలాది మందితో చలో అసెంబ్లీని నిర్వహిస్తామని హెచ్చరించారు.

విజయవాడ అలంకార్ సెంటర్‌లో శనివారం మహాధర్నా నిర్వహించారు. పెన్షన్ సాధన సమితి కన్వీనర్ ఎ. విద్యాసాగర్ అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ పి.అశోక్‌బాబు హాజరయ్యారు. ధర్నాకు ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు, పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, యుటిఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సంజీవరెడ్డి, డిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పి.కృష్ణయ్య, ఎస్‌టియు రాష్ట్ర నాయకులు నీలకంఠయ్య తదితరులు మాట్లాడారు. వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి కె.పార్థసారథి, వైసిపి నగర అధ్యక్షులు వై.శ్రీనివాస్ తదితరులు పెన్షన్ సాధన సమితి ధర్నాకు సంఘీభావం పలికారు.తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు శనివారం మహాధర్నా నిర్వహించారు. జిల్లాలో 16 వేల మంది ఉద్యోగులు ఉండగా, ధర్నాలో ఎనిమిది వేల మంది పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఉద్యోగులు ఉదయాన్నే వాహనాలపై జిల్లా కేంద్రమైన కాకినాడ మిగతా 9లో

చెప్పినవన్నీ చేస్తున్నాం

హామీల అమలుపై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీల నన్నింటిని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎ కంభంపాటి హరిబాబు అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందని ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో ఆయన స్పందించారు. ఏపికి కేంద్రం మంజూరు చేసిన జాతీయ సంస్థలు, ప్రాజెక్టులు, నిధులపై 27 పేజీల నోట్‌ను హరిబాబు శనివారం డిల్లీలో విడుదల చేసి మీడియాతో మాట్లాడారు. ఏపికి కేంద్రం నుంచి అందుతున్న సాయాన్ని వివరించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇప్పటికే రూ.4 వేల కోట్లకు పైగా ఇచ్చారని వివరించారు. మోడీ ప్రభుత్వం తొలి భేటీలోనే పోలవరానికి సంబంధించిన 7 మండలాలపై నిర్ణయం తీసుకుందని గుర్తు చేశారు. ఉజ్వల్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలను ఏపి పూర్తిస్థాయిలో వినియోగించుకుంటోందని అన్నారు. రాష్ట్రంలో గిరిజన, కేంద్రీయ విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు కేంద్రం అంగీకరించినట్లు చెప్పారు. రెండు విశ్వవిద్యాలయాలకు రూ.10 కోట్ల చొప్పున కేంద్రం కేటాయించిందని వెల్లడించారు. దుగరాజపట్నం పోర్టు ఏర్పాటుకు పలు అభ్యంతరాలు వచ్చాయని, దీంతో ప్రత్యామ్నాయ పోర్టు సూచించాలని ఏపిని కేంద్రం కోరిందని తెలిపారు. విశాఖ రైల్వే జోన్ కోసం కమిటీ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఏపిలో రూ.లక్ష కోట్లతో జాతీయ రహదారుల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రత్యేక హోదా ప్రకటిస్తే రాష్ట్రానికి ఎంత మేర లాభం చేకూరుతుందో.. అంతేమేర ఒక్క రూపాయి తగ్గకుండా ప్రత్యేక ప్యాకేజీని అమలు చేస్తామని కేంద్రం ప్రకటించిందని ఆయన అన్నారు. ఏపి పునర్వ్యవస్థీకరణ చట్టం అమలుకు కేంద్రం కట్టుబడి ఉందని అన్నారు. ఇటీవల కొన్ని రాజకీయ పార్టీలు బంద్ పాటించాయని, చట్టాన్ని రూపొందించి ప్రత్యేక హోదా అంశాన్ని చట్టంలో పెట్టనివాళ్లు కూడా బంద్‌లో పాల్గొన్నారని విమర్శించారు. ఆంధ్రా ప్రజల గొంతు కోసింది కాంగ్రెస్ పార్టీనేనని బిజెపి నేత నరసింహారావు ఆరోపించారు. బిజెపిపై కొందరు వ్యతిరేక ప్రచారం చేస్తున్నారని.. ఏపికి కాంగ్రెస్ చేసిన అన్యాయాన్ని బిజెపి ప్రభుత్వమే సరిచేస్తోందన్నారు. ఏపి వల్లే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏపి ప్రజలనే మోసం చేసిందని మండిపడ్డారు. రాష్ట్రానికి కాంగ్రెస్ సరైన న్యాయం చేయలేదని, విభజన హామీలన్నింటినీ నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ఇప్పుడు రాహుల్ గాంధీ కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని విమర్శించారు. విలేకరుల సమావేశంలో బిజెపి ఎంపి మిగతా 9లో

ప్రజలకు వాస్తవాలు చెప్పండి

వైసిపి నేత జగన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హోదా విషయంలో ఇప్పటికైనా అసలు వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని ప్రతిపక్ష వైసిపి నేత అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏమిస్తారో తెలియని ప్రత్యేక ప్యాకేజీ కోసం, ఏ హక్కుతో హోదాను తాకట్టుపెడతారని ప్రశ్నించారు. తాజా రాజకీయ పరిస్థితులపై శనివారం ట్విట్టర్ ద్వారా స్పందించిన జగన్, విభజన చేసినప్పుడే ఏపీకి హెూదా ఇస్తామని కేంద్రం ప్రకటించిందని, పార్లమెంటు వేదికగా అప్పటి పాలక, విపక్షాలు కలిసి మాటిచ్చాయని గుర్తు చేశారు. మార్చి 2014లో ఇదే అంశాన్ని కేంద్ర మంత్రివర్గం ఆమోదించిందని, హెూదా అమలు అంశాన్ని ప్రణాళిక సంఘానికి కూడా పంపారని తెలిపారు. హోదా వల్ల రాష్ట్రానికి అనేక ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. కంటితుడుపు చర్యలు ఆపి, హోదా విషయంలో ప్రజలకు వివరించాలంటూ ట్వీట్ చేశారు.



పురస్కారం
విజయవాడలో శనివారం నగేష్‌బాబు జాతీయ విశిష్ట సాహిత్య పురస్కారాన్ని అందుకుంటున్న గోరేటి వెంకన్న

గోరటి వెంకన్నకు నగేష్‌బాబు జాతీయ విశిష్ట సాహిత్య పురస్కారం

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

మహాకవి మద్దూరి నగేష్‌బాబు జాతీయ విశిష్ట సాహిత్య పురస్కారాన్ని ప్రజా వాగ్గేయకారులు గోరటి వెంకన్నకు మంత్రి నక్కా ఆనంద్‌బాబు ప్రదానం చేశారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డైక్‌మెన్ ఆడిటోరియంలో అడుగు సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి బుద్ధిస్ట్ స్టడీస్ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ ఆంధ్ర యూనివర్సిటీలో చదివినప్పుడు నగేష్‌బాబు తన స్నేహితుడని చెప్పారు. గోరటి వెంకన్నకు తెలుగు రాష్ట్రాల్లో అసంఖ్యాకమైన అభిమానులున్నారన్నారు.

దళిత సాహిత్యానికి, దళిత కవులకు గుర్తింపు ఇస్తామని చెప్పారు. ప్రజా సాహిత్యం, దళిత సాహిత్యం అని వేరు చేయడం బాధాకరమని, దళిత సాహిత్యంపైనా వివక్ష ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తన ఆటపాటలతో గోరటి వెంకన్న సభికులను ఉత్సాహపరిచారు. ఆవును చంపిన పెద్దపులి అమ్మవారి వాహనమైతే చచ్చిన ఆవు చర్మం ఒలిస్తే చంపుతున్నారన్న వెంకన్న కులం పోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కవులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.



పెరుగుతున్న ఉష్ణోగ్రత

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

రాష్ట్రంలో ఉష్ణోగ్రత క్రమంగా పెరుగుతోంది. శనివారం రాష్ట్రంలో పగలు ఎండలు తీవ్ర ప్రభావం చూపాయి. మధ్యలో పాక్షిక మేఘావృతం కనిపించినప్పుడు చల్లబడింది. కోస్తా, రాయలసీమల్లో నాలుగు రోజుల పాటు పొడి వాతావరణమే ఉంటుందని హైదరాబాద్ వాతావరణశాఖ పేర్కొంది. పగలు ఎండలు ప్రభావం చూపిస్తాయని, వేకువజామున చలి తీవ్రత ఉంటుందని వివరించింది. ఆగ్నేయ అరేబియాలో కేరళ తీరానికి ఆనుకుని అల్పపీడన ద్రోణి స్థిరంగా కొనసాగుతోందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో పాక్షిక మేఘావృతం ఉన్నా వర్షాలు పడే అవకాశం లేదని వాతావరణ నిపుణులు తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక,
ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4,
గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.


బిజెపి నేతలు తప్పుడు లెక్కలు చెబితే

దీటుగా స్పందించండి

టిడిపి ఎంపీలకు సూచించిన సిఎం చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విభజన హామీలకు సంబంధించి బిజెపి నేతలు ఎవరైనా తప్పుడు లెక్కలు చెబితే వాటికి దీటుగా స్పందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు టిడిపి ఎంపిలకు సూచించారు. ఉండవల్లిలోని తన నివాసం నుంచి కేంద్ర మంత్రి సుజనా చౌదరితోపాటు పలువురు ఎంపీలు, అధికారులు, పార్టీ నేతలతో ఆయన శనివారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. రాష్ట్ర విభజన హామీలపై ఢిల్లీలో జరిగిన తాజా పరిణామాలపై చర్చించారు. ఎపికి విభజన హామీల అమలు అంశాలపై కొద్ది రోజులుగా పార్లమెంట్‌లో ఎంపిలు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పటికప్పుడు ఆ పరిణామాల్ని పరిశీలిస్తున్నారు. ఆమేరకు పార్లమెంట్ సభ్యులతో గత



కొన్ని రోజులుగా టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తూ వారికి దిశా నిర్దేశం చేస్తున్నారు. తాజాగా శనివారం జరిపిన సమీక్షలో విభజన హామీలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చే వరకు వేచి చూడాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. మరోమారు ఢిల్లీ వెళ్లాల్సిందిగా రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు కుటుంబరావుకు సిఎం సూచించారు.

నేడు ఎంపిలతో సమావేశం

టిడిపి ఎంపిలతో చంద్రబాబు ఆదివారం ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో తాజాగా ఢిల్లీలో జరిగిన పరిణామాలపై చర్చించనున్నారు. పార్లమెంట్ సమావేశాలు తిరిగి ప్రారంభమయ్యే లోపు ఎపికి రావాల్సిన నిధులను కేటాయిస్తామని కేంద్రం ప్రకటించిన సంగతి తెలిసిందే.

విభజన హామీలపై నిజ నిర్ధారణ కమిటీ

జనసేన నేత పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



విభజన హామీల అమలు కోసం నిజ నిర్ధారణ కమిటీ ఒకటి ఉండాలని జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ శనివారం ట్విట్టర్ ద్వారా అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆర్థికవేత్తలు, ప్రభుత్వ మాజీ అధికారులు, విద్యావేత్తలు. సామాజికవేత్తలు, రాజకీయ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులతో జాయింట్ ఫ్యాక్ట్ కమిటీ (జెఎఫ్‌సి)ని ఏర్పాటు చేయడం ద్వారా సమస్యలు పరిష్కరించుకునేందుకు వీలవుతుందని ఆయన పేర్కొన్నారు. విభజన హామీల అమలుకు సంబంధించి నిధుల విడుదల విషయంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య వివాదాలు నెలకొంటున్నాయని, వీటిపై విస్తృత స్థాయిలో చర్చించాల్సి ఉంటుందని తెలిపారు. కేంద్రం విడుదల చేసిన నిధులు. ఆనిధులు ఖర్చు చేసిన విధానం విషయంలోను స్పష్టత లేదని ఉద్ఘాటిస్తూ నిజ నిర్ధారణ కమిటీ అవసరాన్ని ఆయన వివరించారు. ప్రజలకు వాస్తవాలు వెల్లడించేందుకు జాయింట్ పొలిటికల్ యాక్షన్ కమిటీ కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. జెఎఫ్‌సి అందించిన నివేదిక ప్రకారం జాయింట్ పొలిటికల్ యాక్షన్ కమిటీ తన రాజకీయ కార్యాచరణ రూపొందించాల్సి ఉంటుందన్నారు.

హోదాపై టిడిపి నిర్ణయం ప్రకటించాలి

వైసిపి నేత బొత్స

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రత్యేక హోదాపై టిడిపి స్పష్టమైన నిర్ణయాన్ని వెల్లడించాలని వైసిపి నేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన ప్రత్యేక హోదా సాధించే వరకు వైసిపి పోరాటం చేస్తూనే ఉంటుందని మరోసారి స్పష్టం చేశారు. పార్లమెంటు తొలిదశ సమావేశాలు పూర్తి కావడంతో అనుకూల మీడియాను అడ్డం పెట్టకుని కొత్త నాటకాలకు తెరతీశారని ఆయన ధ్వజమెత్తారు. విభజన జరిగి నాలుగేళ్లవుతున్నా... ఏనాడు విభజన సమస్యల గురించి పట్టించుకోలేదని విమర్శించారు. ప్రజల్లో వ్యతిరేకత రావడంతో సంప్రదింపులు, రైల్వేజోన్, స్టీల్‌ప్లాంట్, నాబార్డ్ ద్వారా నిధులు అంటూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. విభజన చట్టంలోని 13వ షెడ్యూల్‌లో చేర్చిన 17 సంస్థల ఏర్పాటుకు సుమారు రూ.12 వేల కోట్లు కావాలని కేంద్ర ఆర్థిక శాఖతో పాటు సంబంధిత శాఖలు చెబుతుంటే...ఇప్పటివరకు రూ.626 కోట్లు కేటాయించి, రూ. 226 కోట్లు మాత్రమే ఇచ్చారని తెలిపారు. విభజన చట్టంలోని అంశాలను ఎప్పటిలోగా పూర్తి చేస్తారనే దానిపై ప్రజలకు వెంటనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

పోలీస్‌కు రూ.4,700 కోట్లు కావాలి

హోం శాఖ బడ్జెట్ ప్రతిపాదనలు
కొత్తగా మూడు పథకాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర 2018-19 వార్షిక బడ్జెట్‌లో రూ.4,721 కోట్లు అవసరమవుతాయని అంచనా వేసి, రాష్ట్ర హోం శాఖ అంశాల వారీగా నిధుల కేటాయింపునకు ప్రభుత్వానికి ప్రతిపాదించింది. రాజధాని నగరాలైన గుంటూరు, విజయవాడల్లో పెద్ద ఎత్తున విఐపిల కార్యకలాపాలు పెరిగినందున పోలీస్ ఉన్నతాధికారులు ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. రాజధాని ఖర్చుల కోసమే సుమారు రూ.519 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. అవసరమైన సందర్భంలో కేంద్ర బలగాలను వినియోగించుకోవడానికి కూడా రూ.22 కోట్లు కోరుతున్నారు. సుమారు 57 వేల మంది పోలీస్ సిబ్బందికి రవాణా ఛార్జీలకు సుమారు రూ.200 కోట్లు వ్యయం కాగలవని పేర్కొన్నారు. మావోయిస్టులను దీటుగా ఎదుర్కొనేందుకు సమర్థమైన ఇన్‌ఫార్మర్ వ్యవస్థను నిర్మించుకునేందుకు రూ 4 కోట్లు అడిగారు. కొత్తగా మోడల్ పోలీస్ స్టేషన్ల నిర్మాణం, సొంత పోలీస్ భవనాలతో పాటు కీలకమైన ఆయుధాల కొనుగోలు మొదలైన వాటికి బడ్జెట్ కేటాయింపుల ప్రతిపాదనలను చేశారు. మూడు కొత్త పథకాలతో ప్రజలకు మరింత దగ్గరయ్యేందుకు ఈఏడాది పోలీస్ శాఖ సిద్ధమైంది. వీటికి నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదించారు. అనంతపురం, కడప జిల్లాలకే పరిమితమైన మహిళా పోలీస్ వాలంటీర్స్ (ఎమ్‌పివి) పథకాన్ని రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు విస్తరించడానికి ప్రణాళిక సిద్ధమై ఉంది. ఈ పథకం ద్వారా మహిళలకు మరింత రక్షణ లభిస్తుందని, బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, గృహహింస కేసులు తగ్గే అవకాశముంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. నేషనల్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ సిస్టమ్ (ఎన్ఈఆర్ఎస్) పథకం 112 నంబర్‌ను టెలికమ్యూనికేషన్ శాఖ వారు ఏర్పాటు చేశారు. దీని ద్వారా రాష్ట్ర ప్రజలందరూ పోలీస్ శాఖ ద్వారా అన్ని విధాలా సహాయ సహకారాలు పొందేందుకు వీలుగా ఆ పథకాన్ని అమలు చేయడానికి సుమారు రూ.76 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదించారు. స్టూడెంట్ పోలీస్ క్యాడెట్ (ఎస్‌పిసి) పథకం ద్వారా రాష్ట్రంలోని విద్యార్థులకు పౌర స్పృహతో పాటు సమాజం మీద అవగాహన కల్పించడానికి నిర్ణయించారు. సమాజం పట్ల అవగాహనతో బాధ్యతాయుతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దడానికి 8, 9 తరగతుల విద్యార్థులకు వారానికి ఒక్కసారి రెండేళ్ల తరగతులను నిర్వహించనున్నారు. ఈ పథకాన్ని అమలు చేయడానికి రాష్ట్ర వ్యాప్తంగా 180 పాఠశాలలను పోలీస్ శాఖ ఎంపిక చేసింది.

లోక్ అదాలత్‌లో 28 వేల కేసులు పరిష్కారం

ప్రజాశక్తి - హైదరాబాద్

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో జరిపిన లోక్ అదాలత్‌లో ఒక్కరోజే ఏకంగా 28 వేల కేసులు పరిష్కారమయ్యాయి. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో శనివారం లోక్‌అదాలత్‌లను నిర్వహించారు. వాటిలో 28 వేల కేసుల పరిష్కారం ద్వారా రూ. 58.4 కోట్ల మేరకు కక్షిదారులకు పరిహార చెల్లింపులయ్యాయి. తెలంగాణలో పది వేల కేసులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 18 వేల కేసులు పరిష్కారమయ్యాయి. తెలంగాణలో రూ.26 కోట్లు, ఏపిలో రూ.32 కోట్లకుపైగా పరిహార చెల్లింపులకు కేసుల్లోని ఇరుపక్షాల వారు అంగీకరించారు. హైకోర్టు లీగల్ సర్వీసెస్ అథారిటీ నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 500 కేసుల ద్వారా 6.5 కోట్లు పరిహార చెల్లింపులకు ఆమోదం లభించింది.

సేద్యం, ఉపాధి అజెండాగా తెలంగాణలో కొత్తగా జెఎసి పార్టీ

- 'తెలంగాణ జన సమితి' పేరుకు మొగ్గ
- మార్చి 10న ముహూర్తం.?
- వివిధ పార్టీల నేతలతో కోదండరామ్ చర్చలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయం, ఉపాధి అజెండాగా జెఎసి ఛైర్మన్ కోదండరామ్ నేతృత్వంలో పార్టీ ఏర్పాటుకు ముహూర్తం ఖరారైంది. వచ్చే నెల 10న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించి పార్టీ పేరును ప్రకటించాలని జెఎసి నిర్ణయించింది. ఇప్పటికే అజెండా కూడా రూపొందించుకున్నారు. ఈలోగా పార్టీ పేరు, గుర్తుపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జెఎసిని పార్టీగా మార్చాలని తీవ్రస్థాయిలో ఒత్తిడి వస్తోంది. పార్టీగా ఏర్పడే విషయంలో ఏడాదిగా సానుకూలంగా ఉండే శక్తులతో విస్తృతంగా చర్చలు సాగించింది. ఆ తరువాతే పార్టీని ఏర్పాటు చేసే అంశంపై సానుకూల నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయం, నిరుద్యోగంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న అభిప్రాయంతో ఉన్న జెఎసి, ఈ రెండు అంశాలనే తమ పార్టీ అజెండాగా మార్చుకోవాలని నిర్ణయానికి వచ్చింది.



మూడు పేర్ల పరిశీలన

పార్టీ పేరుపై జరుగుతున్న చర్చల్లో మూడు పేర్లు పరిశీలనకు వచ్చినట్టు తెలుస్తోంది. తెలంగాణ జన సమితి, తెలంగాణ సకల జనుల పార్టీ, తెలంగాణ ప్రజా సమితి పేర్లపై చర్చిస్తున్నారు. వీటిలో 'తెలంగాణ ప్రజా సమితి' పేరుతో ఇప్పటికే పార్టీ కొనసాగుతోంది. మిగిలిన రెండు పేర్లు కూడా రిజిస్టర్ చేసుకోవడానికి కేంద్ర ఎన్నికల సంఘానికి దరఖాస్తులు కూడా పంపించినట్టు తెలుస్తోంది. పంపించిన వారు కూడా జెఎసి నేతలకు దగ్గర సంబంధాలున్న వారేనని సమాచారం. ఈ మూడు పేర్లలో తెలంగాణ జన సమితి పేరువైపు జెఎసి నేతలు మొగ్గు చూపుతున్నారని సమాచారం. టిజెఎస్ పేరుతో పిలవడానికి కూడా అనుకూలంగా ఉందన్న అభిప్రాయానికి కూడా వారు వచ్చినట్టు తెలుస్తోంది. పార్టీకి రైతు నాగలి, చక్రం గుర్తును ఎంపిక చేసే అంశంపై జెఎసిలో చర్చ జరుగుతోంది. పార్టీ ఏర్పాటులో భాగంగా జెఎసి ఛైర్మన్ కోదండరామ్ ఇతర పార్టీల నేతలతో నిత్యం చర్చలు జరుపుతున్నారు. టిఆర్ఎస్, కాంగ్రెస్, టిడిపి, బిజెపి పార్టీల్లోని మంచిపేరున్న వారితో ఆయన చర్చలు జరుపుతున్నట్టు జెఎసి నేతలు చెబుతున్నారు.



మాస్టర్ ఆరేటర్ కాంటెస్ట్-2లో నారాయణ విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మాస్టర్ ఆరేటర్ కాంటెస్ట్-2లో నారాయణ విద్యార్థినులు సత్తా చాటారు. విజయవాడలోని కానూరులోని కెన్నడి క్యాంపస్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆంధ్ర లయోలా కాలేజ్ మాజీ ప్రొఫెసర్ యం.సి దాస్, డెక్కన్ టుబాకో ఎంటర్ ప్రైజెస్ డైరెక్టర్ షఫీక్ ఖాన్, నారాయణ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ హెడ్ విజయలక్ష్మి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా యంసి దాస్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు మాట్లాడే విధానంలో చాలా మార్పులు తీసుకొస్తుందన్నారు. నారాయణ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సిందూర మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నారాయణ విద్యా సంస్థల్లో ఒక భాగమన్నారు.మూడు కేటగిరీల్లో జరిగిన పోటీల్లో సబ్‌జూనియర్ కేటగిరిలో పి.హాసిని ప్రథమస్థానంలో నిలవగా, వైష్ణవి, హర్షిత వరుసగా ద్వితీయ,తృతీయ బహుమతులు గెలుచుకున్నారని తెలిపారు. జూనియర్ కేటగిరిలో హాసిని సత్యప్రసన్న కుమారి మొదటి బహుమతి గెలుచుకోగా, సి.ఠాగూర్ రెండవ బహుమతి, కార్తీక్ మూడవ బహుమతి గెలుచుకున్నారని చెప్పారు. సీనియర్ కేటగిరిలో వంశీ త్రివేణి మొదటి బహుమతి గెలుచుకోగా, చరణ్‌రెడ్డి రెండవ బహుమతి, వైష్ణవి మూడో బహుమతి గెలుచుకున్నట్లు తెలిపారు. నారాయణ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ హెడ్ విజయలక్ష్మీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నారాయణ విద్యా సంస్థలకు చెందిన జీఎంలు, డివిజనల్ జీఎంలు, ప్రోగ్రామ్ ఇన్‌ఛార్జులు, ప్రిన్స్‌పాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశాఖలో విజేతలు..

నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్-వైజాగ్ ఆధ్వర్యంలో మాస్టర్ ఆరేటర్ కాంటెస్ట్-2 ప్రతి ష్టాత్మకంగా జరిగింది. విశాఖలోని ఆనందపురంలలో నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సబ్‌జూని యర్ కేటగిరిలో సాత్విక ప్రథమ స్థానంలో నిలవగా, శ్రీజ, వర్షిణిరెడ్డి వరుసగా ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. జూనియర్ కేటగిరిలో సాయి రోహన్ మెదటి బహుమతి గెలుచుకోగా, అస్మిత రెండో బహుమతి, ఓం సిద్ధార్థ మూడో బహుమతి గెలుచుకున్నారు. సీనియర్ కేటగిరిలో హేమాంజలి మొదటి బహుమతి గెలుచుకోగా, పావని రెండో బహుమతి, ప్రగ్య మూడో బహుమతి గెలుచుకున్నారు. పెయింటింగ్ విభాగంలో పలాసకు చెందిన విద్యార్థులు రెండు బహుమతులు గెలుచుకున్నారు.

కార్డియాలజీ విభాగాన్ని పరిశీలించిన ఎమ్‌సిఐ బృందం

ప్రజాశక్తి - కర్నూలు జిల్లా పరిషత్

కర్నూలు జిల్లాలో జీవన్‌ధాన్ కార్యక్రమంలో భాగంగా కర్నూలు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బృందం శనివారం పెద్దాసుపత్రిలో పర్యటించింది. ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పి.చంద్రశేఖర్ కార్డియాలజీ, కార్డియో థొరాసిక్ విభాగాలలోని వసతులు, సౌకర్యాలను గురించి వివరించారు. అత్యాధునిక పరికరా లతో అరుదైన శస్త్రచికిత్సలు, వైద్యం చేస్తున్న విధానాలను వారికి వివరించారు. కార్డియాలజీ విభాగంలో రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, క్యాత్‌ల్యాబ్ గురించి వివరించారు. కార్డియాలజీ, కార్డియో థొరాసిక్ విభాగాలను పరిశీలిం చారు. వారు పంపే నివేదికను బట్టి కర్నూలు పెద్దాసు పత్రికి గుండెమార్పిడి శస్త్రచికిత్సలకు అనుమతి లభిస్తే రాయలసీమ జిల్లాలకే కాకుండా పొరుగు జిల్లాలు, రాష్ట్రాల ప్రజలకు కూడా అన్ని విధాలుగా ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ వైద్య బృందంలో తిరుపతిలోని స్విమ్స్ నుంచి గుండె శస్త్రచికిత్స నిపుణురాలు డాక్టర్ అబా చంద్ర, నిమ్స్ నుంచి డాక్టర్ కార్డియాలజిస్టు లంకా కృష్ణ, నిమ్స్ నుంచి అనస్థీషియా నిపుణులు డాక్టర్ గోపీనాథ్, విజయవాడ నుంచి ఊపిరితిత్తుల వ్యాధుల నిపుణులు డాక్టర్ బాబు లాల్, జనరల్ సర్జన్ డాక్టర్ శివశంకర్‌రావు ఉన్నారు.

ప్రత్యేకం

గంజాయి వెనుక బడా బాబులు

దాడులకూ లొంగని పంట
మన్యంలోని 832 నివాసిత ప్రాంతాల్లో జోరుగా సాగు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి



ఎన్ని దాడులు చేసినా రోజురోజుకూ పెరిగిపోతున్న గంజాయి పంటపై అధికారులు సైతం ఆందోళన చెందుతున్నారు. దట్టమైన అటవీ ప్రాంతాల్లో సాగవుతున్న గంజాయి పంటను నివారించేందుకు తీసుకుంటున్న చర్యలు కేవలం పాతిక నుంచి 30 శాతానికే పరిమితమవుతున్నాయి. పండించేది గిరిజనులే. కానీ వారితో ఆ పని చేయిస్తున్నది మాత్రం బడాబాబులేనని అధికారులు పేర్కొంటున్నారు. అయితే వారి పేర్లు బయటకు రాకపోవడంతో ఏమీ చేయలేకపోతున్నామని నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కువగా విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల మధ్యనున్న మన్యంలోనే గంజాయి సాగవుతున్నట్లు అబ్కారీ శాఖ అధికారులు నిర్ధరించారు. ఒకవైపు గంజాయిని నివారించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుండగా, గంజాయిపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలన్న డిమాండూ మరోవైపు ఊపందుకుంటుండటం విశేషం.

ఒడిశాను ఆనుకుని విశాఖ జిల్లాలోని ఎనిమిది గిరిజన ప్రాంత మండలాల్లో, తూర్పుగోదావరి జిల్లాలోని మూడు గ్రామాల్లోనూ గంజాయి సాగు ఎక్కువగా ఉందని గుర్తించారు. మొత్తం 832 నివాసిత ప్రాంతాల్లో ఈ సాగు జోరుగా సాగుతున్నట్లు ప్రాథమిక అంచనా. కానీ ఇంకా ఎక్కువ జనావాసాల్లోనే సాగు ఉన్నట్లు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో గత ఏడాది సెప్టెంబర్‌లో గంజాయిని నిర్మూలించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. పోలీసులు, రెవెన్యూ అధికారుల సమన్వయంతో దశల వారీగా నిర్వహించిన ఈ డ్రైవ్‌లో దాదాపు 1.64 కోట్ల గంజాయి మొక్కలను ధ్వంసం చేసినట్లు అధికారులు ప్రకటించారు. అది కూడా కేవలం 279 జనావాసాల్లోనేనని వారు వివరిస్తున్నారు. అంటే మొత్తం గంజాయి సాగులో ధ్వంసం చేసినది కేవలం పాతిక శాతం కూడా లేదని సీనియర్ అధికారి ఒకరు విశ్లేషించారు.

ఎక్కువ కేసులు గిరిజనులపైనే

ఈ దాడుల్లో దాదాపు 350 మందిపై కేసులు నమోదుచేశారు. వీరిలో ఎక్కువగా గిరిజనులే ఉన్నారు. తెరవెనుక ఉన్నవారిపై స్పందించకుండా కేవలం గిరిజనులపైనే కేసులు నమోదు చేయడం విమర్శలకు తావిస్తోంది. మారుమూల ప్రాంతాల్లో ఉన్న గిరిజనులకు ఆశలు చూపి, వారిపై ఒత్తిడి పెంచుతూ గంజాయి సాగు చేయిస్తున్నారు. ఈ పంటను ప్రోత్సహిస్తున్న వారిని విడిచిపెట్టి, గిరిజనులపైనే కేసులు పెట్టడం చర్చనీయాంశమవుతోంది. వాస్తవంగా గంజాయిని ప్రోత్సహిస్తున్న వారికి కొంతమంది స్థానిక నేతలు, అధికారుల అండదండలూ ఉన్నాయనే ప్రచారం కూడా సాగుతోంది. అందుకే ఎంతగా మొక్కలను ధ్వంసం చేస్తున్నా, ఈ సాగును నిరోధించలేకపోతున్నారు. ఎప్పటికప్పుడు ఈ సాగు అంతరించక పోగా, కోట్లాది మొక్కలకు విస్తరిస్తున్నట్లు కనిపిస్తోంది.

నిషేధం ఎత్తేయాలనే చర్చ

సిగరెట్, మద్యం వంటి అత్యంత ప్రమాదకరమైన వాటిని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు గంజాయిపై నిషేధాన్ని కొనసాగించడంపైనా మరోవంక చర్చ సాగుతోంది. గంజాయిని కొన్ని ఔషధాల్లో కూడా వినియోగిస్తున్నారు. ప్రత్యేకంగా ఆయుర్వేద మందుల్లో దీన్ని పలు వ్యాధుల నియంత్రణకు వాడతారు. ఇదే సమయంలో కొంతమంది దేవుళ్లను పూజించే సమయంలో కూడా గంజాయిని నైవేద్యంగా పెట్టడం కూడా కద్దు. అందువల్ల దీనిపై నిషేధం ఎందుకన్న ప్రశ్న ఇటీవల వినిపిస్తోంది. గంజాయి అక్రమ రవాణా, సాగు నియంత్రణ వంటి వాటి కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేయడం కన్నా, దీనిపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసి, నియంత్రణకు పటిష్టమైన నిబంధనలు అమలు చేస్తే మేలన్న భావాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో కూడా కొందరు ప్రముఖులు కొన్ని సంస్థల అధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కూడా గంజాయిపై నిషేధాన్ని ఎత్తివేసే అంశంపై విస్తృత చర్చ సాగించడం గమనార్హం.

సంక్షిప్తం

మార్చిలో చలో ఢిల్లీ : రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా మార్చి 6,7,8 తేదీల్లో పార్లమెంట్‌ను ముట్టడించేందుకు చలో ఢిల్లీ నిర్వహించనున్నట్లు పిసిసి అధ్యక్షులు ఎన్ రఘువీరారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు వర్గాల కలిసి రావాలని ఆయన కోరారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ప్రజాగ్రహానికి దర్పణమే ప్రస్తుత నిరసనలని పేర్కొన్నారు. హక్కులను సాధించుకునేలా చలో ఢిల్లీ కార్యక్రమం ఉండాలన్నారు. రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలన్నింటినీ దీనికి ఆహ్వానిస్తున్నా మన్నారు. దీని ద్వారా కేంద్రంతో తాడోపేడో తేల్చుకుందామన్నారు. 6,7 తేదీల్లో దీక్షలు, 8న పార్లమెంట్ ముట్టడి కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈనెల 15 వరకు అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు, 20 నుంచి 28 వరకు అన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయాల వద్ద ఆంధ్రుల ఆత్మగౌరవ దీక్షలు చేయనున్నట్లు చెప్పారు.

విశాఖ జెసికి హైకోర్టు జరిమానా

విశాఖపట్నం జిల్లా అనకాపల్లి షుగర్ ఫ్యాక్టరీలో పని చేసి పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లించాలన్న ఆదేశాల్ని అమలు చేయకపోవడంతో హైకోర్టు ఆ జిల్లా జాయింట్ కలెక్టర్‌పై ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. దీనిపై వివరణ ఇచ్చేందుకు స్వయంగా కోర్టుకు రావా లన్న ఆదేశాల్ని అమలు చేయకపోవడంతో జేసీకి రూ.2 వేలు జరిమానా విధించింది. మహిళా పారిశ్రామికవేత్తల సమావేశం ఉన్నందున రాలేక పోతున్నట్లు జెసి లిఖితపూర్వకంగా చెప్పడంపై హైకోర్టు ఆగ్రహాన్ని తెలిపింది.

ఈశ్వరీయ వర్శిటీ ఆరోపణలపై వివరాలివ్వండి

తాడేపల్లిగూడెం సావిత్రిపేటలోని ఈశ్వరీయ విశ్వ విద్యాలయం పేరిట నిర్వహిస్తున్న అధ్యాత్మిక కేంద్రంలో అసాంఘిక కార్యక్రమాలనే ఆరోపణపై పూర్తి వివరాలు అందజేయాలని పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీని హైకోర్టు న్యాయమూర్తి ఆకుల వెంకట శేషసాయి ఆదేశించారు. వీరేంద్రదేవ్ దీక్షిత్ నడుపుతున్న ఆధ్యాత్మిక విశ్వవిద్యాలయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటూ శ్రీను మరో అయిదుగురు హైకోర్టును ఆశ్రయించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల పేరుతో అక్కడ 22 మంది మహిళల్ని నిర్బంధించారనే పిటిషన్‌ను న్యాయమూర్తి విచారించి ఎస్పీకి నోటీసులు జారీ చేశారు. విచారణ 2 వారాలు వాయిదా పడింది.



భీమవరంలో శనివారం నాడు సిపిఎం మహాసభల సందర్భంగా పతాకావిష్కరణ చేస్తున్న సినియర్ నాయకులు రుద్రరాజు సత్యనారాయణ (ఆర్ఎస్) పక్కన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మధు, కార్యక్రమానికి హాజరైన ప్రతినిధులు

ఉత్తేజపూరిత ప్రారంభం

- సిపిఎం 25వ రాష్ట్ర మహాసభలకు ప్రారంభ సభకు హాజరైన పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి
- పతాకాన్ని ఆవిష్కరించిన రుద్రరాజు సత్యనారాయణరాజు
- ఘనంగా అమరవీరులకు నివాళి
- పలు వామపక్ష పార్టీల నేతల రాక

ప్రజాశక్తి – పర్స సత్యనారాయణ నగర్ (భీమవరం)

సిపిఎం 25వ రాష్ట్ర మహాసభలు పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో శనివారం ఉదయం అత్యంత ఉత్తేజపూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. మహాసభ సందర్భంగా పర్స సత్యనారాయణనగర్‌లోని సింహాద్రి శివారెడ్డి ప్రాంగణానికి (అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం) శుక్రవారం సాయంత్రం నుండే రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి ప్రతినిధులు, పరిశీలకులు చేరుకున్నారు. శనివారం ఉదయానికి ఈ సంఖ్య మరింతగా పెరిగింది. సభల ప్రారంభానికి ముందు అరుణ పతాకాన్ని ఆ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ శాసనసభ్యులు రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) ఆవిష్కరించారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అమరవీరుల స్తూపం వద్ద సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. అనంతరం అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సుత్తి కొడవలి నక్షత్రాన్ని ఎర్రజెండాలతో అత్యంత సుందరంగా అలంకరించారు.

ఎర్రరెని జెండా వెలుగుల జెండా.. వీరుల నెత్తిన పుట్టిన జెండా, ఘనమైన చరిత్ర నీది ఎర్రజెండా.. నీకుంది పేద ప్రజల అండ, ఇదే ఎర్రబాటరా.. ఇదే వెలుగుబాటరా అంటూ ప్రజా నాట్యమండలి కళాకారులు ఆలపించిన పాటలు ఉర్రూతలూగించాయి. ప్రతినిధులు వారితో కోరస్ పాడుతూ ఉత్సాహపరిచారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి వి రాఘవులు, కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు వి శ్రీనివాసరావు, తెలంగాణా రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, ఎంసిపిఐ (యు) నేత వెంకటరెడ్డి, ఆర్ఎస్‌పి తెలుగు రాష్ట్రాల కార్యదర్శి జానకీరాం, ఫార్వర్డ్‌బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి సుందరరామరాజు, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నేత బంగారు రావు, ఎస్‌యుసిఐ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు గోవిందరాజు, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు పాటూరు రామయ్య, ఎంఎ గఫూర్, ఎస్ పుణ్యవతి, కె హేమలత, ఆర్.అరుణ్‌కుమార్, సీనియర్ నేత భిక్షవతి, పలువురు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వరుసగా అమరవీరులకు నివాళు లర్పించారు. ఆ తరువాత రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా నాయకులు, ప్రతినిధులు, అభిమానులు నివాళులర్పించారు.

అమర వీరుల ఆశయాలు సాధిస్తాం అంటూ ప్రతినిధులు నినదించారు. వృద్ధులు, మహిళలు సైతం తమ వంతు వచ్చే వరకూ ఎర్రటి ఎండలోనే వరుసలో వేచి ఉండి నివాళులర్పించడం వారి క్రమశిక్షణను ప్రస్ఫుటపరిచింది. ఈ సందర్భంగా వర్ధిల్లాలి ఎర్రజెండా.. వర్ధిల్లాలి ప్రజా పోరాటాలు.. వర్ధిల్లాలి మార్క్సిజం.. లెనినిజం అంటూ కార్యకర్తల నినాదాలతో ప్రాంగణం మార్మోగింది.. ఈ ప్రాంగణాన్ని అరుణపతాకాలతో తీర్చిదిద్దారు. రెడ్‌షర్ట్, రెడ్‌శారీ వలంటీర్లతో ప్రాంగణం మరింత ఎరుపెక్కింది. మీడియా ప్రతినిధులు, సభ ప్రారంభానికి వచ్చిన అభిమానులు, ప్రతినిధులు తమ తమ కెమెరాలు, సెల్‌ఫోన్లతో దృశ్యాలను చిత్రీకరించడంలో పోటీపడ్డారు. కార్యక్రమంలో నేతలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు స్వాగతం పలికారు.







అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ఏచూరి, రాఘవులు, మధు, శ్రీనివాసరావు, సిపిఐ రామకృష్ణ ప్రభృతులు



అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీతారామ్ ఏచూరి

పేదలపై దౌర్జన్యాలు సాగనివ్వం : మధు

- టిడిపి పాలనలో దళిత, గిరిజన, నిర్వాసితులకు రక్షణ లేదు
- ఆక్వాయూనివర్శిటీ పెడితే బలపరుస్తాం...
- సిపిఎం 25వ రాష్ట్ర మహాసభల బహిరంగ సభలో కార్యదర్శి పి.మధు



ప్రజాశక్తి – ప్రత్యేక ప్రతినిధి సత్యనారాయణనగర్ భీమవరం

రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలపై పెద్దఎత్తున చేస్తున్న దౌర్జన్యాలను ఇకపై సాగనవ్వమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి. మధు అన్నారు. ‘ ఇదేం పాలన? పేదల భూములను గుంజుకుంటున్నారు. న్యాయం చేయమని అడిగితే దౌర్జన్యాలకు దిగుతున్నారు. ఇకపై వీటిని సాగనివ్వం. ఎక్కడికక్కడ అడ్డుకుంటాం. ఈ విధానాలను తిప్పికొడతాం’ అని ఆయన అన్నారు. శనివారం సాయంత్రం పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణంలోని అల్లూరి సీతారామరాజు నగర్ (లూథరన్ గ్రౌండ్)లో పార్టీ 25వ రాష్ట్రమహాసభల సందర్భంగా జరిగిన బహిరంగ సభలో మధు మాట్లాడుతూ ‘పోలవరంలో గిరిజనం మునిగిపోతుంటే ఎన్‌టిఆర్ ఇళ్లంటూ గిరిజనుల మధ్య తగాదాలు పెడుతున్నారు. . సాగు భూములకోసం పోరాడే మహిళలపై ఒక్కొక్కరిపై 90 కేసులు పెట్టారు. వంశధారలో 24ఊళ్లను బుల్డోజర్‌తో కూల్చేశారు. గరగపర్రులో అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టనివ్వరు. గండికోటలో నీరిస్తామని చెప్పి నిర్వాసితులను ముంచేసే యత్నం చేశారు. . గుంటూరు జిల్లా ఎండవిల్లిలో పేదల భూములు 450 ఎకరాలను టిడిపి వారే గుటకాయ స్వాహాచేశారు. ఈ విధానాలను ఇంకా సహించాలా?’ అని ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పద్ధతేమాత్రం బాగోలేదన్నారు. ఈ మూడున్నరేళ్ల కాలంలో రాష్ట్రంలో ప్రజలకిచ్చే మాటలు నీటిమూటలుగా మిగిలాయన్నారు.

తుందుర్రులో రొయ్యల పరిశ్రమ వద్దని ప్రజలు, తమ పార్టీ చెబుతున్నారన్నారు. కానీ గొయ్యిలు తీసి తాగు, సాగునీటిని కలుషితం చేశారని, తుందుర్రు, బేతంపూడి, బేతయ్యపాలెం తదితర 4 గ్రామాల్లో 40వేల ఎకరాల గ్రామ మత్స్యకారుల బతుకు తెరువు పోతుందని ఎంత చెప్పినా చంద్రబాబు లెక్కజేయకుండా దమనకాండకు పాల్పడుతున్నాడంటూ మధు ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘వీటిని ప్రతిఘటించవద్దా... ఆ గ్రామాల ప్రజలు అదే చేశారు.’ అని చెప్పారు. ‘ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడి విషవాయువులు వదిలే పరిశ్రమలు వద్దు. ప్రభుత్వానికి అంత చిత్తశుద్ధి ఉంటే ఇక్కడ అక్వా యూనివర్శిటీ పెట్టమనండి. మేం కూడా బలపరుస్తాం’ అని చెప్పారు. తణుకు నుంచి వచ్చే డ్రెయిన్‌లో రొయ్యల పరిశ్రమ వచ్చాక కాలుష్యం పేరుకుపోవడంతో ఆ నీటిలో వేలుపెట్టలేని పరిస్థితి నెలకొందన్నారు. ఆంధ్రాయూనివర్శిటీ, నాగార్జున యూనివర్శిటీ శాస్త్రవేత్తల బృందం ఈ ప్రాంతంలో పర్యటించి, చట్టవిరుద్ధంగా వ్యవహారం ఉందని తేల్చిందని, 8 నెలలు మూసెయ్యాలని కమిటీ చెప్పిందన్నారు. ఆ తరువాత చంద్రబాబు యనమదొర్రు డ్రైన్ పరిసరాల్లో కాలుష్య నివారణ కోసం రూ.900కోట్లు ఖర్చుపెడతామని చెప్పారని, ఇప్పటివరకు ఒక్కపైసా కూడా కేటాయించలేదని చెప్పారు. . రాష్ట్రంలో దేవరాపల్లి, గొట్టిపాడు, గరగపర్రు, మహాభారతం ఇలా ఎక్కడ చూసినా దళితులకు, పేదలకు తెలుగుదేశం పాలనలో రక్షణ లేకుండాపోయిందని ఆవేదన చెందారు. ఈనేపథ్యంలో అన్ని తరగతులనూ కలుపుకుని సిపిఎం పోరాడుతోందని, వీటిని మరింత విస్తృతం చేసేందుకు ఈ మహాసభల్లో చర్చించి కార్యాచరణ తీసుకుంటామని చెప్పారు. అల్లూరి సీతారామరాజు భీమవరంలో పుట్టి బ్రిటిష్ వారిని గడగడలాడించాడని, సిపిఎం ఇక్కడ జరిగే 25వ మహాసభలలో అదే స్ఫూర్తితో కర్తవ్యాలు తీసుకుంటామని అన్నారు. బిజెపితో పొత్తు ఉన్నప్పటికీ చంద్రబాబుకు ప్రధాని 16 నెలల పాటు ఇంటర్వ్యూ ఇవ్వలేదని అన్నారు. ఈ వాస్తవాన్ని విస్మరించి గత ప్రభుత్వాలు అంజయ్యను, సంజీవరెడ్డిని అవమానించాయని ప్రధాని నరేంద్ర మోడీ చెబుతున్నారని అన్నారు. ‘చెప్పేముందు ... మీ సంగతి చూసుకోండి’ అని ప్రధాని నుద్దేశించి అన్నారు. కడపలో ఉక్కు పరిశ్రమ కోసం పోరాటాన్ని తమ పార్టీ కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.



సిపిఎం 25వ రాష్ట్ర మహాసభల సందర్భంగా భీమవరం లూథరన్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో జరిగిన బహిరంగ సభ దృశ్యం, ప్రసంగిస్తున్న ఏచూరి, వేదికపై నాయకులు

రాష్ట్రాలు వేరైనా సమస్యలు అవే : తమ్మినేని



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి – పర్స సత్యనారాయణ నగర్ (భీమవరం)

తెలుగు రాష్ట్రాలు వేరైనా, సిఎంలు వేరుపడినా ప్రజల ఒరిగిందేమీ లేదని, రెండు రాష్ట్రాల్లోనూ ప్రజల కష్టాలు తీరలేదని సిపిఎం తెలంగాణా రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. భూమికోసం, భుక్తి కోసం,హక్కుల కోసం రెండు రాష్ట్రాల్లో పోరాటాలు సాగుతున్నాయని వివరించారు. దేశ అభివృద్ధి జిడిపి 7.5 శాతం ఉందని ప్రధాని మోడీ, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి జిడిపి 10 శాతం ఉందని ముఖ్యమంత్రి కెసిఆర్ గొప్పగా చెప్పుకుంటున్నారని, జిడిపి ఎంత పెరిగితే ఏం లాభమని ఆయన ప్రశ్నించారు. ప్రజల అభివృద్ధి ముఖ్యమని, జీవితాలు అభివృద్ధి చెందకుండా కార్పొరేట్ రాజకీయ నాయకులు జేబులు నింపే అభివృద్ధి ఎవరికి కావాలని ఆయన సూటిగా ప్రశ్నించారు. దేశమంటే మట్టికాదని, దేశమంటే మనుషులని గురజాడ చెప్పిన మాటలు మాన పాలకుల చెవికి ఎక్కడం లేదని విమర్శించారు. అభివృద్ధంటే విద్య, వైద్యం, ఉద్యోగం, భూమి అందరికీ ఉన్నప్పుడే అది నిజమైన అభివృద్ధి అని పించుకుంటుందని తెలిపారు. రెండు రాష్ట్రాల్లోనూ ప్రజల అభివృద్ధి కోసం పోరాడేది కమ్యూనిస్టు పార్టీ ఒక్కటేనని అన్నారు. తెలంగాణాలో ప్రధాన పాలకవర్గ పార్టీలను గద్దె దించేందుకు ప్రత్యామ్నాయ విధానాలను ముందుకు తెచ్చేందుకు 28 పార్టీలతో కూడిన బహుజన లెఫ్ట్ ఫ్రంట్(బిఎల్ఎఫ్) ఏర్పాటు చేశామని అన్నారు. కమ్యూనిస్టులు కేవలం నయాఉదారవాద విధానాల ఆర్థిక విధానాలతోపాటు, కుల ఆధిపత్యంపై పోరాడుతుందన్నారు. ప్రత్యామ్నాయ నమూనాను ప్రజలు ఆదరించాలని ఆయన కోరారు.

కమ్యూనిస్టులు క్రియాశీల పాత్ర పోషించాలి

వామపక్ష నేతల సౌహార్ద్ర సందేశాలు

ప్రజాశక్తి – పర్సా సత్యనారాయణ నగర్ (భీమవరం)



మూడున్నరేళ్లుగా సంఘపరివార్ శక్తులు రెచ్చిపోయి దళితులు, మైనారిటీలు, జర్నలిస్టులు, కమ్యూనిస్టులపై విచ్చలవిడిగా దాడులు చేస్తున్న పరిస్థితుల్లో కమ్యూనిస్టులు క్రియాశీల పాత్ర పోషించాలని, లౌకిక ప్రజాతంత్ర శక్తులను కూడగట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సూచించారు. భీమవరంలో శనివారం ప్రారంభమైన సిపిఎం 25వ రాష్ట్ర మహాసభల్లో ఆయన సౌహార్ద్ర సందేశమిచ్చారు. రాష్ట్రంలో ఇంత అధ్వానమైన పరిపాలన మనం ఎప్పుడూ చూడలేదని, చంద్రబాబు పాలనలో కన్ఫ్యూషన్, కరప్షన్ అన్ని రంగాల్లోకి చొచ్చుకుపోయిందని విమర్శించారు. ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు బీరువా అయితే ఉందిగానీ, లోపల అంతా ఖాళీ అయిపోయిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు తాను చెట్టుకింద నుంచి పరిపాలన చేశానని చెప్పారని, ఇలాంటి స్థితిలో రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ ఎలా తయారు చేస్తున్నారని ప్రశ్నించారు. హైదరాబాద్ లేకుండా కేవలం మన 13 జిల్లాల ద్వారా రూ.2లక్షల కోట్ల ఆదాయం ఎలా వస్తుందని అన్నారు. ఈ మూడున్నరేళ్లలో చంద్రబాబు ఒక్క అంశంపై కూడా అఖిలపక్షం వేయలేదని అన్నారు. కమ్యూనిస్టు పార్టీలకు కనీసం నలుగురు ఎమ్మెల్యేలున్నా ప్రజల ఆకాంక్షలు, వారి గొంతు వినిపించడానికి వీలయ్యేదన్నారు.

ఆర్ఎస్‌పి తెలుగు రాష్ట్రాల కార్యదర్శి జానకిరాములు



ఆర్ఎస్ఎస్ గూండాలు, బిజెపి గూండాలు దేశాన్ని విడదీసి పాలిస్తున్నారని, విదేశాల్లోని నల్లధనం తెస్తానని, దేశంలో సంపద పోగేసుకొని పారిపోయిన విజయమాల్యాని తీసుకొస్తానని మోడీ చెప్పిన మాటలేవీ నెరవేరలేదని ఆర్ఎస్‌పి తెలుగు రాష్ట్రాల కార్యదర్శి జానకి రాములు విమర్శించారు.జాతీయ స్థాయిలో వామపక్షాలు ఒక ఫ్రంట్‌గా ఏర్పడాలని సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఒక ప్రయత్నం జరిగిందని గుర్తు చేశారు.

పార్వర్డ్‌బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి సుందరరామరాజు



పశ్చిమ గోదావరి జిల్లాలోని యండగండిలో 1934లో కమ్యూనిస్టు పార్టీ తొలిశాఖ ఏర్పడిందని ఈ రోజు ఈనాడు పేపర్లో చదివానని, మళ్లీ ఈ మహాసభ ద్వారా ఇక్కడ నుంచే పోరాటాలు వెల్లువలా సాగించే కార్యాచరణ ప్రారంభం కావాలని ఫార్వర్డ్‌బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి సుందరరామరాజు మహాసభలో సందేశమిస్తూ సూచించారు. ప్రజాసమస్యలపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు తరచూ తనతో సంప్రదింస్తుంటారని చెప్పారు.

తుందుర్రు, గరగపర్రు ఉద్యమాలు ఇక్కడే జరిగాయని, వాటిని అధ్యయనం చేయాలని తనను కోరేవారని గుర్తుచేశారు.

సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బంగారాజు



మోడి, చంద్రబాబు ప్రభుత్వాల పుణ్యమాని మనకు మంచి రోజులు రానున్నాయని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బంగారాజు తమ సందేశంలో ఆశాభావం వ్యక్తం చేశారు. మోడీ, చంద్రబాబు పాలనలో 99 శాతం ప్రజలకు కష్టకాలం దాపురించిందని, ఒక శాతం కార్పొరేట్లకు మంచికాలం వచ్చిందన్నారు. దేశంలో పరిస్థితులు ఫాసిజానికి దగ్గరగా ఉన్నాయని, ఆనాడు జర్మనీలో ఫాసిస్టు దాడులకు తీసుపోని తరహాలో నేడు దేశంలో ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో పాలన సాగుతోందన్నారు. మహాసభ దిగ్విజయం కావాలని ఆకాంక్షించారు.

ఎస్‌యుసిఐ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు గోవిందరాజులు



దేశంలో ఒక్క ఆర్థిక రంగంలోనేగాక, రాజకీయ, సామాజిక రంగాల్లో కూడా సంక్షోభం తలెత్తిందని ఎస్‌యుసిఐ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు గోవిందరాజులు తమ సందేశంలో స్పష్టం చేశారు. పెట్టుబడిదారీ వ్యవస్థ ఈ సంక్షోభం నుంచి బయటపడే ప్రసక్తే లేదన్నారు ప్రజలను చీల్చే పాలకవర్గాల కుట్రలను వామపక్ష శక్తులు ప్రజల ఐక్యతతో సాగనివ్వకుండా చేయాలని అంటూ మహాసభ ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎంసిపిఐ (యు) రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి



బీహారులో గత ఎన్నికల ముందు కేంద్ర పాలకులు 1,65,000 కోట్లు సాయం ప్రకటించారని, కానీ మన రాష్ట్రానికి ఏమీ అమలు చేయలేదని ఎంసిపిఐ (యు) రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి విమర్శించారు. ప్రస్తుతం ఎన్నికలు తరుముకొస్తున్నాయి గనుక ఇన్నాళ్లూ మిన్నకుండి చంద్రబాబు ఇప్పుడు కేంద్రాన్ని విమర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. అవిభక్త కమ్యూనిస్టు పార్టీ భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం అనేక త్యాగాలు చేసిందని, ప్రస్తుతం కొంతమంది వల్ల తెలుగు జాతి విచ్ఛిన్నం అయిందనన్నారు. దివీస్ ఉద్యమంలో అక్కడ ఎస్ఐ.. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధును తలకాయ పట్టుకొని ఈడ్చి వేశాడని, పోలీసులు టిడిపి గూండాలుగా వ్యవహరిస్తున్నారని, పోలీసులు ఖాకీ బట్టలు విడిచి టిడిపి పసుపు బట్టలువేసుకోవడం మంచిదని ఎద్దేవా చేశారు. తుందుర్రు ఉద్యమంలోనే ఒక మహిళను అరెస్టు చేసి జైలుకు పంపారని గుర్తుచేశారు. ఇలాంటి పరిస్థితుల్లో వామపక్షాలు ఐక్య పోరాటాలు చేయాలని కోరుతూ మహాసభకు విప్లవాభివందనాలు తెలియజేశారు.

సంపాదకీయం

ప్రేమ బంధం

ప్రేమ - సప్తవర్ణ రంజితం... సప్తస్వర సంగమం. ప్రేమ అనేది మరొక వ్యక్తి కొరకు సున్నితంగా పదిల పరచుకొనే ఒక లోతైన, అవ్యక్త భావన. నూరు వసంతాల సౌందర్య శోభ. వేల నక్షత్రాల ఉజ్జ్వల కాంతి. లక్ష ఉషస్సులను తనలో ఇముడ్చుకున్న వెలుగు. ఈ రెండక్షరాల పదం... మనిషికి జీవన పథం. ఈ సువిశాల విశ్వంలో మానవాళి ఎన్నో ప్రేమకథలు విన్నది. అద్భుతమైన కవితా స్రవంతులకాలవాలమైన అనురాగ సుధలను నెమరువేసుకొన్నది. ప్రేమ పేరుతో ప్రబంధాలు వెలిశాయి. అయితే ఒకే ఆశయం కోసం ఉమ్మడి ప్రయాణంలో మొగ్గ తొడిగి, జీవితాలను కలిపిన ప్రేమ ఉన్నతమైనది. అటువంటి ప్రేమగాథలు చరిత్రలో చాలా ఉన్నాయి. జెన్నీ- కారల్‌మార్క్స్‌ల ప్రణయగాథ అటువంటిది. మనసున మనసై... బతుకున బతుకై, నేనున్నానని నిండుగ పలికి- తన ప్రియుడు, జీవిత భాగస్వామి మార్క్స్‌కు తాను జీవించినంత కాలం ఊపిరిగా ఉత్తేజాన్నిచ్చిన జెన్నీ... అసలైన ప్రేమకు నిర్వచనం. 'ప్రేమ' అంటే ఏమిటో తెలియక ప్రేమనే భ్రమల్లో కొట్టుమిట్టాడుతున్న నేటి యువతకు జెన్నీ-మార్క్స్‌ల ప్రేమ ఆదర్శనీయం. 'పెట్టుబడి' గ్రంథంతో ప్రపంచ గతినే మార్చిన మార్క్స్... యువకుడిగా వున్న సమయంలో అంతే అందంగా ప్రేమ లేఖలూ రాశాడు తన ప్రియమైన జెన్నీకి. 'ఈ జగతి నందించు/ కీర్తి భాగ్యములైన/ కొరగావు/ నీ కనుల కొస మెరుపుకూ/ సరిగావు/ నీ ఎద యిచ్చు నులివెచ్చకూ/ నా గీతి నీలోన స్పందనలు కలిగించి/ ఆవేశమున నీ నయన ద్వయంబు/ జాలు వార్చే బాష్పకణములేమిన్న/ ఆ కీర్తి కన్నా...' ప్రపంచం నాలుగు చెరగులా వ్యాపించే కీర్తికన్నా, సుఖ సౌభాగ్యాల కన్నా... నీ కంటి కొస మెరుపు, ఎద యిచ్చే నులివెచ్చనే గొప్పది- అంటూ సాగిన ఒక భావకుని గీతం ఇది. వయసు, ఆరాధన రంగరించిన ఆవేశం ఇది. ఒక యువ రక్తపు పొంగు ఇది. జెన్నీకి మార్క్స్ అందించిన గేయ సందేశం ఇది. వీరి ప్రేమ వయసు పొంగులో ఉదయించినది కాదు. 'పడుచుదనముతో చిగురించు వలపు- కృశించు జరాక్రాంత (వృద్ధులయ్యే) దశల' అన్నట్టుగా వీరి ప్రేమ ప్రపంచానికి ఆదర్శప్రాయం. అందుకే అంటాడు గురజాడ- 'మరులు ప్రేమని మది దలంచకు/ మరులు మరలును వయసు తోడనె/ మాయ మర్మములేని స్నేహము, బతుకు సుకముకు రాజమార్గము' అని. 'జీవించినందుకు రెండే ఫలితాలు. తీవ్రమైన ప్రేమతో జీవితం వెలగాలి; లేకపోతే విరహంతో కాలిపోవాలి. అంతే కాని ధనమూ, సుఖమూ, భోజనమూ- ఇవన్నీ కలిగి బతకడం ఎందుకు' అంటారు చలం.

ప్రతి యేటా ఫిబ్రవరి 14న విశ్వవ్యాప్తంగా ప్రేమికులు జరుపుకొనే ఉత్సవం 'వాలెంటైన్స్ డే'. 'ఎద ఎదలో చినుకులా రాలుతుంది. నదులుగా సాగుతుంది. కడలిలా పొంగుతుంది. రుతువులై నవ్వుతుంది. మౌనమై మెరుస్తుంది. గానమై పిలుస్తుంది' అంటూ- ప్రేమలోని రమణీయతను కళ్లకు కడతారు సినీకవి వేటూరి. 'భువనమైనా, గగనమైనా ప్రేమమయమే సుమా- ప్రేమ మనమే సుమా' అని ఆశీరక్షతలుగా శిరస్సులపై జల్లుకుంటూ, ప్రేమజంటలు చెట్టపట్టాలుగా సాగిపోయే వేడుక ఇది.

కానీ ఈ ప్రేమ నేడు మార్కెట్ అయింది... సున్నిత పార్శ్వాల్ని కోల్పోయింది. మార్కెట్ మాయాజాలంలో ఖరీదైన వ్యవహారంగా పరిణమించింది. 'మితంగా ప్రేమించడం కంటే... ప్రేమను వదులుకోవడమే సులభమని' ఓ కవి అన్నట్టుగా... అమితంగా ప్రేమించామని చెప్పుకోడానికి వీలైనంత ఎక్కువగా ఖర్చు పెట్టేందుకు సిద్ధపడుతోంది యువతరం. ఇలా సిద్ధపడేట్టు చేయడమే మార్కెట్ వ్యూహం. అనేకానేక దినాల మాదిరిగానే ప్రేమను కూడా ఒక రోజుకు పరిమితం చేశారు. 'వాలెంటైన్స్ డే' పేరుతో ఏ యేటికాయేడు కోట్లాది రూపాయల వ్యాపారంగా మార్చారు. ప్రేమకు చిహ్నమైన రోజాల్ని కొనాలంటే వందలు ఖర్చు చేయాల్సిన కరకు వాస్తవాన్ని కళ్లముందుంచింది మార్కెట్. రాజ శాసనాలను సైతం ధిక్కరించిన ప్రేమ... మార్కెట్ మాయాజాలం నుంచి తప్పించుకోలేకపోతోంది. దాని ఫలితమే ప్రేమ పేరుతో జరిగే కోట్లాది రూపాయల వ్యాపారం. 'ఋతువులతో సంబంధం లేకుండా ఎప్పుడైనా, ఎక్కడైనా మొగ్గ తొడిగి, వికసించే అపురూపమైన పుష్పం ప్రేమ' అని అభివర్ణించాడు ఖలీల్ జిబ్రాన్. ప్రేమ ఒకరోజుతోనో, రెండు రోజా పూవులివ్వడంతోనో ముగిసిపోయేది కాదు. జీవితకాలం కొనసాగే సజీవ స్రవంతి. ప్రేమ వైఫల్యంలోనూ ప్రేమను అంకురింపచేసుకోవాలి. అందుకే అంటారు ప్రేమ గెలిచినా ఓడినా మధురంగానే వుంటుందని.

అంతటి మధురమైన ప్రేమకు సమాధి కట్టాలనుకునే మూర్ఖులు బయలు దేరారు దేశంలో. సమాజంలోని అన్ని రంగాలనూ నాశనం చేస్తున్న ఆర్ఎస్ఎస్ కాషాయపరివారం ప్రేమను కూడా నాశనం చేయడానికి 'రోమియో' దళాల పేరుతో ప్రయివేటు సైన్యాన్ని ఏర్పాటు చేసింది. ఎక్కడ ప్రేమ ఉంటే అక్కడ వాలి యువతీయువకుల్లోని ప్రేమభావాన్ని పారదోలడమే ఈ మూర్ఖ సైనికుల పని. ప్రేమ లేని చోట మానవత్వం ఉండదు. మానవత్వాన్ని నాశనం చేయాలనుకునే దుష్టులే ప్రేమను కూడా నాశనం చేయాలనుకుంటారు. ఈ లోకంలో మానవత్వాన్ని బతికించుకోవాలంటే ప్రేమను బతికించుకోవాలి.



అరుణవర్ణ కాంతులతో
ఎరుపెక్కిన భీమవరం...
పడినలిగిన ప్రజల పక్క
ప్రసరించిన రవికిరణం!

నయవంచక నేతలపై
పిడికిలి బిగించి జనం...
ఓటును ఈటెగ చేసి
సృష్టించగ ప్రభంజనం!

- కొల్లూరు వెంకట్

విశ్లేషణ

ఎఫ్ఆర్‌డిఐ బిల్లు-పర్యవసానాలు



దిగుబాటి రాజగోపాల్

ఎఫ్ఆర్‌డిఐ బిల్లు (ఫైనాన్షియల్ రిజల్యూషన్ ఆఫ్ డిపాజిట్ ఇన్సూరెన్సు బిల్లు)ను మోడీ ప్రభుత్వం తయారు చేసి పార్లమెంటు ఆమోదించే దిశగా తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. సామాన్య ప్రజలు, రిటైరయిన ఉద్యోగులు, కార్మికులు, రైతులు, చిన్నచిన్న వ్యాపారులు, తదితర వివిధ వర్గాల ప్రజలు, అవసరాల కోసం ప్రభుత్వ బ్యాంకులలో దాచుకుంటున్న డబ్బుకు, డిపాజిట్లకు గ్యారంటీ లేకుండా, బడా బాబులు, కార్పొరేట్ సంస్థలు, కంపెనీలు, బ్యాంకుల నుండి లోన్లు తీసుకొని ఎగ్గొట్టే వారికి ప్రయోజనం చేకూర్చడానికి ఈ బిల్లును తీసుకువస్తున్నారు. ఇంత వరకు బ్యాంకులలో దాచుకున్న డబ్బు/ డిపాజిట్లకు కేంద్ర ప్రభుత్వం గ్యారంటీ వుంది. ఈ బిల్లు పార్లమెంటు ఆమోదిస్తే డిపాజిట్‌దార్ల కుటుంబాలు గాలిలో కలిసిపోతాయనేది వాస్తవం.

ప్రస్తుతం దేశంలోని బ్యాంకుల్లో డిపాజిట్ల రూపంలో రూ.110 లక్షల కోట్ల ప్రజాధనం ఉంది. బ్యాంకుల్లో అప్పులు, లోన్లు తీసుకొని ఎగనామం పెట్టిన మొండి బకాయిలు రూ.15 లక్షల కోట్లు పేరుకుపోయింది. వీటిలో ఎక్కువ శాతం కార్పొరేట్ సంస్థలవే వున్నాయి. 35 కార్పొరేటు కంపెనీలు దాదాపు రూ.7 లక్షల కోట్లు బకాయి వుంటే, మరో 23 కంపెనీలు రూ.4.5 లక్షల కోట్లు వరకు బ్యాంకులకు బకాయిలు చెల్లించవలసి వుంది. అంతేకాక బడా కార్పొరేట్ సంస్థలకు, కంపెనీలకు, కేంద్ర ప్రభుత్వం రూ.7 లక్షల కోట్లు సబ్సిడీ రూపంలో సమకూరుస్తోంది.

కార్పొరేటు సంస్థల బకాయిలే 75 శాతం

సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం, చిన్న చిన్న వ్యాపారులు, రిటైరయిన ఉద్యోగులు, తదితర ఇతర ప్రజానీకం బ్యాంకుల్లో డబ్బులు దాచుకుంటారు. వ్యాపారాల పేరుతో, ఉత్పత్తి పరిశ్రమల సాకుతో అప్పుల రూపంలో సంపన్నులు బ్యాంకు నుండి ఈ డబ్బును తీసుకుంటారు. ఆ విధంగా లక్షల కోట్ల రూపాయలు అప్పులు తీసుకొని విలాసవంతమైన జీవితం అనుభవిస్తున్న కార్పొరేట్లు, తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించకుండా ఎగ్గొట్టిన వారు దేశంలో పెద్ద మనుషులుగా చలామణి అవుతున్నారు. ఉదాహరణకు రూ.9 వేల కోట్లు ఎగ్గొట్టిన విజయ్‌మాల్యా లాంటి వ్యక్తిని రాచమర్యాదలతో విదేశాలకు సాగనంపుతున్నారు. అంబాని, అదాని, బిర్లా, టాటా తదితర 20 వ్యాపార సంస్థలు రూ.12 లక్షల కోట్లు అప్పులు తీసుకొని తీర్చడం లేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారం బ్యాంకు బకాయిల్లో 75 శాతం ఈ కార్పొరేట్ వ్యాపార సంస్థలవే. బ్యాంకుల నుండి తీసుకున్న అప్పును కార్పొరేట్లు తిరిగి చెల్లించకపోతే ఆ సొమ్మును వారి వద్ద నుండే వసూలు చేయాలి. వారి ఆస్తులను జప్తు చేయాలి. విదేశాలకు వెళ్లకుండా పాస్‌పోర్టును రద్దు చేయాలి. వారిని కఠినంగా శిక్షించేందుకు కఠిన చర్యలు చేపట్టాలి. కానీ మన మోడీ ప్రభుత్వం వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోగా వారి రుణాలను మాఫీ చేస్తోంది. మోడీ పాలనలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికి రూ.2 లక్షల 35 వేల కోట్లు మాఫీ చేసింది. ఇవి కాక భవిష్యత్తులో తీసుకున్న అప్పులను కార్పొరేట్లు ఎగ్గొట్టడం వల్ల బ్యాంకులకు వచ్చే నష్టాన్ని, ప్రజలు దాచుకున్న డబ్బుతో భర్తీ చేయాలని ఎఫ్ఆర్‌డిఐ చట్టాన్ని తెచ్చేందుకు ప్రయత్నిస్తోంది.

సాధారణ ప్రజానీకం, మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు, రైతులు, రిటైరయిన ఉద్యోగులు కుటుంబ అవసరాల కోసం, పిల్లల చదువుల కోసం, రిటైరు అయ్యాక శేష జీవితాన్ని గడపడానికో, వైద్య ఖర్చుల నిమిత్తం, పిల్లల పెళ్లిల కోసమో వారి వారి కుటుంబాల అవసరాల నిమిత్తం బ్యాంకులలో తమ డబ్బును దాచుకుంటున్నారు. మోడీ తీసుకున్న ఎఫ్ఆర్‌డిఐ బిల్లు పార్లమెంటు ఆమోదించి చట్ట రూపంలో వస్తే డిపాజిట్‌దారులు దాచుకున్న డబ్బుకు గ్యారంటీ వుండదు. ఈ బిల్లు ప్రకారం బ్యాంకుల నుండి అప్పులు తీసుకున్న వారు తిరిగి చెల్లించకపోతే దివాల తీయకుండా బ్యాంకులను రక్షించేందుకు రిజల్యూషన్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నారు. అంటే బ్యాంకు దివాలా తీయగానే ఈ రిజల్యూషన్ కార్పొరేషన్ రంగంలోకి దిగి బ్యాంకును రక్షించేందుకు కొన్ని చర్యలు చేపట్టాలని బిల్లు సూచిస్తోంది. దీని ప్రకారం దివాలా తీసిన బ్యాంకు తన వద్ద వున్న డిపాజిట్ దారుల డబ్బుతో నష్టాన్ని పూడ్చుకోవచ్చు. డిపాజిట్ దారులు కష్టపడి సంపాదించి దాచుకున్న డబ్బును తిరిగి ఇవ్వక్కర్లేదు. పిల్లల చదువుకో, పెళ్లి గురించో ఒక రూ.10 లక్షలు, ఐదేళ్లకు డిపాజిట్ చేస్తే బ్యాంకు ఆ సొమ్ము లాక్ ఇన్ పీరియడ్‌ను 20 ఏళ్లకు డిపాజిట్‌దారుని అనుమతి లేకుండానే మార్చివేయవచ్చు. అంటే దీనికి డిపాజిట్ దారుని అనుమతి అక్కర్లేదన్నమాట. 'లాక్ ఇన్ పీరియడ్' అంటే డిపాజిట్ చేసిన సొమ్మును తిరిగి తీసుకోవడానికి వీల్లేని కాలం. మరో నిబంధన ప్రకారం బ్యాంకు తన డిపాజిట్‌దారుల డబ్బుకు గ్యారంటీ ఇచ్చే హామీని నెరవేర్చక్కర్లేదు. దీని వల్ల దాచుకున్న డబ్బు పూర్తిగా నష్టపోయే ప్రమాదం వుంది. సేవింగ్స్ బ్యాంకు అకౌంటులో దాచుకున్న సొమ్మును బ్యాంకు అధికారులకు నచ్చినట్లు మూడేళ్లకో, పదేళ్లకో ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా మార్చేయవచ్చును. దీనికీ డిపాజిట్‌దారు అనుమతి అక్కర్లేదు. మీ డబ్బును బ్యాంకు వారు మీ అనుమతి లేకుండా, ఈక్విటీ కింద మార్చేయవచ్చు. ఈ దివాలా తీసిన బ్యాంకు ఈక్విటీ షేర్లను అమ్మకానికి పెడితే డిపాజిట్‌దారులు అడ్డంగా నష్టపోవడం ఖాయం. ఈక్విటీ అంటే బ్యాంకు మూలధనం వాటా, ఈ బిల్లులోని అంశాలు ఒక్క బ్యాంకులకే కాక ఇన్సూరెన్సు కంపెనీలకు కూడా వర్తిస్తుంది.

> **బ్యాంకు దివాలా తీయగానే ఈ రిజల్యూషన్ కార్పొరేషన్ రంగంలోకి దిగి బ్యాంకును రక్షించేందుకు కొన్ని చర్యలు చేపట్టాలని బిల్లు సూచిస్తోంది. దీని ప్రకారం దివాలా తీసిన బ్యాంకు తన వద్ద వున్న డిపాజిట్ దారుల డబ్బుతో నష్టాన్ని పూడ్చుకోవచ్చు. మీ డబ్బును బ్యాంకు వారు మీ అనుమతి లేకుండా, ఈక్విటీ కింద మార్చేయవచ్చు. ఈ దివాలా తీసిన బ్యాంకు ఈక్విటీ షేర్లను అమ్మకానికి పెడితే డిపాజిట్‌దారులు అడ్డంగా నష్టపోవడం ఖాయం.**



ఈ బిల్లులోని క్లాజు 52 ప్రకారం ఏదైన ఒక బ్యాంకు మూతపడితే, మూతపడే పరిస్థితులు అంటే ఆ బ్యాంకును క్లాజు 52 ప్రకారం రిజల్యూషన్ కార్పొరేషన్‌కు అప్పగించాలి. అటువంటి పరిస్థితుల్లో ఆ బ్యాంకుకు చెందిన డిపాజిట్లను, పొదుపు సొమ్మును రద్దు చేయడం, షేర్లలో పొదుపు చేయడం లేదా డిపాజిట్ కాల పరిమితిని పెంచడం తదితర ఏ చర్య అయినా తీసుకునే అధికారం రిజల్యూషన్ కార్పొరేషన్‌కు అప్పగించారు. ఈ 52 క్లాజును పూర్తిగా రద్దు చేయవలసిన అవసరం ఉంది.

చైనాలా ఇక్కడ ఎందుకు చేయరు?

బ్యాంకుల్లో ప్రజలు దాచుకున్న డబ్బుకు డిపాజిటర్ల భద్రత కోసం, బ్యాంకింగ్‌పై విశ్వాసాన్ని నెలకొల్పడం కోసం బ్యాంకుల డబ్బుకు ఎగనామం పెట్టి ఎగ్గొడుతున్న వారిపై చైనా చర్యలు తీసుకుంటుంది. చైనా మాదిరిగానే మన దేశంలో మోడీ ప్రభుత్వం ఇటువంటి చర్యలను చేపట్టడం లేదు. ఎందుకంటే నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలు, వ్యక్తుల కనుసన్నల్లో పాలన సాగిస్తోంది. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం ప్రజా ధనాన్ని కొల్లగొట్టి దేశ సంపదను స్వాహా చేయడానికే కార్పొరేట్లకు ద్వారాలు తెరుస్తోంది. చైనాలో బ్యాంకు డబ్బును ఎగ్గొట్టిన వారి ఎటిఎం కార్డులు, క్రెడిట్ కార్డులు పాస్ పోర్టులను రద్దు చేస్తున్నారు. అంతేకాక వారిని విమానాలలో ప్రయాణించకుండా బహిష్కరిస్తున్నారు. రైళ్లలో ఆర్డనరీ బోగీలలో తప్ప రిజర్వు బోగీలలో ప్రయాణించడానికి కూడా నిరాకరిస్తున్నారు. వీటితోపాటు వారికిచ్చే రాయితీలనూ రద్దు చేస్తున్నారు. ఇంకొకరు బ్యాంకుల డబ్బు ఎగ్గొట్టకుండా ఉండడానికి అవసరమైతే జైళ్లల్లోనూ పెడుతున్నారు.

కానీ మన దేశంలో మోడీ ప్రభుత్వం అప్పులు ఎగ్గొట్టిన వారిపై చర్యలు తీసుకోవడం లేదు సరికదా, దీనికి భిన్నంగా లోను రూపంలో మళ్లీ వారికే రుణాలు ఇవ్వడానికి పూనుకుంటోంది. అందుకోసమే రెండు మార్గాలను ఎన్నుకుంది.

1. బ్యాంకులు నష్టాల్లో ఉన్నప్పుడు, ఎగ్గొట్టిన బడాబాబులకు మరలా లోన్లు, అప్పు ఇవ్వాలంటే బ్యాంకులకు డబ్బులు కావాలి.

2. ఆ డబ్బును సమకూర్చుకోవడం కోసం కేంద్ర ఖజానా నుండి రూ.70 వేల కోట్ల వరకు బ్యాంకులకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్నది. అంటే కేంద్ర ఖజానాతో పాటు, డిపాజిట్ దారుల డబ్బును లూటీ చేయడానికే ఇప్పుడీ బిల్లును తెస్తున్నది. అందుకే ఈ బిల్లును అందరం వ్యతిరేకించాలి. బిల్లు రాకుండా ప్రజా ఉద్యమం చేపట్టాలి.

(రచయిత మాజీ ఎంఎల్ఎ, సెల్ 9848024831)

చర్చ

పథకాలు సరే ... పైసలేవి?



నాగటి నారాయణ

నరేంద్ర మోడీ ప్రభుత్వం నాలుగో బడ్జెట్‌లో కూడా నాణ్యమైన విద్యకు నిధులు కేటాయించలేక పోయింది. షరా మామూలుగానే కొన్ని పథకాలు ప్రకటించి, వాటికి కూడా అదనపు బడ్జెట్ ఇవ్వకుండానే దాటవేసింది. తమ ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇస్తుందని, ప్రధాన సమస్యగా పరిణమించిన అభ్యసన ప్రమాణాల మెరుగుదలకు కృషి చేస్తుందని ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ బడ్జెట్ ప్రసంగంలో చెప్పుకొచ్చారు. కానీ అందుకు అవసరమైన అదనపు ఏర్పాట్లు చేయలేక పోయారు.

పిల్లలను బడిలో చేర్చగలిగాం. కానీ వారికి నాణ్యమైన విద్యను ఇవ్వలేక పోతున్నాం. ఇటీవల దేశవ్యాప్తంగా 20 లక్షల మంది విద్యార్థులపై నిర్వహించిన జాతీయ సాధన సర్వేలో వచ్చిన ఫలితాలు కూడా చాలా అసంతృప్తికరంగా వున్నాయి. నాణ్యమైన విద్యా ప్రమాణాల కోసం జిల్లా స్థాయిలోనే వ్యూహాలు రూపొందించాలని, పూర్వ ప్రాథమిక స్థాయి నుండి పన్నెండో తరగతి వరకు ఏక మొత్తంగా పాఠశాల విద్య వుండాలని ప్రకటించారు. కానీ అందుకనువుగా విద్యాహక్కు చట్టాన్ని విస్తరించాల్సిన బాధ్యతను విస్మరించారు. నాణ్యమైన విద్యా బోధనకు నాణ్యమైన ఉపాధ్యాయులు కావాలని, అందుకోసం ఇంటిగ్రేటెడ్ బి.ఇడి పథకాన్ని ప్రారంభించాలని అన్నారు. మెరుగైన విద్యాభ్యాసనకు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తూ బ్లాక్ బోర్డులను డిజిటల్ బోర్డులుగా మార్చాలని చెప్పారు. ఏజెన్సీ ఏరియాల్లో గిరిజన బిడ్డలకు నాణ్యమైన విద్యను అందించటానికి నవోదయ విద్యాలయాల తరహాలో ఏకలవ్య పాఠశాలలను ఏర్పాటు చేయాలని సూచించారు. కానీ ఈ మూడు పథకాలకు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయింపులు చేయలేదు.

విద్యాపద్దుకు అదనంగా పెరిగే నిధులు కూడా అంతగా లేకపోవటం వలన విద్యారంగ వికాసం, కొత్త పథకాల ప్రయోగం పెద్ద సవాల్‌గానే కనిపిస్తోంది. పాతవి కొత్తవి అన్ని రకాల పథకాలు, పద్దులకు కలిపి ఈ సారి బడ్జెట్‌లో విద్యారంగానికి రు.85,010 కోట్లు కేటాయించారు. గతేడాది (రు.79,686 కోట్లు) కంటే అదనంగా రు.5342 కోట్లు మాత్రమే పెరిగింది. ఈ కొద్ది మొత్తం సాధారణంగా పెరిగే ఖర్చులకే సరిపోదు, ఇంక అదనపు అవసరాలను అందుకునే అవకాశమే వుండదు. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేస్తున్న సర్వ శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఎ)కి రు.2629 కోట్లు, సార్వత్రిక సెకండరీ విద్యాలక్ష్యాన్ని సాధించాల్సిన రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (ఆర్ఎంఎస్ఎ) కి రు. 192 కోట్లు మాత్రమే అదనంగా కేటాయించారు. నిధుల కొరత వలన విద్యాహక్కు చట్టం (ఆర్‌టిఐ) అమలు కావటం లేదని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) చేసిన విమర్శను గానీ, అభ్యసన స్థాయిల అభివృద్ధికి అదనపు ఏర్పాట్లు చేయాలనే అసెర్, న్యాస్ నివేదికలను గానీ కేంద్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోలేదనే విషయాన్ని బడ్జెట్ ప్రతిపాదనలు తెలియజేస్తున్నాయి.

కాంగ్రెస్ ప్రభుత్వాలు అమలు చేయలేక పోయిన కొఠారి కమిషన్ సిఫార్సు మేరకు స్థూల జాతీయ ఉత్పత్తి (జిడిపి)లో ఆరు శాతం విద్యకి వెచ్చించే బృహత్తర కర్తవ్యాన్ని తమ ప్రభుత్వం అమలు చేస్తుందని 2014 సాధారణ ఎన్నికల్లో బిజెపి మేనిఫెస్టోలో ప్రకటించింది. నాలుగేళ్లు గడిచినా ఆ హామీని నెరవేర్చలేక పోయింది. జిడిపిలో నాలుగు శాతం లోపే విద్యకి ఖర్చు చేస్తున్నట్లు ప్రపంచ బ్యాంక్ నివేదికల్లో తెలుస్తోంది. 'ముఖముంది-అద్దముంది అన్నట్లు' నరేంద్రమోడీ ప్రభుత్వం విద్యలో విఫలమైనట్లు కింది బడ్జెట్ కేటాయింపులు పరిశీలిస్తే అర్థమౌతుంది.

సంవత్సరం	మొత్తం బడ్జెట్ (కోట్లు)
2014-15	రు. 17,94,891.96
2015-16	రు. 17,77,477.04
2016-17	రు. 19,78,060.45
2017-18	రు. 21,46,734.78
2018-19	రు. 24,42,213.30

విద్యకి కేటాయించింది	విద్యారంగం వాటా
రు.1,10,351.10 కోట్లు	6.15%
రు. 96,649.76 ,,	5.44%
రు. 92,666.65 ,,	4.68%
రు. 79,685.95 ,,	3.71%
రు. 85,010.29 ,,	3.48%

జన వాక్యం

యథేచ్ఛగా వన్యప్రాణుల వేట

అడవులలో స్వేచ్ఛగా సంచరించాల్సిన వన్య ప్రాణులు వేటగాళ్ల ఉచ్చులో పడి మాంసాహార ప్రియులకు విందు భోజనంగా మారుతున్నాయి. వీటి మాంసాన్ని అమ్ముకొని వేటగాళ్లు సొమ్ము చేసుకుంటున్నారు. వాటిని వేటాడే క్రమంలో ఉచ్చులు పెట్టడం, కరెంటు తీగలు అమర్చడం, మందుగుండు సామాగ్రి ద్వారా హతమార్చడం వంటి కిరాతక చేష్టలకు పాల్పడుతున్నారు. కొన్ని గ్రామాలలో ముఠాలుగా ఏర్పడి, పెద్దఎత్తున వన్య ప్రాణులను వేటాడుతూ పెద్ద పెద్ద కార్పొరేటు హోటళ్ళకు, రెస్టారెంట్లకు తరలిస్తున్నారు. వీటిల్లో ముఖ్యంగా కుందేళ్లు దుప్పులు, అడవి పందులు, కొండ గొర్రెలు, నెమళ్లు, జింకలను వేటాడుతున్నారు. వన్యప్రాణి సంరక్షణా చట్టం కేవలం కాగితాలకే పరిమితమయ్యింది. వీటిని రక్షించాల్సిన కొందరు అధికారులు వేటగాళ్లతో చేయి కలిపి ఈ దందాలో భాగస్వాములవు తున్నారు. ఒక పక్క పోడు వ్యవసాయం పేరుతో అడవులను కొట్టివేస్తున్నారు. మరోపక్క వేట పేరుతో వన్యప్రాణులను అంతమొందిస్తున్నారు. దీంతో ఎంతో విలువైన వృక్ష సంపదతో పాటు అడవి జంతువులు కూడా కనుమరుగయ్యే ప్రమాదముంది.

కె సతీష్‌రెడ్డి,

వ్యాసాలు, ఉత్తరాలు రాయవల్సిన చిరునామా
editpageps@gmail.com

పథకం ప్రకారమే కస్‌గంజ్ అల్లర్లు

ఉత్తరప్రదేశ్‌లోని కస్‌గంజ్‌లో జనవరి 26వ తేదీన, ఆ తర్వాత జరిగిన అల్లర్లపై లక్నో, ఢిల్లీకి చెందిన సామాజిక కార్యకర్తలతో కూడిన స్వతంత్ర నిజ నిర్ధారణ బృందం అధ్యయనం చేసింది. అల్లర్లు జరిగిన సంఘటనా స్థలాలను పరిశీలించింది. రెండు మతాలకు చెందిన స్థానిక ప్రజలతో కూలంకుషంగా మాట్లాడి... నివేదికను రూపొందించింది. నివేదిక ప్రకారం కస్‌గంజ్‌లో అల్లర్లు అప్పటికప్పుడు జరిగినవి కావు. పథకం ప్రకారమే హిందూత్వ శక్తులు విద్వేషానికి, హింసకు పాల్పడ్డాయి.

ఉత్తరప్రదేశ్‌లో కస్‌గంజ్ ఒక చిన్న పట్టణం. ఢిల్లీకి 220 కిలోమీటర్లు, లక్నోకు 340 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ లక్షా 40 వేల మంది జనాభా ఉన్నారు. ఒక్క బాబ్రీ మసీదు విధ్వంస సమయంలో తప్ప ఎప్పుడూ ఈ పట్టణంలో మత ఘర్షణలు కానీ, మత పరమైన దాడులు కానీ జరిగిన ఘటనలు లేవు. దశాబ్దాల నుంచి ఇక్కడ రెండు మతాలకు చెందిన ప్రజలు శాంతి, సామరస్యాలతో నివసించారు. బిజెపికి చెందిన నేతలను కూడా ఇక్కడ ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకున్నారు. ప్రస్తుతం మాజీ ముఖ్యమంత్రి కల్యాణ్ సింగ్ కుమారుడు రాజ్‌వీర్‌సింగ్ బిజెపి ఎంపీగా ఉన్నారు.

జనవరి 26వ తేదీన వీర్ అబ్దుల్ హమీద్ చౌక్ వద్ద ముస్లింలు చేపట్టిన జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమాన్ని 'సంకల్ప్ ఫౌండేషన్, ఎబివిపి' కార్యకర్తల బైక్ ర్యాలీ అడ్డుకుంది. దీంతో రెండు వర్గాల మధ్య ఘర్షణలు జరిగాయి. ఇది పట్టణంలోని ఇతర ప్రాంతాల్లో కాల్పులకు, హింసకు దారి తీసింది. ఈ ఘటనల్లో బుల్లెట్ గాయాల కారణంగా చందన్ గుప్తా అనే యువకుడు చనిపోయాడు. నౌషద్, అక్రమ్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రభు చౌరస్తా వద్ద బైక్ ర్యాలీ ప్రారంభం కావడానికి ముందే గాల్లోకి తుపాకీ కాల్పులు వినిపించాయి. కానీ వీరిని పోలీసులు నియంత్రించలేదు. పైగా బైక్ ర్యాలీని ముందుగా నిర్ణయించుకున్న దారిలో కాకుండా అనుమతి లేని దారిలో నిర్వహించారు. అంటే పథకం ప్రకారం ఘర్షణ పడాలనే ఉద్దేశంతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఘర్షణల తర్వాత హిందూత్వ శక్తులు బైక్‌లను వదిలేసి వెళ్లిపోయాయి. 35 బైక్‌ల వరకు స్వాధీనం చేసుకున్నామని చెప్పిన పోలీసులు వారిలో ఒక్కరినైనా గుర్తించి తీసుకొచ్చి ప్రశ్నించలేదు. ఘర్షణలు జరిగి, కాల్పులు చోటుచేసుకున్నా హిందువులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పోలీసుల పహారా పెట్టలేదు. ముస్లింల ప్రాంతాల్లో మాత్రం పోలీసులను దింపి వారిని ఇళ్లల్లోంచి బయటికి రాకుండా అడ్డుకున్నారు. జనవరి 27వ తేదీన చందన్ గుప్తా అంత్యక్రియల ప్రదర్శన వెంట పోలీసులు ఉన్నప్పటికీ హిందూత్వ శక్తులు ముస్లింల షాపులు, ఆస్తులను ధ్వంసం, దోపిడీ చేస్తుంటే అడ్డుకోలేదు. అల్లర్లకు పాల్పడిన సంకల్ప ఫౌండేషన్, ఎబివిపికి చెందిన యువకులు ఎక్కువగా మూడు ప్రాంతాలకు చెందినవారు కాగా, ఆ ప్రాంతాల్లో పోలీసుల పికెటింగ్ ఏర్పాటు చేయలేదు. దీంతో ఆ యువకులు పట్టణంలో స్వేచ్ఛగా తిరుగుతూ దొమ్మీలకు పాల్పడ్డారు. జనవరి 28వ తేదీన శాంతి సమావేశం నిర్వహించి ముస్లింలు షాపులు తెరుచుకోవచ్చంటూ జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. కానీ షాపులు తెరిచిన ముస్లింలను పోలీసులు



పట్టుకెళ్లిపోయారు. పోలీసులు పూర్తిగా పక్షపాత వైఖరితో ఉండడంతో ముస్లింలు ఎవ్వరూ ముందుకొచ్చి ధైర్యంగా కేసులు పెట్టలేకపోతున్నారు. వారిలో పోలీసులపై అపనమ్మకం ఏర్పడింది. ధ్వంసానికి గురైన చాలా మంది షాపు ఓనర్లు, ఇంటి యజమానులు ఎఫ్ఐఆర్‌లు రిజిస్టర్ చేయడానికి ప్రయత్నించారు. కానీ పోలీసులు అనుమతించలేదు. రేపు రా, మాపు రా అంటూ తిప్పారు. ఆ తర్వాత కొందరి ఫిర్యాదులను తీసుకున్నా.. అందులోంచి వారి షాపులకు జరిగిన నష్టం మొత్తాన్ని తొలగించారు. కేవలం ఫిర్యాదుగానే తీసుకున్నారుగానీ ప్రత్యేకంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. దాడులకు లక్ష్యాలుగా మారిన ముస్లింల షాపులకు, ఇళ్లకు, మసీదులకు పోలీసులు ఎటువంటి రక్షణ ఇవ్వలేదు. కనీసం ఈ ప్రాంతాల్లో సాక్ష్యాధారాలను కూడా సేకరించలేదు. చందన్ గుప్తా హత్య కేసులో ప్రధాన ముద్దాయి అని చెబుతున్న సలీమ్ ఇంటి తలుపులను పగుల కొట్టి పోలీసులు రైడ్ నిర్వహించారు. తర్వాత తాళం వెయ్యకుండానే వెళ్లారు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు ఆ ఇంట్లోకెళ్లి దొరికిందంతా దోచేశారు. పోలీసుల్లో సీవో వీర్ కుమార్ ఒక్కరే ఎక్కువ సహాయం చేశారని ముస్లింలు చెప్పారు. జనవరి 28వ తేదీన శాంతి సమావేశంలో హిందూత్వ శక్తులను ఎస్‌పి సునీల్ సింగ్ హెచ్చరించారు. కచ్చితంగా తన విధులను నిర్వర్తిస్తానని చెప్పారు. 29వ తేదీనే ఆయన్ను బదిలీ చేశారు.

ముస్లిం ఆస్తులు లక్ష్యంగా దాడులు

చందన్ గుప్తా అంత్యక్రియలు ముగించుకొని తిరిగి వస్తున్న దాదాపు 400 మంది హిందూత్వ వాదులు ముస్లిం ఆస్తులపై దాడులకు తెగబడ్డారు. ముస్లిం షాపులు, ఇళ్లను గుర్తుపెట్టుకొని మరీ వాటినే తగుల బెట్టారు. దాదాపు 27 షాపులను తగులబెట్టారని ఓ హిందూ వ్యక్తి చెప్పారు. తగులబెట్టిన, లూటీ చేసిన షాపులన్నీ ముస్లింలవే. ఒక్కటంటే ఒక్కటైనా హిందువుల షాపుపై దాడి జరగలేదు. ఒక వేళ ముస్లిం షాపులకు నిప్పంటిస్తే పక్కనే ఉన్న హిందూ షాపులకు కూడా ప్రమాదం వాటిల్లుతుందని భావించిన చోట చాలా జాగ్రత్త పడ్డారు. అక్కడ ఎటువంటి దాడులు చేయలేదు. చాలా మంది ముస్లింల ఇళ్లకు తాళాలేసి ఉన్నాయి. యువకులు ఉన్న కుటుంబాలు ఊరు వదిలేసి వెళ్లిపోయాయి. ఇప్పటికీ ముస్లింల షాపులు అత్యధిక శాతం మూసే ఉన్నాయి. కాగా హిందువుల షాపులన్నీ తెరిచే ఉన్నాయి. ఈ ఘర్షణలకు ముందుగానీ, తర్వాత గానీ మార్కెట్‌లో హిందూ, ముస్లింల మధ్య మంచి సంబంధాలే ఉండేవి. ఒకరి ఆహారాన్ని మరొకరు పంచుకునే వాళ్లమని కూడా చెప్పారు. ముస్లిం షాపులు దాడులకు గురైన సమయంలో కొందరు హిందూ వ్యాపారులు ముస్లింలకు సహాయంగా నిలిచారు. నష్టం ఎక్కువ జరక్కుండా ఆపగలిగారు.

ఘటనలపై ప్రశ్నలు

హత్య కేసులో మొదటి ముద్దాయిగా ఉన్న సలీమ్ ఇంటి వద్దే చందన్ గుప్తాను కాల్చి చంపారని ఎవ్వరూ స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. చందన్ గుప్తాకు బుల్లెట్లు తాకిన స్థలం గురించి స్పష్టత లేదు. అసలు వాస్తవ ఘటన ఏంటనే దానిపై ఎవ్వరికీ స్పష్టత లేదు. సలీమ్ పాత్రపై ఇంత వరకు ఎటువంటి సాక్ష్యం లేదు. దొరికిన బుల్లెట్లు అతని లెసెన్స్‌డ్ తుపాకీ నుంచే వచ్చాయని చెప్పడానికి కూడా ఎటువంటి సాక్ష్యం లేదు. చందన్ గుప్తా చనిపోయిన 14 గంటల తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అంత ఆలస్యం ఎందుకు జరిగిందో పోలీసులు వివరణ ఇవ్వడం లేదు. సలీమ్ ఇంటికి దగ్గరగా ఉండే ఓ షాపు యాజమాని చెప్పినదాన్ని బట్టి ఓ గుంపు తపాకులు పేల్చుకుంటూ రావడం తాను చూశానని, దీంతో హిందువులు, ముస్లింలు వారి పిల్లలను తీసుకొని ఇంట్లోకి పరిగెత్తుకుంటూ వెళ్లారు. ఈ ప్రాంతానికి దగ్గర్లోనే చందన్ మృతి చెందినట్లు తాను చూడలేదన్నాడు. సలీమ్ ఇంటికి దగ్గరగా చందన్ మృతి చెందలేదని అతను నమ్మకంగా చెప్పాడు. బుల్లెట్ గాయాలు తగిలి చందన్ పడిపోయాడని చెప్తున్న చోట ఎటువంటి రక్తపు మరకలు గానీ, బుల్లెట్ మరకలు గానీ, పోలీసుల మార్కింగ్స్ గానీ లేవు. బుల్లెట్ దిగిన భాగంపై మీడియాలో పోలీసులు చెప్పేదానికి, వాస్తవంగా మృతి చెందిన వ్యక్తి ఫోటోలో ఉన్న దానికి తేడాలు ఉన్నాయి. బుల్లెట్ కాలర్ బోన్‌లో కాకుండా చేతికి పైభాగాన తగిలింది. బుల్లెట్ గాయం కోణం, స్థానం తేడాగా ఉన్నాయి. పోస్ట్‌మార్టమ్ నివేదిక రావాల్సి ఉంది. బిల్‌రామ్ గేట్ వద్ద ఉన్న షాపు యాజమానులు కొందరు చందన్ గుప్తా సలీమ్ ఇంటి వద్ద చనిపోయాడని తాము నమ్మడం లేదన్నారు. రైల్వే స్టేషన్ రోడ్‌లో అతనికి బుల్లెట్లు తాకాయని ఒకరు చెప్పారు. మరొకతను చందన్, వారి స్నేహితులు విచ్చలవిడిగా జరిపిన తుపాకీ కాల్పుల్లోనే చనిపోయి ఉంటాడని చెప్పాడు. మరికొందరు పోలీసు కాల్పుల్లో చనిపోయి ఉండవచ్చు అని అంటున్నారు. మొత్తంగా కస్‌గంజ్ అల్లర్లు పథకం ప్రకారం జరిగాయని, ముందుగానే నిర్ణయించుకుని ప్రజల్లో చీలిక తెచ్చే ఉద్దేశంతో, విద్వేషం పెంచే లక్ష్యంతో జరిగాయని నిజనిర్ధారణ కమిటీ అభిప్రాయపడింది. దీనికి పోలీసులు, అధికారులు కూడా సహకరించారని పేర్కొంది.

('ది వైర్' సౌజన్యంతో)



తెలుగు సినిమారంగంలో సహాయపాత్రల నుంచి హీరోగా ఎదిగిన నటుల్లో శివాజీ ఒకరు. మాస్టర్, ఇంద్ర, ఖుషీ వంటి మెగాచిత్రాల్లో చిన్నపాత్రల్లో మెరిసి, మిస్సమ్మ, సందడేసందడి, అమ్మాయిబాగుంది, అదిరిందయ్యా చంద్రం, ఎర్రబాబు, కలవర మాయే మదిలో, లడ్డుకావాలా నాయనా? పలు చిత్రాల్లో హీరోగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. సినిమాల్లో చేయకముందు టీవీల్లో నటుడిగా, యాంకర్‌గా ఆకట్టుకున్న శివాజీ మంచి డబ్బింగ్ ఆర్టిస్ట్ కూడా. ఉదయ్‌కిరణ్, నితిన్ వంటి కొత్తగా పరిచయమైన యువనటులెందరికో డబ్బింగ్ చెప్పారు. డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా 'నంది' అవార్డు దక్కించుకున్నారు శివాజీ. వైవిధ్యమైన పాత్రలు, చక్కటి కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులకు దగ్గరైన శివాజీ.. గత కొంతకాలంగా ప్రజాసమస్యలపైనా పోరాడుతున్నారు. ముఖ్యంగా 'ప్రత్యేకహోదా' విషయంపై అందరికంటే ముందు గొంతెత్తింది శివాజీనే! తాజా రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో హీరో శివాజీ 'జీవన'తో పంచుకున్న విశేషాలు ఆయన మాటల్లోనే..

నేనూ.. మాయలోపడ్డా!

ఎన్నికల ప్రచారంలో తళుక్కున మెరిసే సినీతారలు... ఎన్నికలు ముగిసాక దేశం ఏమైపోయినా మాకెందుకులే అనుకుంటారు. కానీ వ్యవస్థలోని లోపాలను ప్రశ్నిస్తూ, రాజకీయాలను నిలదీస్తున్నారు హీరో శివాజీ. అందరూ నాకెందుకులే అనుకుంటే.. ఈ సమాజంలో జరుగుతున్న మోసాన్ని ఎవరు ప్రశ్నిస్తారని అంటారాయన.

వ్యవసాయ కుటుంబం

సొంతూరు పశ్చిమగోదావరిజిల్లా నర్సాపురం దగ్గరలోని గొరజివోలు. సామాన్య వ్యవసాయ కుటుంబం. వ్యవసాయ పనులు చేసే అమ్మానాన్న మమ్మల్ని చదివించారు. నాకు ఒక తమ్ముడు ఉన్నాడు. నేను డిగ్రీ వరకూ నర్సాపురంలోనే చదివాను. డిగ్రీ మధ్యలో ఆపేసి, సినిమాలపై మక్కువతో అవకాశాల కోసం వెతుకులాట మొదలుపెట్టాను. అలా అవకాశాల కోసం హైదరాబాదులో తిరుగుతూ ఆకలితో బాధపడిన రోజులూ ఉన్నాయి. కొన్నాళ్ళకు దారి దొరికింది. కొందరి ప్రోత్సాహంతో సినిమారంగంలో ఆర్టిస్టుగా, హీరోగానూ నిలదొక్కుకున్నా. ఇరవై ఏళ్లపాటు సినిమా రంగంలో పనిచేశా... ఆర్థికంగా ఫరవాలేదు. భార్యాపిల్లలతో సంతోషంగానే జీవిస్తున్నాను అంటూ.. తన సినీ, జీవిత విశేషాలు తెలియజేశారు శివాజీ.



నేనూ.. మోడీ మాయలో పడ్డా!

దేశంలో యువత, మేధావులు, సామాన్య ప్రజానీకంలాగే నేను కూడా మోడీ ప్రభంజనానికి ఆకర్షితుడినయ్యా. 2014 ఎన్నికల్లో బిజెపిలో చేరి, ఆ పార్టీ తరపున ప్రచారం కూడా చేశా! ప్రస్తుత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో అనేక ఊళ్ళు తిరిగి, ప్రచారాల్లో పాల్గొన్నాను. తీరా అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారన్న ఒకే ఒక్క కారణంతో బిజెపి నుంచి బయటకు వచ్చేశాను. దేశంలోని అందరిలాగే నేను కూడా మోసపోయానని తెలుసుకున్నాను. అప్పటి నుంచే ప్రత్యేక హోదా ఉద్యమం మొదలైంది.. అంటూ తన రాజకీయ పరిణామాలను వివరించారు శివాజీ.

హోదాహామీతోనే.. దక్కిన అధికారం

రాష్ట్ర విభజన తరువాత టిడిపి, వైసిపి, బిజెపిలు ప్రత్యేకహోదా నినాదాన్ని ప్రచారం చేసుకునే అధికారంలోకి వచ్చాయి. కల్లబొల్లి హామీలు ప్రకటించారు. ఆరు నెలలు గడిచేసరికి రాజకీయాలు ఊరసవెల్లిలా మారిపోయాయి.. ఎప్పుడైతే చంద్రబాబు ఓటుకు నోటు కేసులో ఇరుక్కున్నారో.. .ప్రత్యేకహోదాపై అటు బిజెపి, టిడిపిలు దాటవేతలు మొదలుపెట్టాయి. రాష్ట్రాన్ని, యువత భవిష్యత్తును తాకట్టు పెట్టేందుకు సిద్ధపడ్డాయి. అప్పటి నుంచే కలిసొచ్చిన వారితో ప్రతి వేదికపైనా ఉద్యమించాను. ప్రజలకు అన్యాయం జరుగుతుందని భావించి ప్రత్యేకహోదా ఉద్యమంలో పాల్గొన్నాను. మూడున్నర ఏళ్లుగా ప్రత్యేకహోదా సాధన ఉద్యమంలో పాల్గొంటూ, నాకు చేతనైంది చేస్తున్నాను.

ప్రత్యేక హోదాపై ఉద్యమించడం ఆపను. నాకు ఏ రాజకీయ పార్టీలతో సంబంధం లేదు. ఎవరు కలిసొస్తే వారితో కలసి పనిచేస్తాను. ప్రజలంతా కలిసికట్టుగా తిరగబడితే కచ్చితంగా ప్రత్యేకహోదా సాధిస్తాం!

నాకెందుకులే అనుకుంటే.. నష్టమే

నాకెందులే అనుకుని వదిలేస్తే, మోసం పోతాం. కాబట్టి అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ సమాజంలో జరుగుతున్న పరిణామాల గురించి ఆరా తీయాల్సి ఉంది. పిల్లల బంగారు భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ఎంతో కష్టపడుతున్నారు. కానీ స్వార్థ రాజకీయాల వలన వారి ఆశలు అడియాశలు అవుతున్నాయి. ప్రత్యేకహోదా విషయంలోనూ మన పాలకులు అదే చేస్తున్నారు. దీనిపై ప్రతి ఒక్కరూ స్పందించాలి. యువత ప్రధానంగా రాజకీయ కుతంత్రాలను అర్థంచేసుకోవాలి. నాకెందుకులే అనుకుంటే మనతరంతోపాటు రాబోయే తరాలూ నష్టపోతాయి... ప్రస్తుత రాజకీయాల తీరుతెన్నులపై.. ప్రత్యేకహోదా విషయంలో యువత పాత్రే కీలకం.



సినిమా అఫర్లు వదిలేశాను

ప్రత్యేకహోదా ఉద్యమంలోపడి సినిమా ఆఫర్లు వదిలేశాను. చాలామంది సినిమా చేద్దామని అడిగారు. నేను సమయం పడుతుందని చెబుతూ వచ్చాను. 'బూచమ్మా.. బూచోడు' సినిమా ఆఖరిది. కొత్త సినిమాలూ చేసే అవకాశాలు ఉన్నాయి. అయినా, ప్రత్యేక హోదాపై ఉద్యమించడం ఆపను. నాకు ఏ రాజకీయ పార్టీలతో సంబంధం లేదు. ఎవరు కలిసొస్తే వారితో కలసి పనిచేస్తాను. ప్రజలంతా కలిసికట్టుగా తిరగబడితే కచ్చితంగా ప్రత్యేకహోదా సాధిస్తాం!

ప్రశ్నించేతత్వం.. రావాలి

ప్రస్తుత రాజకీయాలపై యువత చైతన్యవంతులు కావాలి. చదువు లేక, ఎంతో మంది యువత చెడు దార్లు పడుతున్నారు. సరియైన అవగాహనలేక చదువులను మధ్యలోనే ఆపేస్తున్నారు. మద్యం, కులం పేరుతో జరుగుతున్న దోపిడీనీ అడ్డుకోవాలి. గ్రామాల్లో యువతకు రాజకీయాలపై అవగాహన పెరగాలి. ప్రజలు ప్రశ్నించడం మొదలుపెడితే, దోపిడీ రాజకీయాలు అంతమవ్వక తప్పదు. మంచి వాళ్లకు, మంచి రాజకీయాలకు ప్రజల సహకారం అవసరం. అప్పుడే ప్రజల గురించి ఆలోచించే నాయకులు ప్రజల నుంచే వస్తారు.

రాష్ట్ర రాజకీయాలపైనే యువత స్పందించాలి. తనకేం కావాలి.. తానేం చేయాలని ఆలోచించడం మొదలుపెడితే చాలు. రాజకీయాలు మారతాయి. సమాజమూ మారుతుంది. పాలకులు ఉచిత విద్య, మంచి ఆరోగ్యం అందిస్తే చాలు.. ప్రజలకు ఇంకేమీ చేయనవసరం లేదు.

- వి. నాగరాజు,
విజయనగరం

బడిపిల్లల కోసం..

బడి పిల్లలకు సరైన పోషకాహారం అందకపోతే.. ఎదుగుదల సమస్యలే కాదు.. బలహీనంగా మారడం, బరువు పెరుగకపోవడం, నేర్చుకోవడానికి కష్టాలుపడడం, దంత సమస్యలు మొదలవుతాయి. స్కూలుకెళ్లే వయసులో అంటే.. ఆరు నుంచి పన్నెండేళ్ల పిల్లల్లో డైట్ సరిగా ఉండాలి. ఎందుకంటే ఆ వయసులో పిల్లలు ఎక్కువ ఆడుకుంటుంటారు. శారీరక శ్రమ ఎక్కువ ఉండడం వల్ల త్వరగా అలిసిపోతారు. కాబట్టి వారికి రోజులో నాలుగైదు సార్లు భోజనం తినిపించాల్సి ఉంటుంది. ఇందులో ఎక్కువ కూరగాయలు, పండ్లు, పాలు ఉండేలా చేస్తే మరింత మంచిది. అయితే స్కూలుకెళ్లే పిల్లలు ఎక్కువగా ఊబకాయంతో బాధపడుతున్నారు. అలాకాకుండా ఉండేందుకు పిల్లల విషయంలో ఈ డైట్ చార్ట్ ప్రిపేర్ చేసుకోండి.



- గోధుమ, బియ్యం, ఓట్స్, కార్న్‌మీల్, బార్లీ వంటి ధాన్యపుగింజలు డైట్‌లో కచ్చితంగా వచ్చేలా చూడండి. ఇవికాకుండా బ్రౌన్‌రైస్, ఓట్‌మీల్స్ పెడితే పిల్లల ఎదుగుదలకు మరింత ఉపయోగపడతాయి.
- రంగురంగుల కూరగాయలతో వంటకాలను వండి పిల్లలకు వడ్డించండి. ఆకుపచ్చని, ఆరెంజ్, చిక్కుళ్లు ఇలాంటివి మధ్యాహ్న సమయంలో ఉండేలా చూసుకోవాలి.
- తాజాపండ్లు పిల్లలకు అవసరమైన వందశాతం పోషకాలను అందిస్తాయి. ఒకవేళ పిల్లలు పండ్లు తినకపోతే కనీసం వాటిని జ్యూస్ తీసి, ఫ్రెష్‌గా చేతికందించండి.
- పాల ఉత్పత్తులనూ పిల్లలకు అలవాటు చేయాలి. అయితే ఇందులో ఫ్యాట్ ఫ్రీ ఉన్నవాటిని ఎంచుకోండి. వీటివల్ల వారికి కావాల్సిన క్యాల్షియం అందుతుంది.
- పిల్లలకు ప్రొటీన్ ఆహారం తప్పకుండా కావాలి. కాబట్టి చేపలు, నట్స్, బఠాణీలు వంటివి పెట్టండి. అలాగే తక్కువ కొవ్వు ఉండే మాంసాహారాన్ని అలవాటుచేస్తే మరింత మంచిది.



జీవన చిత్రం
ఫొటో : చందు తిలారు

అద్దాన్ని శుభ్రం చేస్తున్నారా?!

ఇంట్లో మేకప్ సమయంలో వినియోగించే అద్దం వెనుకవైపున దుమ్ముపడితే గుడ్డతో తుడిచేయాలే తప్ప షాంపూ వాడకూడదు. అద్దాలు దుమ్ముపట్టి నల్లగా, అసహ్యంగా మారకుండా ఉండాలంటే పేపర్ టవల్‌పై షాంపూ వేసి అద్దాల అంచులను తరచుగా శుభ్రం చేయాలి. అద్దాలను శుభ్రం చేసేందుకు నేడు మార్కెట్‌లో చాలా రకాల షాంపూలు అందుబాటులో ఉన్నాయి. వాటిని పేపర్ టవల్ మీద స్ప్రే చేసి దానితో అద్దాన్ని తుడిస్తే కొత్తదానిలా మెరిసిపోతుంది. ప్రతి రోజూ అద్దాలు శుభ్రం చేయడానికి ఒక సున్నితమైన వస్త్రాన్ని ఉపయోగించాలి. మెత్తని వస్త్రం అద్దం మీద ఉన్న దుమ్మును పూర్తిగా శుభ్ర పరుస్తుంది. అలాగే, అద్దాలను తుడిచేటప్పుడు, మధ్యలోనుంచి ప్రారంభించి చివరలతో ముగించాలి. అంతేకానీ ఇష్టం వచ్చినట్లు తుడవకూడదు. అంచులపై షాంపూ ఎక్కువగా పడితే సిల్వర్ మెరుపు అంతా పోయి నల్లగా మారిపోవచ్చు. ప్రధానంగా న్యూస్ పేపర్ ఉపయోగించడం వల్ల అద్దం మీద ఎటువంటి మరకలు లేకుండా షైనింగ్‌తో మెరుస్తుంది. ముందుగా కొన్ని నీళ్ళు చిలకరించాలి లేదా క్లీనింగ్ సొల్యూషన్‌ను చిలకరించి తర్వాత న్యూస్ పేపర్ తో శుభ్రం చేసుకోవాలి. కాగితాన్ని రెండు మూడు మడతలుగా మడతపెట్టిన తర్వాత శుభ్రపరచడానికి ఉపయోగించాలి. గోరువెచ్చని నీటికి కొద్దిగా వైట్ వెనిగర్‌ను మిక్స్ చేసి క్లీనింగ్ సొల్యూషన్‌గా తయారు చేసుకోవాలి. ఈ లిక్విడ్‌తోనే అద్దాన్ని శుభ్రం చేసి, మెరిపించుకోవచ్చు. వైట్ వెనిగర్‌ను నీటితో మిక్స్ చేసి స్ప్రే బాటిల్లో నింపుకొని, ప్రతి రోజూ లేదా సమయం దొరికినప్పుడల్లా అద్దాలను శుభ్రపరుస్తుండాలి.



జీవన సౌరభం



ఈ బామ్మ..గ్రాడ్యుయేట్!

డిగ్రీ చేయాలన్నది ఆమె కల. యవ్వనంలో ఉన్నప్పుడు అలాంటి డిగ్రీలు ఎన్ని చేయడానికైనా వెనుకాడరేమో. కానీ ఆమెది యవ్వనదశ కాదు. వృద్ధాప్యమూ దాటి జీవనచరమాంకంలో ఉంది. ఇప్పుడామె వయసు 81 సంవత్సరాలు. కానీ సాధించింది. ఎలా? చైనా రాజధాని బీజింగ్‌కు చెందిన జుయీ మిన్‌జియూ యువతిగా ఉన్నప్పుడు.. అర్థంతరంగా ఆమె చదువు ఆగిపోయింది. పెళ్లయింది.. పిల్లలు పుట్టారు. చదువు లేకపోయినా అందర్నీ బాగా చదివించారు. కానీ తాను గ్రాడ్యుయేషన్ చేయాలన్న కోరిక మాత్రం అలాగే మిగిలిపోయింది. చైనా ప్రభుత్వం కల్పిస్తున్న మోడ్రన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ఆమె కల నెరవేరేలా చేసింది. 80 ఏళ్లు దాటినా వయసు ఆమె గ్రాడ్యుయేషన్‌కు ఎలాంటి అడ్డంకిగా మారలేదు. థియాజిన్ యూనివర్సిటీలో ఈ కామర్స్ గ్రాడ్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకుంది. 2014లో ప్రథమ సంవత్సరం ప్రారంభించిన ఆమె ఇటీవలే కోర్సు పూర్తిచేసింది. "ఎన్నో కష్టాలుపడ్డాను. ఎన్నో అవహేళనలు ఎదుర్కొన్నాను. ఎట్టకేలకు నా కల నెరవేరింది. మా క్లాస్‌లో నేను పెద్ద వయసు విద్యార్థిని కావడంతో అందరూ కామెంట్ చేసేవాళ్లు. అధ్యాపకుల కన్నా నేనే పెద్దదాన్ని కావడంతో ఒకానొక దశలో ఈ కోర్సు పూర్తవుతుందో కాదో అనుకున్నా" అందామె నవ్వుతూ. కానీ కష్టపడి చదివి.. మిగతా విద్యార్థుల కంటే మెరుగైన ప్రతిభతో జుయీ డిగ్రీ పట్టా సంపాదించడం అభినందించాల్సిన విషయమే కదా!

కష్టాలు నీ శత్రువులు కాదు. మీ బలాన్ని బలహీనతల్ని తెలిపే మిత్రులు మాత్రమే.

మీ కోసం



ఇన్‌స్టంట్ కాఫీపొడి గడ్డకట్టకుండా ఉండాలంటే దానిని గాలిచొరవని డబ్బాలో ఉంచి డీప్ ఫ్రిజ్‌లో ఉంచాలి.

సెన్సెక్స్ ↓ 407
34,005

నిఫ్టీ ↓ 122
10,454

రూపాయి ↓ 13 పై॥
అమెరికా డాలరుకు రూ. 64.39

వెస్పా 'ఎలక్ట్రికా'

పియాజియో భారత మార్కెట్లోకి కొత్త వెస్పా ఎలక్ట్రికాను విడుదల చేసింది. ఆటో ఎక్స్‌పోలో ప్రదర్శించిన స్కూటర్‌ను 4.2 కిలోవాట్ లిథియం బ్యాటరీతో అందుబాటులోకి తెచ్చింది. ఒక్క ఛార్జింగ్‌తో స్టాండర్డ్ వర్షన్ 100 కిలోమీటర్లు, ఎలక్ట్రిక్ వర్షన్ 200 కి.మి దూరం వెల్లగలదు.



రాణించిన అమరరాజా బ్యాటరీస్

క్యూ3 లాభాల్లో 20% వృద్ధి

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

ప్రముఖ బ్యాటరీల తయారీదారు అమర రాజా బ్యాటరీస్ ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన తృతీయ త్రైమాసికం (క్యూ3)లో రూ.134.45 కోట్ల నికర లాభాలు సాధించింది. 2016-17 ఇదే క్యూ3లో రూ.112.32 కోట్ల లాభాలు నమోదు చేసింది. దీంతో పోల్చితే గత క్యూ3 లాభాల్లో 19.70 శాతం వృద్ధి చోటు చేసుకుంది. ఇదే సమయంలో కంపెనీ మొత్తం ఆదాయం రూ.1,513.82 కోట్ల నుంచి రూ.1,570.22 కోట్లకు చేరిందని ఆ సంస్థ రెగ్యులేటరీకి సమాచా రమిచ్చింది. ప్రస్తుత తమ ఉత్పత్తి సామర్థ్య వినియోగం తుది స్థాయికి చేరిందని అమర రాజా బ్యాటరీస్ మేనేజింగ్ డైరెక్టర్ జయదేవ్ గల్లా పేర్కొన్నారు. డిమాండ్ తగ్గట్లుగా విస్తరణ కోసం తమ పెట్టుబడుల సహకరించనున్నాయని పేర్కొన్నారు.

వర్థమాన, భవిష్యత్తులో ఎనర్జీ స్టోరేజీ, విద్యుత్ వాహనాల విభాగంపై దృష్టి కేంద్రీకరించనున్నట్లు జయదేవ్ తెలిపారు. ఆటో రంగం నుంచి వచ్చిన డిమాండ్ వల్ల తమ కంపెనీ గత త్రైమాసికంలో మరింత పటిష్టం అయ్యిందని అమర రాజా బ్యాటరీస్ సిఇఒ ఎస్ విజయానంద్ పేర్కొన్నారు. ఆటోమోటివ్ బ్యాటరీల అమ్మ కాల్లో మెరుగైన వృద్ధి సాధించామన్నారు. పారిశ్రామిక బ్యాటరీల వ్యాపారంలోనూ రికార్డు వృద్ధిని సాధించినట్లు ఆ కంపెనీ పేర్కొంది. కాగా టెలికం రంగం నుంచి వచ్చే వ్యాపారంలో స్తబ్దత చోటు చేసుకుందని తెలిపింది.

దుబాయ్ కంపెనీలో ఒఎన్‌జిసికి వాటా..!

అబూదాబి : దేశంలోనే అతిపెద్ద చమురు ఉత్పత్తి కంపెనీ ఒఎన్‌జిసి దుబాయ్ కేంద్రంగా పని చేస్తున్న అబూదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ (అడ్‌నోక్)లో వాటా కొనుగోలు చేసినట్లు సమాచారం. ఇందులో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కంపెనీల సభ్యులతో ఒఎన్‌జిసి కన్సోరియంగా ఏర్పడి దుబాయ్ కంపెనీలో వాటా స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కంపెనీ కొనుగోలులో ఒఎన్‌జిసి కన్సోరియం 10 శాతం వాటా కోసం 600 మిలియన్ డాలర్లు చెల్లించారని ఇటి ఒక కథనం వెల్లడించింది. ఒఎన్‌జిసికి చెందిన ఒఎన్‌జిసి విదేశ్ మేనేజింగ్ డైరెక్టర్ వికె వర్మ ఇందుకోసం అబూదాబిలో ఈ వ్యవహారం చూస్తున్నట్లు, ఆయన త్వరలోనే భారత్‌కు వచ్చి వివరాలు వెల్లడించవచ్చని సమాచారం. అడ్నోక్‌లో ప్రస్తుతం బ్రిటిష్ పెట్రోలియంకు 14.67 శాతం వాటా, టోటల్ ఎస్‌కెకు 13.33 శాతం, జపాన్ ఆయిల్ డెవలప్‌మెంట్ కో 12 శాతం చొప్పున వాటా కలిగి ఉన్నాయి. అడ్నోక్ రోజుకు 7 లక్షల బ్యారెళ్ల చమురును ఉత్పత్తి చేస్తోం ది. 2021 నాటికి 10 లక్షల బ్యారెళ్లు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

ఇ-ట్రియో నుంచి విద్యుత్ వాహనాలు

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో



పర్యావరణహిత విద్యుత్ వాహనాలను అందుబాటులోకి తెస్తున్నట్లు ఇ-ట్రియో ఆటో మొబైల్ వ్యవసాపకులు సత్యా యలమంచిలి తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ తాము మూడు వేరి యంట్లలో ఇవి100, ఇవి 180, మరో హచ్ బ్యాక్‌ను అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. త్వరలోనే వీటిని విడుదల చేయనున్నామని చెప్పారు. 2018 మార్చి నుంచి మార్కెటింగ్‌ను ప్రారం భించనున్నామని చెప్పారు. వీటి టెక్నలాజీ కోసం అమెరికన్ కంపెనీతో భాగస్వా మ్యం కుదుర్చుకున్నామన్నారు. కాగా ఈ కార్లు 25 నిమిషాల్లోనే చార్జింగ్ అయ్యేలా చైనా కంపెనీతో భాగస్వామ్యం కానున్నామన్నారు. నెలకు 1500 కార్ల తయారీ సామర్థ్యంతో బొల్లా రంలో ప్లాంటు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వచ్చే 15 నెలల్లో ఈ ప్లాంట్ అందుబాటులోకి రానుందన్నారు.

గో ఎయిర్ చౌక ఆఫర్

న్యూఢిల్లీ : గోఎయిర్ ప్రారంభ ధరలు రూ.991కే విమానయానం అందించనున్నట్లు తెలిపింది. ఈ ఆఫర్ కింద ఫిబ్రవరి 20 వరకు బుక్ చేసుకోవచ్చు. హెచ్‌డిఎఫ్‌సి డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా టిక్కెట్లను బుక్ చేసుకునే వారికి అదనంగా 10 శాతం డిస్కౌంట్ అందిస్తుంది. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు రూ.1,731కే విమానయానం అందిస్తుంది. బాగ్డోగ్ర నుంచి గౌహతికి విమాన టిక్కెట్ ధర రూ.991గా, హైదరాబాద్ నుంచి చెన్నైకి రూ.1,399గా నిర్ణయించింది. మరిన్ని నగరాలకు ఈ సదుపాయం అందుబాటులో ఉంచినట్లు తెలిపింది.

బుడగ తేలికదే..!

- ప్రమాదమేమీ కాదు
- మార్కెట్ల పతనంపై ఆర్‌బిఐ గవర్నర్
- కాని అప్రమత్తంగా ఉండాలి
- ప్రపంచ సూచీలు పడుతున్నాయి



ఆర్‌బిఐ 59వ సెంట్రల్ బోర్డు సమావేశంలో మంత్రులు అరుణ్ జైట్లీ, శివ్ ప్రతాప్ శుక్లా, ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ తదితరులు.

న్యూఢిల్లీ : దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస పతనాన్ని తేలికగా తీసుకోవాలని రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) గవర్నర్ ఉర్జిత్ పటేల్ పరోక్ష ప్రకటన చేశారు. స్టాక్ మార్కెట్ బుడగ పెద్ద సమస్యలకేమీ దారి తీయబోదని అభిప్రాయపడ్డారు. అయితే మార్కెట్ల నష్టాలపై ఆర్‌బిఐ, సెబీ అప్రమత్తం, అవగాహనతో ఉండాలని మాత్రం అన్నా రు. బడ్జెట్ తర్వాత తొలిసారి ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ శనివారం ఆర్‌బిఐ బోర్డు సమాశానికి హాజర య్యారు. అయితే ఇందులో ఎల్‌టిసిజి పన్ను విధానంపై చర్చకు రాలేదు. మీటింగ్ అనంతరం ఉర్జిత్ మీడియాతో మాట్లా డారు. ప్రస్తుత ప్రపంచ, దేశీయ స్టాక్ మార్కెట్ల పోకడపై వివరణ ఇచ్చారు. గత కొద్ది రోజులుగా మార్కెట్లు వేగంగా పడిపోతున్నాయన్నారు. అత్యధిక ఈక్విటీ ధరల వద్ద మార్కెట్‌లో హెచ్చు, తగ్గులు (సైక్లింగ్) ఉంటుందని, ఇదీ మంచి పరిణామమేనని పేర్కొన్నారు. గత ఏడు సెషన్లలో బిఎస్‌ఇ సెన్సెక్స్ 2,200 పాయింట్ల మేర పతన మయ్యింది. దీంతో మదుపర్లు రూ.10 లక్షల కోట్ల పైగా విలువ కోల్పో యిన విషయం తెలిసిందే. వాల్ స్ట్రీట్ ఆరు సెషన్లలో ఐదు రోజులు పతనాన్ని చవి చూసింది. ఈ ప్రభావం ప్రపంచ మార్కెట్లతో పాటు భారత సూచీలపై తీవ్రంగా ఉంది.

ఇది వరకే చర్చించాం : జైట్లీ

ఎల్‌టిసిజి పన్నుపై సెబీ బోర్డులో ఉదయమే చర్చించడం జరిగిందని జైట్లీ ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పా రు. ఈ పన్నును తిరిగి చేర్చాలని ప్రస్తుత బడ్జెట్‌లో ప్రతిపాదించడం జరిగిందన్నా రు. అయితే ఈ అంశం ఆర్‌బిఐ బోర్డు మీటింగ్‌లో భాగం కాద న్నారు. కాగా పంటలకు మద్దతు ధర (ఎంఎస్‌పి) ఆర్‌బిఐ మీటింగ్‌లో చర్చించడం జరిగిందన్నారు. దీన్ని ఎలా అమలు చేయాలి, ప్రభావం ఎలా ఉండబోతోంది, ఎగుమతులకు మద్దతు ఎలా ఉంటుందనే అంశాలపై మాట్లాడమని మంత్రి పేర్కొన్నారు. వడ్డీ రేట్ల తగ్గింపునపై ఉర్జిత్ మాట్లాడుతూ రెండు రోజుల క్రితమే బ్యాంకులు మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్- ఆధారిత రుణ రేట్లను తగ్గించాయన్నారు. రుణ గ్రహీతలకు బ్యాంకులు వడ్డీ రేట్లను కొంత బదిలీ చేశాయన్నారు.

దిద్దుబాటు కొనసాగొచ్చు : సెబీ చీఫ్

దేశీయ స్టాక్ మార్కెట్లలో మరికొంత కాలం పతనం కొనసాగవచ్చని సెబీ ఛైర్మన్ అజయ్ త్యాగి పేర్కొన్నారు. ఇదే సమయంలో రిటైల్ ఇన్వెస్టర్లు మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టడానికి సరైన సమయమన్నారు. దీర్ఘకాల పెట్టుబడి లాభాల (ఎల్‌టిసిజి)పై పన్ను అమలు వల్లే మార్కెట్లు పడిపోతున్నాయని భావించడం సరైంది కాద న్నారు. అంతర్జాతీయ పరిణామాల దష్ట్యా మరి కొద్ది రోజులు మార్కెట్లు ఊగిసలాడే అవకాశముందని హెచ్చరించారు. అయితే మదుపర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మార్కెట్లపై ఎల్‌టిసిజి పన్ను ప్రభావం లేదన్నది మాత్రం పూర్తిగా నిజం కాదని త్యాగి అభిప్రాయపడ్డారు. అయితే ఎల్‌టిసిజి పన్ను వల్ల కూడా మార్కెట్లు కొంత నష్టపో యాయని, అయితే చాలా వరకు అంతర్జాతీయ మార్కెట్ల వల్లే కుదేలైనట్లు పేర్కొన్నారు.

మార్కెట్ల కాలాన్ని పెంచం

ఎల్‌టిసిజి పన్నుపై త్యాగి మాట్లాడుతూ మార్కె ట్లు జోష్‌లో ఉన్నాయని, ఈ సమ యంలో ఎల్‌టిసిజి ప్రవేశపె ట్టడం సరైందేన న్నారు. ఎల్‌టిసి జికి వ్యతిరేకంగా మదుపర్ల నుంచి తమకు ఎలాంటి విన్న పాలు రాలేదన్నారు. ఈక్విటీ మార్కెట్ పెట్టుబడు లపై వచ్చే లాభాలు రూ.1 లక్ష దాటితో 10 శాతం పన్ను అమలు చేయనున్నట్లు కేంద్ర బడ్జెట్‌లో మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్న విషయం తెలిసిందే. ప్రస్తుత ఏడాదిలో కార్పొరేట్ బాండ్లను మార్కెట్‌లోకి ప్రవేశపెట్టాలని యోచిస్తున్నా మని త్యాగీ అన్నారు. 2018 సెప్టెంబర్ కల్లా దీనిపై విదివిధానాలు ప్రకటిస్తామని చెప్పారు. మార్కెట్ కాల వ్యవధిని పెంచే యోచనేది తమ మదిలో లేదన్నారు.

భవిష్యత్తు అత్యంత దారుణమే..!

రాబోయే బేర్ మార్కెట్ అత్యంత దారుణంగా ఉండొచ్చని 75 సంవత్సరాల వయోవృద్ధుడు అంతర్జాతీయ ఇన్వెస్టర్ జిమ్ రోగర్స్ హెచ్చరించారు. తాను ఇంతవరకు జీవితకాలంలో చూడనంత ఘోరంగా ఉండొచ్చన్నారు. అయితే దీనిపై కాలపరిమితిని ఆయన పేర్కొనలేదు. అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం తర్వాత అమెరికాలో డెట్ భారీగా పేరుకుపోవడమే ఇందుకు కారణమని ఆయన అన్నారు. ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లు పెంచే వరకు మార్కెట్లలో ఈ ఆటుపోట్లు తప్పవన్నారు. ఆ తర్వాత తిరిగి పురోగమించవచ్చని విశ్లేషించారు.

సెబీ పరిశీలనలో ఫోర్టిస్ వివాదం

న్యూఢిల్లీ : ఫోర్టిస్ హెల్త్‌కేర్‌కు చెందిన ఫోర్టిస్ హాస్పిటల్స్ నుంచి కంపెనీ ప్రమోటర్లుగా ఉన్న సింగ్ సోదరులకు రూ.500కోట్లు రుణ వివాదాన్ని పరిశీలిస్తున్నామని సెబీ తెలిపింది. బోర్డు అనుమతి లేకుండా ఎలా రుణం తీసుకున్నారో వివరణ కోరుతున్నామని సెబీ ఛైర్మన్ అజయ్ త్యాగి పేర్కొన్నారు. ఈ అంశంపై శుక్రవారం ఫోర్టిస్ హెల్త్‌కేర్‌కు సెబీ నోటీసులు కూడా పంపించింది. ఈ నోటీసులపై ఫోర్టిస్ స్పందిస్తూ.. స్వల్ప కాలిక పెట్టుబడుల కింద ఏడాది క్రితం ఈ రుణాన్ని ఇచ్చామని, పూర్తి హా మీతో షరతులకు లోబడే ఇచ్చామని తెలిపింది. ఈ వివాదంతో ఇప్పటికే సింగ్ సోదరులు మల్వీందర్ మోహన్ సింగ్, శివీందర్ మోహన్ సింగ్‌లు కంపెనీ బోర్డుకు రాజీనామా చేశారు.

ఎన్‌పిసిసి విస్తరణ

హైదరాబాద్ : అబుదాబికి చెందిన ఇపిసి కాంట్రాక్టుల సంస్థ నేషనల్ పెట్రోలియం కన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఎన్‌పిసిసి) విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో మరో కార్యాలయాన్ని తెరిచింది. దీంతో దేశంలో అబుదాబి, ముంబయి, హైదరాబాద్‌లలో తాము మూడు కార్యాలయాలను అందుబాటులోకి తెచ్చినట్లయ్యిందని కంపెనీ ఛైర్మన్ అకిల్ మధి పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కార్యాలయంలో 450 మంది ఇంజనీర్లు పని చేస్తున్నారన్నారు. భవిష్యత్తులో మరింత మందిని తీసుకుంటామన్నారు. ముప్పై ఏళ్ల క్రితం ముంబయిలో కార్యాలయాన్ని స్థాపించి ఆయిల్, గ్యాస్ రంగంలో ఇపిసి కాంట్రాక్టులు నిర్వహిస్తున్నామన్నారు.



K MADHUSUDHANA RAO
JUNIOR LECTURER IN ENGLISH
UPPUGUNDURU, PRAKASAM DT.

One can be a good teacher if he..

TET MODEL PAPER - V

LANGUAGE – II (Content and Methodology)

1. Walk carefully ____________.
Now choose the clause that matches with the preceding clause.
a) or you should fall.
b) lest you should fall.
c) else you should fall.
d) so that you should fall.

2. ____________ had I reached the station when the train steamed out. Identify the conjunction that suits the blank.
a) As soon as b) No sooner
c) Scarcely d) Though

3. Regarding Adjectives, study the following sentences and choose the correct answer.
1) This is the most unique painting I have ever seen.
2) Nobody is more ideal than him.
3) I have the most perfect solution for your problem.
4) Pollution is the most universal threat all over the world.
a) All are correct.
b) All are wrong.
c) Only 2 is correct.
d) 1,3 and 4 are correct.

4. 'I know the fact.'
If the sentence is changed to passive, the sentence reads like
a) The fact is known by me.
b) The fact is known to me.
c) The fact is known for me.
d) The fact is known of me.

5. While inviting to a party, your friend said, "Please do come." The dialogue indicates
a) an earnest request
b) compulsion
c) suggestion
d) permission

6. Your friend is asking you to imagine, "What would you do, if you _______ to lose your job?"
Choose the relevant form of the verb.
a) are b) have
c) got d) were

7. Study the following sentences and identify the incorrect one.
a) There is no room in this bus.
b) I am very weak in English.
c) I saw two females in the store.
d) All my relatives are poor.

8. Only the _________ member can be elected the President.
a) old b) older
c) eldest d) oldest

9. We must refrain ____________ with bad people.
Identify the phrase that fills the blank.
a) from dealing b) to deal
c) of dealing d) to dealing

10. If I ___________ fly like a bird, I ___________ be with you now.
Now identify the suitable pair to fill in the blanks.
a) would, would
b) could, would
c) could, will
d) can, would

11. I have not finished my latest project.
The underlined word is a/an
a) noun b) adjective
c) adverb d) preposition

12. The police ____________ the hotel and caused uproar.
Now choose the suitable phrasal verb.
a) broke down b) broke into
c) broke out d) broke up

13. I'm not feeling very well. I think I should go ________ home. Identify the answer from the options.
a) at b) to
c) in d) no preposition

14. He ________ does his best should be rewarded. Identify the relative pronoun that fills the in the blank.
a) who b) which
c) that d) who and that

15. 'Let's go for a walk, __________ ?'
The suitable tag is
a) don't we b) shall we
c) do we d) shalln't we?

16. That he is a diligent boy is known to everybody.
The above sentence is an example of
a) an adjective clause
b) an adverb clause
c) a noun clause
d) None of the above.

17. 'Kindle' the opposite of this word is
a) ignite b) inflame c) put outd) blaze

18. I was afraid of ________ his feelings.
The suitable word to fill in the blank is
a) offend
b) to offend
c) offending
d) to offending

19. One of the following sentences is correct. Identify the sentence.
a) Never I have seen such a portrait.
b) Never have I seen such a portrait.
c) I never have seen such a portrait.
d) Never have seen I such a portrait.

20. You planned to go to the station by 9.30. But already it is 9.45. Then what would you say?
a) It is time I left for the station.
b) It is time to leave for the station.
c) It is time to left for the station.
d) It is time I have left for the station.



Read the following passages carefully and answer the questions from 21 to 24.

Your body cannot use every single bit of the food you eat. There will always be some that needs to be changed into waste by the large intestine. From the small intestine, left-over food gets pushed into the large intestine where it is dried up and turned into feces, or poop.

If you want to keep your digestive system healthy, you should be careful about what you eat. Healthy whole grains, fruits, and vegetables all pass through your digestive system quickly and easily. They also contain fiber, which is a nutrient that helps in digestion. Your body has a harder time digesting fatty foods, so be careful how much fat is in your diet.

21. The passage is about
a) the kind of food we eat.
b) the digestive system.
c) the intestines
d) fiber food.

22. According to the passage, which is the ideal food.
a) tasty food b) protein food
c) fiber-rich food d) carbohydrates

23. Which of the following takes much time to get digested?
a) Fiber-rich food b) protein food
c) carbohydrates d) vegetables

24. Identify the word from the passage which means the waste material from the bowels.
a) feces b) nutrient
c) intestine d) leftover

Methodology

25. Effective teaching involves
a) teacher dominance
b) pupil dominance
c) teacher and pupil interaction
d) silence

26. Misbehaved children are corrected
a) by punishing
b) by allowing them accordingly.
c) by regular teaching
d) by ways of motivating them.

27. Which is 'feedback' in the newspaper communication?
a) articles b) editorials
c) letters to the editors d) news

28. The sound /b/ is
a) velar b) glottal
c) bilabial d) nasal

29. Books can be powerful source of communication, provided
a) content is abstract
b) content is illustrative
c) medium is Hindi
d) contented is presented through good print.

30. One can be a good teacher if he
a) has genuine interest in teaching.
b) knows how to teaching.
c) knows his subject.
d) has a good expression.

★

Answer : Explanation

1. **b** 'lest' means 'in case' and is followed by Sub+should+V1 in ceremonial cases.
2. **c** 'Hardly or Scarcely' is followed by Inversion (HV + Sub + MV) + when + clause.
3. **b** Some adjectives are non-gradable i.e. they don't have degrees.
Ex. Perfect, universal, ideal, round, impossible etc.
4. **b** Certain verbs like 'cover, paint, fill and know' do not take 'by' in passive, instead, they take 'with or to.'
5. **a** In imperatives, 'do' is added before the main verb to lay emphasis or persuasion.
6. **d** In doubtful/unreal conditions, we use 'were' even after singular subjects.
7. **c** Male and female are adjectives and so cannot be used as nouns.
8. **d** 'eldest' for persons of the same family and 'oldest' for other people.
9. **a** The verbs 'refrain, prohibit, refrain and stop' take 'from + V1+ing ' after them.
10. **b** The sentence expresses an unreal condition. Study the second condtional sentence.
11. **c** A word that can separate a HV and MV is generally an adverb.
12. **b** 'break down' = fail mechanically; break into= enter by force; break out= begin suddenly; break up= to end something.'
13. **d** The verbs 'come' and 'go' take no preposition when used before 'home.'
14. **d** Here both 'who and that' can be used.
15. **b** 'Let's ' takes the tag 'shall we?'
16. **c** A Noun Clause is used in place of a Noun. 'That he is a diligent boy' is the subject of the verb 'is'.
17. **c** To 'kindle' means to 'ignite' to 'put out' means to 'extinguish.'
18. **c** The usage is 'be afraid of something' or 'be afraid of V1+ing something.'
19. **b** When semi negatives come in the beginning of a sentence, the subject is inverted i.e HV+Sub+MV.
20. **a** After the clause 'It is time' the following clause should be 'Sub + V2.'

21. b	22. c	23. b	24. a
25. c	26. d	27. c	28. c
29. b	30. a		

బిజెపి ఎప్పుడూ మిత్రపక్షమే : కెఇ

ప్రజాశక్తి - నిడదవోలు (పశ్చిమగోదావరి)

బిజెపి తమకు ఎప్పుడూ మిత్రపక్షమేనని, బిజెపితో తాము విడిపోవాలని కోరుకోవడం లేదని, వారు విడిపోవాలంటే విడిపోవచ్చని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కెఇ.కృష్ణమూర్తి పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు ఆయన శనివారం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన నిడదవోలులో విలేకర్లతో మాట్లాడారు. వచ్చేనెల ఐదోతేదీన నిర్వహించే పార్లమెంట్ సమావేశాల్లో రాష్ట్రానికి తగిన నిధులు కేటాయిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నామని చెప్పారు. ఆ సమావేశాల్లోనే విశాఖకు రైల్వేజోన్, కడప ఉక్కు కర్మాగారం, ఆంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ వంటివి ఉంటాయని ఆశిస్తున్నామని తెలిపారు. ప్రతిపక్షం, వామపక్షాలు మాత్రమే రాష్ట్రానికి ప్రత్యేకహోదా అడుగుతున్నాయన్నారు.



సమావేశం

విశాఖలోని పార్కు హయత్ హోటల్‌లో శనివారం విజిలెన్స్ స్టడీ సర్కిల్ ముగిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న సెంట్రల్ విజిలెన్స్ చీఫ్ కమిషనర్ కెవి చౌదరి

న్యాయవాదుల దీక్షలు భగ్నం

అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు : న్యాయవాదులు

ప్రజాశక్తి - కడప/ అనంతపురం సిటీ

రాయలసీమలో హైకోర్టును ఏర్పాటు చేయాలని కోరుతూ కడప, అనంతపురం జిల్లాల్లో న్యాయవాదులు చేస్తున్న దీక్షలను పోలీసులు భగ్నం చేశారు. అనంతరం వారిని ఆసుపత్రికి తరలించారు. కడప జిల్లా కోర్టు ఎదుట బార్ అసోసియేషన్ జిల్లా మాజీ అధ్యక్షులు, న్యాయవాది నాగరాజు చేపట్టిన నిరవధి దీక్ష శనివారం నాటికి ఆరో రోజుకు చేరుకున్నాయి. ఆయన ఆరోగ్యం క్షీణించడంతో పోలీసులు సాయంత్రం దీక్షలను భగ్నం చేశారు. ఆయనను చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. 19 రోజులుగా సాగుతున్న రిలేనిరాహార దీక్షలను కొనసాగిస్తామని రాయలసీమ న్యాయవాదులు జెఎసి కన్వీనర్, కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.మస్తాన్‌వలి పేర్కొన్నారు. అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని చెప్పారు. సీమలో హైకోర్టు ఏర్పాటు చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు జి.వి.రాఘవరెడ్డి, ఐలు జిల్లా అధ్యక్షులు ప్రమోద్‌కుమార్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

అనంతపురంలో నిరవధిక దీక్ష చేస్తున్న న్యాయవాది బి.నారాయణరెడ్డి దీక్షను పోలీసులు భగ్నం చేశారు. తోటి న్యాయవాదులు మాత్రం నిరాహార దీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు రాచమల్లు హరినాథ్‌రెడ్డి, జి.మల్లికార్జునవర్మ, అంజనకుమార్, ధరమ్‌సింగ్‌నాయక్‌లు మాట్లాడారు. రాయలసీమలో తక్షణమే హైకోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఆర్కిడ్ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించాలి



గుంటూరులో సత్కారం పొందుతున్న విదేశీ పరిశోధకులు

ప్రజాశక్తి - ఎఎన్‌యు (గుంటూరు)

భారతదేశంలో ఆర్కిడ్ (ఏక బీజ లక్షణం) మొక్కల సాగుకు అవకాశాలున్నా వాటిని అందం, ఆహ్లాదకరంగానే చూస్తున్నారని, ఔషద మొక్కలుగానూ వినియోగించొచ్చని బెంగుళూరుకు చెందిన సదానంద హెగ్డే చెప్పారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని వృక్ష, సూక్ష్మజీవశాస్త్ర విభాగం నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు శనివారం రెండో రోజుకు చేరింది. సదానంద మాట్లాడుతూ.. ఆర్కిడ్ మొక్కలకు మంచి వ్యాపారం ఉన్నా భారత్‌లో వాటి సాగు, పునరుత్పత్తి, ఎగుమతి, వ్యాపారం ప్రోత్సాహకరంగా లేదన్నారు. ఈ మొక్కల వల్ల సాలీనా రూ.5 వేల కోట్ల వ్యాపారం జరుగుతుందని, దీని సాగుకు అవసరమైన పరిస్థితులు ఇక్కడ కల్పించడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎన్‌జిఒలు, పరిశ్రమలు ఆర్కిడ్ మొక్కలపై దృష్టిపెట్టి అభివృద్ధి చేసి ఆర్కిడ్ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించాలని సూచించారు. సదస్సులో జపాన్‌కు చెందిన హిరోయికి, టనాకా, మియమోటో, డెన్మార్క్‌కు చెందిన హెన్రిక్ లుట్‌కెన్ పరిశోధనా పత్రాలను సమర్పించారు. సదస్సులో డైరెక్టర్ డాక్టర ఎస్‌ఎం.కాశిం, నిర్వాహక కార్యదర్శి డాక్టర్ రోశయ్య పాల్గొన్నారు.

శివారు ప్రాంతాలకూ సాగు నీరందించడమే లక్ష్యం

మంత్రి దేవినేని

ప్రజాశక్తి-నందివాడ (కృష్ణా)

తారక రామ ఎత్తిపోతల పథకాన్ని జూలై మాసాంతానికి పూర్తి చేసి రాబోయే ఖరీఫ్ సీజన్‌లో శివారు ప్రాంతాలకూ సాగునీరు అందిస్తామని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. కృష్ణాజిల్లా నందివాడ మండలం అరిపిరాల వద్ద రూ. 9 కోట్లతో నిర్మించనున్న తారక రామ ఎత్తిపోతల పథకం నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుడమేరుపై అరిపిరాల వద్ద నిర్మించే ఎత్తిపోతల పథకం ద్వారా తుమ్మలపల్లి, పుట్టగుంట, పెదలింగాల, కురిపిరాల, కుదరవల్లి, రామాపురం, నందివాడ గ్రామాల్లోని 3,597 ఎకరాలకు సాగునీటి లభ్యత ఏర్పడుతుందని తెలిపారు. పట్టిసీమ ద్వారా సకాలంలో నీరందించడం వల్ల ఈ ప్రాంతంలో దిగుబడులు పెరిగాయన్నారు. బుడమేరు అభివృద్ధిలో భాగంగా నష్టపోయిన 232 మంది రైతులకు రూ. 25 లక్షల నష్ట పరిహారం చెల్లించి ఆదుకున్నామన్నారు.

సేల్స్ ప్రమోషన్

- లారీల విక్రయానికి భారీ రాయితీలు
- వంద శాతం ఫైనాన్స్ సౌకర్యం



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ ప్రతినిధి

గూడ్స్ వెహికల్ తయారీ కంపెనీలు సేల్స్ ప్రమోషన్‌లో భాగంగా పెద్దఎత్తున ప్రోత్సాహకాలు ఇస్తున్నాయి. 100 శాతం ఫైనాన్స్ సౌకర్యం కల్పిస్తున్నాయి. ఇప్పటికే తయారైన వాహనాలు కంపెనీల్లో భారీగా ఉండిపోవడంతో ఇలా రాయితీలను అందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో నూతన వాహనాల కొనుగోళ్లు పెరిగినట్లు సమాచారం. బాడీ బిల్డింగ్, క్యాబిన్ నిర్మాణాల కోసం విజయవాడ ఆటోనగర్‌లోని బాడీ బిల్డింగ్ యూనిట్ల వద్ద నాలుగు వేల వరకు ఛాయిస్‌లుండడమే ఇందుకు నిదర్శనం.

టాటా, అశోక్‌లేలాండ్, ఐషర్ కంపెనీలకు చెందిన 14 టైర్ల లారీ ఛాయిస్ ఒక్కొక్కటి రూ.31 లక్షల వరకూ ఉంది. తగిన షూరిటీ చూపిన వారికి ఫైనాన్స్ కంపెనీలు ఈ మొత్తానికి(100 శాతం)ఫైనాన్స్ సమకూరుస్తున్నాయి. ఇన్‌వాయిస్‌లో రూ.31 లక్షలకు బిల్లులు ఇస్తున్నాయి. దీంతో కొనుగోలుదారుడికి ఛాయిస్ ఖర్చు మొత్తంగా ఫైనాన్స్ రూపంలో అందుతోంది. ఫైనాన్స్ కంపెనీలు వాహనదారునికి ఇచ్చిన మొత్తం నుంచి ఒక్కో కంపెనీ ఒక్కో రకంగా రూ.6 లక్షల నుంచి రూ.5.50 లక్షల వరకు తిరిగి కొనుగోలుదారునికి అందిస్తున్నాయి. ఒక్కో ఛాయిస్‌కు బాడీ, క్యాబిన్ నిర్మాణం, ఆర్‌టిఎ పన్నులు ఇతరత్రా ఖర్చులకు రూ.3 లక్షల నుంచి రూ.3.50 లక్షల వరకు వ్యయమవుతుంది. దీంతో కొనుగోలుదారునికి ఇంకా రూ.3 లక్షల నుండి రూ.2.5 లక్షల వరకు మిగులుతోంది. ఈ మొత్తం మూడు నెలలపాటు వర్కింగ్ క్యాపిటల్‌గా (వాహన నిర్వహణకు)ఫైనాన్స్ కంపెనీల కిస్తీలకు సరిపోతోంది. ఫైనాన్స్ ద్వారా వాహనం కొనుగోలు చేసిన వారు ఐదేళ్ల కాలపరిమితితో రూ.31 లక్షల ఫైనాన్స్‌కుగాను సగటున ఆరు శాతం వడ్డీతో కలిపి నెలవారీగా రూ.65 వేల వరకు కిస్తీ చెల్లించాల్సి ఉంటుంది. వాహన కొనుగోలుకు మొత్తం ఫైనాన్స్‌గా సమకూరడంతో వాహనాల కొనుగోళ్లు ఒక్కసారిగా ఊపందుకున్నాయి. గతేడాది డిసెంబరులో 1,500 వాహనాల వరకు విక్రయం జరగగా.. ఈ ఏడాది ప్రారంభమైన నలభై రోజుల్లోనే 4,500 వాహనాలను ఆయా కంపెనీలు విక్రయించడం గమనార్హం. ఈ కంపెనీలు విక్రయించిన ఛాయిస్‌లన్నీ ఆటోనగర్‌లోని బాడీ బిల్డింగ్ యూనిట్ల వద్ద బారులు తీరాయి. సాధారణంగా ఒక్కో వాహన ఛాయిస్‌కు వారం రోజుల్లో బాడీ బిల్డింగ్ పూర్తవుతుంది. ఒక్కసారిగా అధిక సంఖ్యలో ఆర్డర్ రావడంతో బాడీ బిల్డింగ్ యూనిట్ల నిర్వహకులు నెల రోజుల వరకు గడువు కోరుతున్నారు.

సిబిల్ రేటింగ్‌ను పక్కనపెట్టి రుణాలు మంజూరు

వాహన కొనుగోలుదారు సిబిల్ రేటింగ్ (గత రుణాల చెల్లింపు) ప్రాతిపదికన ఫైనాన్స్ కంపెనీలు గతంలో రుణాలిచ్చేవి. ప్రస్తుతం ఆ రేటింగ్‌ను పక్కనపెట్టి మరీ రుణాలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రుణ చెల్లింపుల్లో గత రికార్డు సరిగ్గా లేని వారు సైతం రుణాలు పొంది వాహనాలు కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

'యాక్ట్ ఈస్ట్' విధానంతో భారత్-ఏసియాన్ సంబంధాలు బలోపేతం

'గీతం' అంతర్జాతీయ సదస్సులో మయన్మార్ రాయబారి మోక్యా ఆంగ్



విశాఖ సదస్సులో మాట్లాడుతున్న మోక్యా ఆంగ్

ప్రజాశక్తి- విశాఖపట్నం

భారత ఉపఖండంలో కూటమిగా ఉన్న ఏసియాన్ దేశాలతో భారతదేశం అమలు చేస్తున్న 'యాక్ట్ ఈస్ట్' వ్యూహాత్మక విధానం వాణిజ్యపరమైన అంశాలతో పాటు భద్రతా అంశాలకు కీలకమైనదిగా మారుతోందని భారత్‌లో మయన్మార్ రాయబారిగా వ్యవహరిస్తున్న మోక్యా ఆంగ్ పేర్కొన్నారు. భారత్-ఏసియాన్ 25 ఏళ్ల భాగస్వామ్యంపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ వాణిజ్య విద్యా విభాగం నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు శనివారం ఆయన హాజరై ప్రధాన ప్రసంగం చేశారు. భారత్, మయన్మార్, థాయ్ లాండ్‌ల మధ్య జాతీయ రహదారుల నిర్మాణం, 69 వంతెనల నిర్మాణానికి భారత దేశం 245 మిలియన్ డాలర్ల నిధులను కేటాయిం చడం అభినందనీయ మన్నారు. ఏసియాన్ దేశాలతో మైత్రీ వారధిగా భారత్ - వియత్నాం -మయన్మార్-లావోస్-కంబడియాలను కలిపే జాతీయ రహదారి నిర్మాణానికి భారత్ ముందుకు రావడం చారిత్రాత్మకంగా ఆయన అభివర్ణించారు. భారత్ -మయన్మార్ దేశాల మధ్య రవాణా వ్యవస్థ అభివృద్ధికి ప్రతిపాదిత కలదాన్ మల్టీమోడల్ ట్రాన్సిట్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్టు త్వరలో కార్యరూపం దాల్చ గలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

చరిత్రను సమగ్రంగా అధ్యయనం చేయాలి



విజయవాడలోని సదస్సులో మాట్లాడుతున్న రామచంద్రమూర్తి

ప్రజాశక్తి- మొగల్రాజపురం (విజయవాడ)

విజయవాడపై ఇప్పటివరకు దుర్గామల్లేశ్వర స్వామి దేవాలయ శాసనాల ఆధారంగా చరిత్రను అధ్యయనం చేశారని, సమగ్రమైన చరిత్రను రాసేందుకు ప్రాక్ చరిత్ర నుంచి ఆధునిక యుగం వరకు అనేక చారిత్రక ఘట్టాలున్నాయని, వాటన్నింటినీ విశ్లేషించినప్పుడే నిజమైన విజయవాడ చరిత్రను క్రోడీకరించినట్లు అవుతుందని ప్రముఖ శాసన పరిశోధకులు ఎన్నెస్.రామచంద్రమూర్తి అన్నారు. కల్చరల్ సెంటర్‌లో జరుగుతున్న "తరతరాల విజయవాడ" అనే అంశంపై జాతీయ సదస్సు ముగింపు సభ శనివారం జరిగింది. సభలో రామచంద్రమూర్తి మాట్లాడుతూ చరిత్రను తెలుసుకునేందుకు ఇలాంటి సదస్సులు దోహదపడతాయని తెలిపారు. మాలక్ష్మీ గ్రూఫ్ చైర్మన్ హరీశ్చంద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన తరువాత విజయవాడ ముఖ చిత్రం మారిపోయిందన్నారు. ఆత్మీయ అతిథులుగా కేంద్ర పురావస్తు శాఖ అధికారి శ్రీలక్ష్మీ, సమాచార శాఖ మాజీ సంయుక్త సంచాలకులు జాన్సన్ చోరగుడి, వి.శ్రీనివాసరెడ్డి, జైకిషన్, సందీప్ మండవ, మాజీ మేయర్ జంధ్యాల శంకర్ పాల్గొని మాట్లాడారు.

సమస్య ఎక్కడుంటే అక్కడ సిపిఎం

- టిడిపి సర్కారుపై ప్రజల్లో అసంతృప్తి
- పోరాటాలకు విస్తారమైన అవకాశాలు
- మూడేళ్లలో స్ఫూర్తిదాయక ఉద్యమాలు
- కార్యదర్శి నివేదికలో మధు



బహిరంగ సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి. మధు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- పర్సా సత్యనారాయణ నగర్ (భీమవరం)

ప్రజా సమస్య ఎక్కడుంటే అక్కడ మన పార్టీ జోక్యం ఉండాలని, ప్రత్యామ్నాయం చూపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు చెప్పారు. బిజెపి ప్రభుత్వ సరళీకరణ విధానాలు, మతోన్మాదానికి వ్యతిరేకంగా జనబాహుళ్యాన్ని పోరాటాల వైపునకు మళ్లించాలని పిలుపునిచ్చారు. గత మహాసభ నుంచి ఇప్పటి వరకు ఈ మూడేళ్ల కాలంలో రాష్ట్రంలో సిపిఎం అనేక ప్రజా సమస్యలపై ఉధృత పోరాటాలు, దీర్ఘకాలిక ఉద్యమాలు నిర్మించిందని వివరించారు. ఇక్కడి పర్సా సత్యనారాయణ నగర్‌లో నిర్వహిస్తున్న సిపిఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 25వ మహాసభల్లో భాగంగా శనివారం సాయంత్రం ప్రతినిధుల సభలో రాజకీయ నిర్మాణ, ప్రజా రంగాల నివేదికలను మధు ప్రవేశపెట్టారు. మూడేళ్లలో పార్టీ నిర్వహించిన కృషిపై రాష్ట్ర కమిటీలో సమీక్షించి ఆ వివరాలను ఈ నివేదికల్లో పొందుపర్చామని, మూసాయిదాలపై మహాసభల్లో విమర్శ, ఆత్మవిమర్శ పూర్వకంగా కూలంకషంగా చర్చించాలని కోరారు. ప్రపంచంలో పెట్టుబడిదారి వ్యవస్థలో 2008లో ప్రారంభమైన సంక్షోభం తగ్గకపోగా ఇంకా తీవ్రమవుతోందన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రపంచంలో పలు చోట్ల ఉవ్వెత్తున పోరాటాలు ఎగిసిపడుతున్నాయని చెప్పారు. కేంద్రంలో బిజెపి మతోన్మాదాన్ని, సరళీకరణ విధానాలను జమిలిగా దూకుడుగా అమలు పరుస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వామపక్షాల వద్దనే ప్రత్యామ్నాయ విధానాలున్నాయన్నారు. ఆ దిశా నిర్దేశంతోనే ఏపీలో పోరాటాలు, ఉద్యమాలు కొనసాగుతున్నాయని వివరించారు.

మెండుగా అవకాశాలు

రాష్ట్రంలో ప్రజా ఉద్యమాలకు అవకాశాలు మెండుగా ఉన్నాయని మధు చెప్పారు. టిడిపి ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో వెనకబాటుపై అక్కడి ప్రజానీకంలో ఆందోళన, ఆవేదన, ఆగ్రహం వ్యక్తమవుతున్నాయన్నారు. అలాగే సరళీకరణ విధానాలు సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా అట్టడుగునున్న దళితులు, గిరిజనుల బతుకులను దెబ్బ తీస్తున్నాయని తెలిపారు. విభజన హామీల అమలు విషయంలో కేంద్రం మాట తప్పిందని, బిజెపితో టిడిపి అంటకాగుతూ రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టిందని పేర్కొన్నారు. ఏపీకి జరిగిన అన్యాయంపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారన్నారు. టిడిపి ప్రభుత్వ బలవంతపు భూసేకరణపై రైతులు, భూములపై ఆధారపడ్డ వారిలో తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయిన నిర్వాసితులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని తెలిపారు. కార్మికుల్లో, మద్యం సమస్యపై మహిళల్లో, ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తమవుతోందన్నారు. సమస్యల్లో ఉన్న ప్రజల్లో ఆత్మవిశ్వాసం నింపి ప్రత్యామ్నాయం చూపించి పోరాటాల్లోకి కదిలించాలని దిశా నిర్దేశం చేశారు. ప్రజల్లో మమేకమై పని చేయాలన్నారు. పార్టీని బలోపేతం చేయాలని, అన్ని మండలాలకూ విస్తరించాలని కోరారు.

పోరాటాలు ఉత్సాహపర్చాయి

ఏపీలో నిర్వహించిన ఉద్యమాలు ఉత్సాహపర్చాయని, కొత్త తరగతులు, వర్గాలకు స్ఫూర్తినిస్తున్నాయని మధు వివరించారు. పార్టీపై ఈ కాలంలో అమలవుతున్న ప్రభుత్వ నిర్బంధకాండ గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. అరెస్టులు, లాఠీఛార్జీలు, తప్పుడు కేసులు, హౌస్ అరెస్టులు ఇత్యాది అన్ని అణచివేతలను సర్కారు అనుసరించిం దని చెప్పారు. తుందుర్రు మెగా ఆక్వాఫుడ్స్, గరగపర్రులో దళితుల సామాజిక వెలి, దివీస్, వంశధార, పోలవరం నిర్వాసితుల సమస్యలపై వీరోచిత పోరాటాలు సాగాయన్నారు. పశ్చిమగోదా వరి జిల్లా ఏజెన్సీలో పోలవరం పేరుతో గిరిజనుల సాగులో ఉన్న భూములను ఆక్రమించుకునే ప్రయత్నాలను పార్టీ తిప్పికొట్టిందని తెలిపారు. ఇలపర్రు ఆక్వా చెరువుల అక్రమ ఆక్రమణ సమస్యలపైనా, కాలుష్యంపైనా, దేవరాపల్లి, పెనుగొలను నకిలీ విత్తనాలు, గండికోట నిర్వాసితులు, భోగాపురం, బందరు పోర్టు, శకునాల, ఎస్‌పి కుంట, చిలకలూరిపేట ఉద్యమం, చిత్తూరుజిల్లా మహాభారతం, విశాఖలో బాక్సైట్ మైనింగ్ తదితర ఎన్నో సమస్యలపై సిపిఎం పోరాటాలు నిర్వహించిందని మధు వివరించారు.

పోరాటాలు కొనసాగిస్తాం

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి-పర్స సత్యనారాయణ నగర్ (భీమవరం)



కార్మిక వ్యతిరేక ప్రభుత్వానికి నిరసనగా పోరాటాలు కొనసాగిస్తామని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ పేర్కొన్నారు. సిపిఎం 25వ రాష్ట్ర మహాసభలో భాగంగా శనివారం సాయంత్రం భీమవరంలో శనివారం సాయంత్రం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు రాష్ట్రాన్ని బిజెపి దగ్గర తాకట్టు పెట్టారని, వారి ప్రయోజనాలు, కమిషన్ల కోసం ఆ పరిస్థితి వస్తుందని తాము గతంలోనే చెప్పామని అన్నారు. కనీస వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు పోరాడుతుంటే, ప్రభుత్వం కార్మిక వ్యతిరేక దోరణితో వ్యవహరిస్తోందన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు రెగ్యులర్ చేస్తామని చెప్పి ఇంత వరకూ చేయలేదన్నారు. పశ్చిమ గోదావరి కలెక్టర్, కార్మిక శాఖ మంత్రులకు ఏ మాత్రం మానవత్వం, స్పృహ ఉన్నా కార్మిక వ్యతిరేక చర్యలను సరిదిద్దుకోవాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు ఆందోళన చేస్తే పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ సిడిపిఒను పిలిపించి ఉద్యోగాల నుంచి తొలగిస్తూ నోటీసులు ఇచ్చారని, సమ్మె చేస్తే ఉద్యోగాల నుంచి తొలగించడం బ్రిటిష్ పద్ధతని అన్నారు. ఇచ్చిన నోటీసులను ఉపసంహరించుకోవాలని, లేకపోతే రాష్ట్రంలోని అంగన్‌వాడీలందరూ రోడ్డుమీదకు వచ్చి ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. చంద్రబాబు మెడలు వంచి జీతాలను పెంచుకున్నామని, ఇప్పుడు కూడా అన్ని వర్గాలను ఐక్యం చేసి ఉద్యమం చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గిరిజనోద్యమాన్ని కొనసాగిస్తాం


రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మిడియం బాబురావు



గిరిజనుల నుంచి ప్రభుత్వం భూమి లాక్కుంటోందని, దానిపై గిరిజనోద్యమం కొనసాగిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మిడియం బాబురావు అన్నారు. భూ బ్యాంక్ పేరుతో భూమిని ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా సేకరిస్తోందని తెలిపారు. ఓ పక్క బడి పిలుస్తోందని కార్యక్రమాలు చేపట్టే ప్రభుత్వం 64 గిరిజన సంక్షేమ ప్రభుత్వాలను మూసేసిందని, ఒక్క రోజులో 24 మంది చనిపోయిన ప్రాంతంలో అప్పట్లో హడావిడి చేసిన చంద్రబాబు ఇప్పటికీ ఆ ప్రాంతంలో నీళ్లు, రోడ్లు ఇవ్వలేకపోయారని అన్నారు. గిరిజన ఉద్యమాలకు సిపిఎం సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు.

కోడిపందాలు, మద్యానికి ప్రభుత్వమే ఊతం : రమాదేవి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి-పర్స సత్యనారాయణనగర్ (భీమవరం)



అచ్ఛేదిన్ తెస్తామని కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు ఎన్నికల ముందు ఊదరగొట్టారని, అధికారంలోకి వచ్చాక ఎవరికి మంచిరోజులు వచ్చాయో తెలుస్తూనే ఉందని ఆక్స్‌ఫామ్ నివేదిక చూస్తే అర్థం అవుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి విమర్శించారు. కోడి పందాలు, మద్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే దగ్గరుండి ప్రోత్సహిస్తోందని, ఆమె విమర్శించారు. 15 వేలమంది ఉంటే బార్, పదివేల మంది ఉంటే రెస్టారెంట్ అని దుకాణాలమీద దుకాణాలు తెరుస్తూ రాష్ట్రాన్ని మద్యం మత్తులో ముంచేస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. బెల్టు షాపులను నివారిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం మూడేళ్లలో మరిన్ని షాపులను తెరిచిందని మహిళలు ఎక్కడికక్కడ ఆందోళనలకు దిగడంతో వెనక్కి తగ్గిందని ఆమె తెలిపారు. ప్రభుత్వాల వైఖరి ఇలాగే ఉంటే ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. మహిళల పోరాటాలకు ఎర్రజెండా అండగా ఉంటుందని ఆమె తెలిపారు.


ఏడు పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఏచూరి, శ్రీనివాసరావు, వీరభద్రం, పుణ్యవతి, ఎంవిఎస్ శర్మ

ప్రజాశక్తి - భీమవరం

సిపిఎం రాష్ట్ర 25వ మహాసభల సందర్భంగా ప్రజాశక్తి బుక్‌హౌస్ ముద్రించిన ఆరు పుస్తకాలను, సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా(డెల్టా) కమిటీ ప్రచురించిన సిపిఎం సీనియర్ నాయకులు రుద్రరాజు సత్యనారాయణ రాజు (ఆర్ఎస్) తన జీవితానుభవాలతో రూపొందించిన 'నా జీవనపథం' పుస్తకాన్ని మహాసభల తొలిరోజు మహాసభ వేదికపై ఆవిష్కరించారు. నాజీవన పథం పుస్తకాన్ని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ఆవిష్కరించారు. ఆర్ఎస్ కమ్యూనిస్టు పార్టీతో తన అనుబంధం, ఉద్యమంలో ముఖ్య ఘట్టాలను ఆర్ఎస్ ఈ పుస్తకంలో వివరించారు. అనంతరం ఎర్రశాలువా, పూలగుచ్చాలతో నాయకులు ఆర్ఎస్‌ని అభినందించారు. నవప్రాయం నుంచి ఆయన కమ్యూనిస్టు ఉద్యమంలో ఉన్నారని, 90 ఏళ్ల వయసులోనూ ప్రజా ఉద్యమాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని సిపిఎం కార్యదర్శి సభ్యులు ఎంఎ గఫూర్ పేర్కొన్నారు. సాయంత్రం 'రెడ్ అక్టోబర్' పుస్తకాన్ని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, 'విముక్తికి బాటలు వేసిన విప్లవం' అనే పుస్తకాన్ని సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి ఆవిష్కరించగా, ఒక ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ పశ్చాత్తాపంగా రాసిన 'రాకాసి కోరలు' సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, 'నేనొక అంతర్జాల పోకిరి' అనే పుస్తకాన్ని సిపిఎం కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు ఆవిష్కరించారు. 'మార్చి 8 మహిళా దినోత్సవం' పుస్తకాన్ని సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు హేమలత, 'సింధూరం' పుస్తకాన్ని ప్రజాశక్తి చీఫ్ జనరల్ మేనేజర్ ఎంవిఎస్.శర్మ ఆవిష్కరించారు. పైపుస్తకాల గురించి ప్రజాశక్తి బుక్‌హౌస్ ఎడిటర్ ఆర్.ఉషారాణి వివరించారు. ఈ కార్యక్రమంలో బుక్‌హౌస్ జనరల్ మేనేజర్ కె.లక్ష్మయ్య, బుక్‌హౌస్ అసిస్టెంట్ ఎడిటర్ వరప్రసాద్ పాల్గొన్నారు.



భీమవరం ఫెస్ట్‌లో ప్రదర్శించిన వీర తెలంగాణ విప్లవ పోరాట కళారూపకం



ఫెస్ట్ వేదికపై ప్రసంగిస్తున్న ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి, పక్కన సినీ నటుడు మాదాల రవి, [illegible] సీతారాం తదితరులు

సైన్యంలో మహిళల నియామకంలో వివక్షత లేదు : కేంద్రం

న్యూఢిల్లీ : సైన్యానికి చెందిన ఇంజనీరింగ్, ఎడ్యుకేషన్ విభాగాల్లో మహిళల రిక్రూట్‌మెంట్ కు సంబంధించి వివక్ష చూపుతున్నారని ఆరోపిస్తూ ఢిల్లీ హై కోర్టులో దాఖలైన రెండు పిటిషన్లను కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించింది. సైన్యంలో మహిళలను నియమించే విషయంలో వివక్షత చూపుతున్నారన్న ఆరోపణలు నిరాధారమని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి గీతా మిట్టల్ నేతృత్వంలోని ధర్మాసనానికి సైనికదళాల తరుపు న్యాయవాది తెలియజేశారు. ఈ పిటిషన్లను డిస్మిస్ చేయాలని కోరారు. సైన్యంలో మహిళాధికా రులను నియమించుకునేందుకు 1992లో మహిళా స్పెషల్ ఎంట్రీ స్కీమ్ (ఆఫీసర్స్)ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది.



ఎన్నికల సభ

కర్నాటకలో రానున్న శాసనసభ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ శనివారం హోస్పేట్‌లో నిర్వహించిన ప్రచార సభకు రాహుల్ గాంధీ రాక కోసం ఎదురు చూస్తున్న ఆ పార్టీ కార్యకర్తలు

గతాన్ని తవ్వుకుంటూ కూర్చోవద్దు

ప్రధాని మోడీకి రాహుల్ సూచన

హోస్పేట్ : కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను విమర్శిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తీవ్రంగా ధ్వజమెత్తారు. అద్దంలో నుండి వెనక్కు చూస్తూ వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయని మోడీని ఉద్దేశించి రాహుల్ వ్యాఖ్యానించారు. వెనుకకు చూస్తూ వుంటే ఈ దేశాన్ని పాలించలేమని అన్నారు. కర్నాటక అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా హోస్పేట్‌లో జరిగిన ర్యాలీలో రాహుల్ ప్రసంగించారు. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న వ్యవసాయ సంక్షోభం, నిరుద్యోగం, గిరిజనులు, దళితులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ప్రధాని మాట్లాడకుండా గత ప్రభుత్వాల విధానాల పైనే మాట్లాడుతున్నారని రాహుల్ విమర్శించారు. కేవలం గతం గురించి మాట్లాడడానికే ఈ దేశ ప్రజలు మిమ్మల్ని ప్రధానిని చేయలేదని అన్నారు. ఈ దేశానికి మీరు చేయతలపెట్టిన భవిష్యత్ ప్రణాళికలేంటో ప్రజలు తెలుసుకోవాలనుకుంటున్నారని రాహుల్ పేర్కొన్నారు. కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నుండి పాలించడం ఎలాగో తెలుసుకోవాలని ప్రధానికి రాహుల్ సూచించారు. రాష్ట్రాన్ని పాలించే అవకాశం ప్రజలు తమకు మరోసారి ఇస్తే గత ఐదేళ్ళలో చేసిన పనులకు రెట్టింపు చేస్తామని రాహుల్ హామీ ఇచ్చారు.

పశ్చిమ దేశాల విమానాలకు అనుమతివ్వండి

భారత్‌ను కోరిన నేపాల్

సింగపూర్ : పశ్చిమ దేశాల నుండి వచ్చే విమానాలను తమ భూభాగం మీదుగా ప్రయాణించేందుకు భారత్ అనుమతిస్తుందనే తాము ఆశిస్తున్నామని నేపాల్ పౌర విమాన యాన సంస్థ డైరెక్టర్‌జనరల్ సంజీవ్ గౌతమ్ తెలిపారు. నేపాల్‌లో ఇప్పటికే రెండు విమానాశ్రయాలు నిర్మాణంలో ఉన్నాయి. మరొక దానిని నిర్మించే యోచనలో నేపాల్ ఉంది. ప్రస్తుతం భారత్ నుండి నేపాల్ వెళ్ళే విమానాలు బీహార్‌లోని పాట్నా మీదుగా నడుస్తున్నాయని ఆయన చెప్పారు. తూర్పు, పశ్చిమాల నుంచి భారత్ విదేశీ విమానాలను అనుమతిస్తోంది. తాము భారత అధికారులతో చర్చించి ఈ ఏడాది అనుమతి పొందగలమని సంజీవ్ గౌతమ్ తెలిపారు. ఇక్కడ జరుగుతున్న సింగపూర్ ఎయిర్ షో వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. భారత్ అనుమతి వల్ల పశ్చిమ దేశాల నుంచి నేపాల్ వెళ్ళే విమానాలకు ప్రయాణించే సమయం తగ్గుతుందని పేర్కొన్నారు. 2025 నాటికి 50 లక్షల మంది పర్యాటకులకు ఆతిధ్యమిచ్చేందుకు నేపాల్ సిద్ధమవుతోందని ఆయన చెప్పారు. ప్రస్తుతం సగటున ఏడాదికి లక్ష మందికి ఆతిధ్యమిస్తోందని తెలిపారు. నేపాల్ విమానాశ్రయం ఇప్పటికే రద్దీగా ఉంటుందని ఆయన చెప్పారు. దాదాపు 80 మిలియన్ డాలర్లతో నిర్మిస్తున్న గౌతమ బుద్ధ విమానాశ్రయం ఈ సంవత్సరాంతానికి పూర్తవుతుందని ఆయన తెలిపారు.

న్యాయమూర్తికి న్యాయం చేయడానికి 19 ఏళ్ళు!

చండీగఢ్ : ఏళ్లూ పూళ్లూ గడుస్తున్నా కోర్టుల్లో కేసులు తేలకపోవడం మనం చూస్తూ వుంటాం. అయితే సాక్షాత్తూ ఒక న్యాయమూర్తికే ఇటువంటి పరిస్థితి ఎదురైన ఘటన సంచలనం సృష్టించింది. తమ కోర్టులోనే గతంలో న్యాయమూర్తిగా వ్యవహరించిన జడ్జికి న్యాయం అందించేందుకు పంజాబ్, హర్యానా హై కోర్టుకు ఏకంగా రెండు దశాబ్దాలు పట్టింది. జస్టిస్ ఎఎల్ బహ్రికి ఇంటి అద్దె అలవెన్సులను ఇచ్చేందుకు పంజాబ్ ప్రభుత్వం నిరాకరించింది. రాష్ట్ర వినియోగదారులు వివాద పరిష్కార కమిషన్ అధ్యక్షుడిగా బహ్రిని నియమించిన తరువాత ఆయనకు ముందు పనిచేసిన వారితో సమానంగా ఇంటి అద్దెను ఇచ్చేందుకు ప్రభుత్వం నిరాకరించింది. దీనిపై ఆయన పిటిషన్ దాఖలు చేశారు. దాదాపు 19 సంవత్సరాల తరువాత దీనికి సంబంధించిన సమాచారాన్ని హై కోర్టు ధర్మాసనం తోసిపుచ్చింది. మాజీ న్యాయమూర్తి పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుచితంగా ప్రవర్తించిందని పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగికి, హై కోర్టు సిట్టింగ్ లేదా మాజీ న్యాయమూర్తికి మధ్య ఉన్న తేడాను అర్థం చేసుకోవడం లేదని న్యాయమూర్తులు ఎబి చౌదరి,అనిల్ క్షేత్రపాల్ కూడా ప్రభుత్వాధికారులను తప్పు పట్టారు.

విధులకు డుమ్మా కొడుతున్న ఉద్యోగులు ఇంటికే..!

చర్యలకు సిద్ధమవుతున్న రైల్వేలు

న్యూఢిల్లీ: ఎటువంటి ముందస్తు అనుమతులూ లేకుండా అనధికారికంగా విధులకు గైర్హాజరవుతున్న దాదాపు 13 వేల మంది ఉద్యోగులపై వేటు వేసేందుకు రైల్వేలు సిద్ధమవుతున్నాయి. సంస్థాపరంగా పనితీరును మెరుగు పర్చటంతోపాటు నిజాయితీ పరులైన ఉద్యోగుల నైతికతను ప్రోత్సహించేందుకు రైల్వేలు ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టాయని ఆ శాఖ ప్రతినిధి ఒకరు మీడియాకు చెప్పారు.విధులకు డుమ్మా కొడుతున్న ఉద్యోగులపై క్రమశిక్షణా చర్యలు ఇందులో భాగమేనని ఆయన వివరించారు.దీనితో పాటు రైల్వేలలో భద్రతా ప్రమాణాలను మెరుగుపర్చే లక్ష్యంతో నిఘా సిబ్బందికి చెందిన సమాచారంతో ఒక ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభించేందుకు రైల్వేలు సిద్ధమవుతున్నాయన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల డేటాబేస్‌ను ఏర్పాటు చేసి వారికి సంఘటిత రంగంలోని రైల్వే ఉద్యోగులతో సమానమైన ప్రయోజనాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీర్ఘకాలంగా అనధికారిక సెలవులో విధులకు గైర్హాజరవుతున్న దాదాపు 13 వేల మంది ఉద్యోగులను గుర్తించామని, వారిని ఉద్యోగాల నుండి తొలగించేందుకు చర్యలు ప్రారంభించామని ఆయన వివరించారు. విధులకు గైర్హాజరవుతున్న ఉద్యోగులను వెంటనే తొలగించాలని అన్ని విభాగాల అధికారులు, పర్యవేక్షకులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన చెప్పారు.

ఢిల్లీలో 'క్లీన్ ఎయిర్' ప్రచారం ప్రారంభం

న్యూఢిల్లీ : ఢిల్లీ ప్రభుత్వం, కేంద్ర పర్యావరణ, అడవుల మంత్రిత్వ శాఖ కలిసి క్లీన్ ఎయిర్ ప్రచారాన్ని శనివారం ప్రారంభించాయి. ఈ ప్రచారం ఫిబ్రవరి 23వరకు సుమారు రెండు వారాల పాటు కొనసాగుతుంది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి హర్షవర్ధన్ మాట్లాడుతూ కాలుష్య నివారణకు కేంద్రం కట్టుబడి ఉందని, కాలుష్యానికి సంబంధించిన 'రౌండ్ ద ఇయర్ స్టడీ' అధ్యయనంపై ఆవశ్యకతను ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వెల్లడించారని తెలిపారు. కాలుష్యాన్ని ఎదుర్కోవడానికి సైన్స్ అండ్ టెక్నాలజీని వినియోగించాలని తెలిపారు.

బిజెపికి ప్రతిష్టాత్మకంగా మారిన

యుపి ఉప ఎన్నికలు



న్యూఢిల్లీ: ఇటీవల రాజస్థాన్‌లోని రెండు లోక్‌సభ స్థానాలతోపాటు ఒక అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని చవి చూసిన బిజెపికి ఇప్పుడు యుపిలోని గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్ లోక్‌సభ స్థానాలకు వచ్చే నెలలో జరుగనున్న ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. అన్ని వర్గాలలోనూ పరపతిని కోల్పోతున్న కమలదళానికి పరువు నిలుపుకునేందుకు ఈ ఉప ఎన్నికల గెలుపు తప్పనిసరిగా మారింది. యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఆయన డిప్యూటీ కేశవ్‌ప్రసాద్ మౌర్య వంటి ప్రముఖులు ఖాళీ చేసిన ఈ స్థానాలను తప్పనిసరిగా తాము గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ రెండు పార్లమెంట్ స్థానాలతో పాటు బీహార్‌లోని అరా రియా పార్లమెంటరీ స్థానం, బబువా, జెహానాబాద్ అసెంబ్లీ స్థానాలకు మార్చి 11న ఉప ఎన్నికలు జరుగనున్నాయి. గోరఖ్‌పూర్ నుండి బిజెపి తరపున వరుసగా ఐదుసార్లు లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించిన ఆదిత్యనాథ్ గత మార్చిలో యుపి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. కాగా 2014 నాటి మోడీ వేవ్‌లో తొలిసారిగా లోక్‌సభకు ఎన్నికైన కె పి మౌర్య ఖాళీ చేసిన ఫూల్‌పూర్ స్థానం మాజీ ప్రధాని జవహర్లాల్ నెహ్రూ సొంత నియోజకవర్గం కావటం విశేషం. బిజెపి గెలిచే వరకూ ఈ స్థానంలో మాయావతి నేతృత్వంలోని బిఎస్పీ హవా కొనసాగిన విషయం తెలిసిందే. ఆదిత్యనాథ్, మౌర్య గత సెప్టెంబర్ వరకూ లోక్‌సభ సభ్యులుగా కొనసాగారు. కాగా రాష్ట్ర బాధ్యతలుచేపట్టిన ఆర్నెల్లలోగా శాసనసభ్యులుగా ఎన్నిక కావాలన్న రాజ్యాంగ నిబంధనల మేరకు వీరు విధానపరిషత్‌కు ఏకగ్రీవంగా ఎన్నిక కావటంతో ఈ పార్లమెంట్ స్థానాలు ఖాళీ అయ్యాయి. మొత్తం 536 మంది సభ్యులున్న లోక్‌సభలో ప్రస్తుతం బిజెపికి 274 మంది సభ్యులున్నారు. 2014లో ఈ పార్టీ నుండి 282 మంది ఎన్నికైనప్పటికీ వివిధ కారణాలతో బలం 274కు పడిపోయింది. మిత్రపక్షాలతో కలిపి బిజెపికి సభలో భారీ మెజార్టీ ఉంది. ఇప్పుడు సభలో ఏడు స్థానాలు ఖాళీగా వున్నాయి. ఈ నెలారంభంలో రాజస్థాన్‌లోని అజ్మీర్, అల్వార్ లోక్‌సభ స్థానాలకు, మరో అసెంబ్లీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో అధికార పార్టీ ఓటమి పాలయిన విషయం తెలిసిందే. 2014లో రాజస్థాన్‌లోని అన్ని పార్లమెంట్ స్థానాలనూ క్లీన్ స్వీప్ చేసిన కమలదళానికి ఎదురైన తొలి పరాజయం ఇది. ఈ విజయాలతో రాజస్థాన్ అసెంబ్లీలో కాంగ్రెస్ బలం 48కి పెరిగింది. యుపిలో సైతం 80 స్థానాలల్లో 71 స్థానాలను తన ఖాతాలో జమ చేసుకుంది బిజెపి. గత ఏడాది పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ చేతిలో బిజెపి ఓడిపోయిన విషయం తెలిసిందే.

మంచి డాక్టర్ మాట వినని రోగి ఈ ప్రభుత్వం

జైట్లీ వ్యాఖ్యలపై చిదంబరం స్పందన

కోచి : ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు 'కొత్త ప్రభుత్వం ఏర్పడడమే" పరిష్కారమని కాంగ్రెస్ నేత, మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం వ్యాఖ్యానించారు. గత పదేళ్ళ యుపిఎ పాలనలో 'భయంకరమైన డాక్టర్' చేతుల్లో దేశ ఆర్థిక వ్యవస్థ వుందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ రాజ్యసభలో వ్యాఖ్యానించిన నేపథ్యంలో చిదంబరం స్పందిస్తూ, 'బిజెపి ప్రభుత్వం భయంకరమైన రోగి, మంచి డాక్టర్ చెప్పేది వినడానికి సుముఖంగా లేదు." అని పేర్కొన్నారు. ఆరోగ్య, విద్య, వ్యవసాయ, ఉపాధి రంగాలేవీ బిజెపి పాలనలో అభివృద్ధి సాధించలేదని విమర్శించారు. దేశం ఎదుర్కొనే ప్రధాన సమస్యలన్నీ అపరిష్కృతంగానే వున్నాయన్నారు. కేవలం ఆర్భాటంగా ప్రకటనలు, పథకాలే ఈ బడ్జెట్‌లో వున్నాయన్నారు. పెట్రోల్, డీజిల్‌లపై ఎక్సైజ్ సుంకాన్ని నిరంతరంగా పెంచడం ద్వారా ప్రజల రక్తాన్ని ప్రభుత్వం పీల్చేస్తోందని విమర్శించారు. కేంద్ర బడ్జెట్ ప్రకటించిన నేపథ్యంలో రాజీవ్ గాంధీ అభివృద్ధి అధ్యయనాల సంస్థ 'భారత ఆర్థిక వ్యవస్థ స్థితిగతులు"పై నిర్వహించిన సెమినార్‌లో చిదంబరం ప్రసంగించారు.

లోయా కేసులో స్వతంత్ర దర్యాప్తును వ్యతిరేకించిన మహారాష్ట్ర

న్యూఢిల్లీ : సిబిఐ ప్రత్యేక న్యాయమూర్తి బిహెచ్ లోయా మృతిపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ సుప్రీం కోర్టులో దాఖలైన వ్యాజ్యాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించింది. ఈ వ్యాజ్యాన్ని 'ప్రేరేపించబడిందని, ', 'ఎల్లో జర్నలిజమని' ఆరోపించింది. సోహ్రాబుద్దిన్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసును విచారిస్తున్న లోయా తన సహద్యోగి కుమార్తె పెళ్ళికి నాగపూర్ వెళ్లిన సమయంలో అక్కడ గుండెపోటుతో మరణించారు. నలుగురు న్యాయాధికారులు వాంగ్మూలాలు నమోదు చేసిన తర్వాత ఈ కేసు విచారణ ముగించాల్సి ఉందని, ఈ న్యాయమూర్తులను నమ్మాలని లేకుంటే ఈ కేసులో వారు అబద్ధాలు చెబుతున్నారని భావించినట్లవుతుందని మహారాష్ట్ర ప్రభుత్వం తరుపున హాజరైన సీనియర్ అడ్వకేట్ ముకుల్ రోహత్గి .. ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాతో కూడిన ధర్మాసనానికి తెలిపారు.

ఒడిషాలో బిజెపి కార్యకర్తల విధ్వంసం

- సిఎం ప్రైవేటు కార్యదర్శి పాండియన్ నివాసంపై దాడి
- ద్విచక్ర వాహనాలు ధ్వంసం
- నలుగురు అరెస్టు

భువనేశ్వర్ : ఒడిషా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రైవేటు కార్యదర్శి, ఐఎఎస్ అధికారి వి.కార్తికేయన్ పాండియన్ అధికారిక నివాసాన్ని బిజెపి కార్యకర్తలు శనివారం ధ్వంసం చేశారు. ఈ సంఘటనకు సంబంధించి నలుగురిని పోలీసులు అరెస్టు చేసినప్పటికీ, తమ కార్యకర్తల విధ్వంసాన్ని రాష్ట్ర బిజెపి సమర్ధించింది. ఒక రాజకీయ పార్టీకి చెందిన కార్యకర్తలు, ఒక ప్రభుత్వాధికారి నివాసంపై దాడి చేయడం ఇదే తొలిసారి. దీంతో ముఖ్యమంత్రితో సన్నిహితంగా ఉండి పనిచేసే వారిపై దాడి చేయాలన్న బిజెపి వ్యూహం వెల్లడైంది. భారతీయ జనతా యువ మోర్చా (బిజెవైఎం)కు చెందిన దాదాపు 30 మంది కార్యకర్తలు పార్టీ జెండాలను పట్టుకుని పాండియన్ అధికారిక నివాసానికి చేరుకున్నారు. అక్కడ ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాలక పక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నా రని ఆరోపిస్తూ, బిజెపి కార్యకర్తలు సెక్యూర్టీ గార్డులపై దాడి చేసి పాండియన్ అదికార నివాసంలోకి దూసుకెళ్ళారు. అక్కడున్న పూల కుండీలను, పలు ద్విచక్ర వాహనాలనుధ్వంసం చేశారు.

బిజెపి కార్యకర్తలను అడ్డుకునేందుకు సెక్యూర్టీ గార్డులు ప్రయత్నించినప్పటికీ సాధ్యం కాలేదు. బిజెపి కార్యకర్తలు తనపై చెయ్యి చేసుకున్నారని, పాండియన్ నివాస ఆవరణలో ఉన్న పూల కుండీలను ధ్వంసం చేశారని ఒక సెక్యూర్టీ గార్డు మీడియాకు తెలిపాడు. ఈ సంఘటన జరిగే సమయంలో పాండియన్ అక్కడ లేరు. ఆయన భార్య, ఇద్దరు పిల్లలు ఇంటిలో ఉన్నారు. సంఘ టనపై సమాచారమందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ సంఘ టనకు సంబంధించి నలుగురిని అరెస్టు చేశామని, దీనిపై మరింత దర్యాప్తు కొనసాగుతున్నదని ఎసిపి మానస్ గార్నయక్ తెలిపారు. ఈ సంఘటన పోలీసుల నిఘా వైఫల్యాన్ని వెల్లడిస్తోంది. బిజెపి కార్యకర్తల ఆందోళనకు సంబంధించిన చిన్న క్లూ కూడా పోలీసుల వద్ద లేకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. కొంతమంది బిజెవైఎం కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారని, దీనితో ప్రమేయమున్న మరికొందరిని అరెస్టు చేసే ప్రయత్నం జరుగుతున్నదని భువనేశ్వర్-కటక్ పోలీసు కమిషనర్ తెలిపారు.

ఇక్కడుండాలా? వెనక్కి వెళ్లాలా?

డోలాయమానంలో అమెరికాలో భారతీయుల భవిష్యత్

వాషింగ్టన్ : ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న మరింత కఠినతరమైన ఇమ్మిగ్రేషన్, వీసా విధానాలతో 15లక్షల మందికి పైగా ఇండియన్ అమెరికన్ల భవితవ్యం డోలాయమానంలో పడింది. వీరందరూ గ్రీన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నవారే. తమ అమెరికా కలని సాకారం చేసుకోవడానికి అనుమతినిచ్చే న్యాయపరమైన సంస్కరణల కోసం ఇప్పుడు వీరందరూ పోరాటానికి సన్నద్ధమవుతున్నారు. జనవరి చివరి వారంలో రిపబ్లికన్ సెనెటర్లు ఇరువురు ప్రతిపాదించిన ఇమ్మిగ్రేషన్ ఇన్నొవేషన్ చట్టాన్ని ఆమోదించేలా చర్యలు తీసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. స్కిల్డ్ ఇమ్మిగ్రెంట్స్ ఇన్ అమెరికా (ఎస్ఐఐఎ) బ్యానర్ కింద ఈ వారంలో వీరు ఇక్కడ సమావేశమయ్యారు. ఇక్కడ వుండాలా? స్వదేశానికి వెళ్లాలా? అంటూ అస్తిత్వానికి సంబంధించిన ప్రశ్న తమకు ఎదురవుతోందంటూ సిలికాన్ వ్యాలీకి చెందిన అమెరికన్ టెక్నాలజీ నిపుణుడు బి.ఎస్.రిషి వ్యాఖ్యానించారు. 'ఫర్ హియర్ ఆర్ టు గో" పేరుతో ఆయన ఒక చిత్రానికి రచనతోపాటు నిర్మాణాన్ని చేపట్టారు. అది గతేడాది విడుదలైంది. అమెరికాలో నివసిస్తున్న వారు ఎదుర్కొంటున్న హెచ్-1బి వీసాలపై డైలమానే ఆయన ఆ చిత్రంలో చూపించారు. అమెరికాలో ఎంఎస్ చేసిన తర్వాత 2007లో తనకు హెచ్-1బి వీసా వచ్చిందని, ఇప్పుడు గ్రీన్ కార్డు క్యూలో వున్నానని ఆయన చెప్పుకున్నారు. రెండు దశాబ్దాల క్రితం వరకు ఇక్కడ వుండాలా లేదా భారత్ వెళ్ళాలా అనేది ఎవరికి వారే నిర్ణయించుకునేవారు. కానీ ఇప్పుడు అది ప్రభుత్వం చేతుల్లోకి వెళ్లింది. చిన్న పిల్లలుగా వున్నపుడే తల్లిదండ్రులతో కలిసి అమెరికాలో అడుగుపెట్టిన వారు - డ్రీమర్లు (స్వాప్నికులు) పై తీవ్రంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో నైపుణ్యం గల ఇండియన్ అమెరికన్స్ తమ వాణి వినిపించేందుకు ప్రయత్నిస్తున్నారు. గత 11ఏళ్ళలో 34లక్షల మంది హెచ్-1బి వీసాల కోసం దరఖాస్తు చేసుకోగా వారిలో 21 లక్షలమంది భారతీయులేనని అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యుఎస్ఐసిఎస్) డేటా తెలియచేసింది. ప్రతి ఏటా పది లక్షలకు పైగా గ్రీన్ కార్డులను అమెరికా ప్రభుత్వం జారీ చేస్తుంది. అందులో దాదాపు లక్షా 40వేల కార్డులు కేవలం ఉపాధి ఆధారిత కేటగిరీకి చెందినవి. ఆ కేటగిరీలో ఎక్కువమంది భారతీయులు వున్నారు.

కానీ ప్రస్తుతమున్న వ్యవస్థ ప్రకారం, వీరిలో కేవలం ఏ దేశానికి చెందినవారైనా 9800మంది మాత్రమే ఇమ్మిగ్రెంట్లుగా వెళ్ళే పరిస్థితి వుంటుంది. కానీ ప్రతి ఏటా కొత్తగా 50వేల మంది భారతీయులు గ్రీన్ కార్డు క్యూలో చేరుతున్నారు. 2వేల సంవత్సరం చివరిలో పెద్ద సంఖ్యలో భారతీయులు అమెరికా చేరుకున్నారు. ఇప్పుడు వారి పిల్లలు హైస్కూల్లో వున్నారు. వారందరి భవిష్యత్ కూడా అనిశ్చితిలో పడింది. 2005 నుండి నెమ్మదిగా గ్రీన్‌కార్డు మార్గం మూసుకుపోవడం ప్రారంభమైంది. హెచ్-1బి కార్యక్రమానికి వ్యతిరేకంగా తీసుకుంటున్న కొన్ని చట్టపరమైన చర్యలను అమెరికన్ కంపెనీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. అయితే రాజకీయ వాస్తవికతలను వారు కూడా గుర్తిస్తున్నారు.

రవి శంకర్‌తో మౌలానా భేటీపై దర్యాప్తు

హైదరాబాద్ : ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్‌తో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఎఐఎంపిఎల్‌బి) సభ్యుడు మౌలానా సల్మాన్ నద్వి సమావేశం కావడంపై ఎఐఎంపిఎల్‌బి కమిటి దర్యాప్తు ప్రారంభించింది. అయోధ్య వివాదానికి కోర్టు వెలుపల పరిష్కారం కనుగొనే విషయమై వీరు చర్చించినట్లు వార్తలు వెలువడ్డాయి. వారి భేటీపై దర్యాప్తు ప్రారంభించామని తన పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఎఐఎంపిఎల్‌బి సభ్యుడొకరు తెలిపారు. బోర్డు సభ్యులకు, మౌలానా నద్వికి మధ్య శుక్రవారం రాత్రి వాగ్వాదం జరిగిన తరువాత దర్యాప్తు జరపాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆయన చెప్పారు.

ప్రత్యేకం

నిందితులకు స్వేచ్ఛ.. అధికారులకు శిక్ష...

మోడీ హయాంలో సిబిఐ తీరిది

న్యూఢిల్లీ : 2014లో నరేంద్రమోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన తరువాత కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) తీరు తెన్నులు పూర్తిగా మారిపోయాయన్న వాదన వినిపిస్తోంది. మోడీ ప్రభుత్వ హయాంలో నిందితులు స్వేచ్ఛగా తిరుగుతుండగా, కేసులు దర్యాప్తు చేస్తున్న అధికారులు విచారణలు, శిక్షలు ఎదుర్కొంటున్నారన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇందుకు ఉదాహరణగా గుజరాత్‌కు చెందిన సోహ్రాబుద్దీన్ షేక్, కౌసర్‌బీ, తులసీరామ్ ప్రజాపతి కేసులను దర్యాప్తు చేస్తున్న మాజీ అధికారి ఒకరు తన సొంత సంస్థ సిబిఐ నుండి అనేక క్రిమినల్ దర్యాప్తులను ఎదుర్కొంటున్నారు. తన మాజీ అధికారిని నిందితుడిగా నిరూపించేందుకు అవసరమైన సాక్ష్యాలను సృష్టించటంలో సిబిఐ బిజీగా వుందనేందుకు అవసరమైన ఆధారాలు వెలుగు చూడటమే ఇందుకు కారణం. ఈ అధికారి మరెవరో కాదు. నాగాలాండ్ కేడర్‌కు చెందిన 2001 బ్యాచ్ ఐపిఎస్ అధికారి సందీప్ తమ్‌గడ్గే.. ఈయన మహారాష్ట్రలోని నాగపూర్‌కు చెందిన ఎస్సీ వర్గానికి సంబంధించిన వ్యక్తి. ఆయన 2011 నుండి 2015 అక్టోబర్ వరకూ సిబిఐలో డిప్యుటేషన్‌పై పనిచేశారు. తమగడ్డేను అవినీతి కేసులో ఇరికించేందుకు తప్పుడు సాక్ష్యాలివ్వాలంటూ మహారాష్ట్ర పోలీసులు, సిబిఐ తమపై తీవ్రంగా వత్తిడి తెస్తున్నారని ఇద్దరు సాక్షులు నాగపూర్ కోర్టులో వెల్లడించారు. ఈ అధికారి 2011 నుండి 2015 వరకూ సిబిఐలో అనేక బాధ్యతలు నిర్వహించినప్పటికీ ఇందులో అత్యంత ప్రధానమైనది 2011 నవంబర్ నుండి 2014 ఏప్రిల్ మధ్య కాలంలో సిబిఐ స్పెషల్ క్రైమ్ బ్రాంచ్ ఎస్పీగా ముంబయిలో బాధ్యతలు నిర్వహించటం. ఈ కాలంలో ఆయన సోహ్రాబుద్దీన్, అతడి భార్య కౌసర్‌బి ఎన్‌కౌంటర్ కేసుతో పాటు తులసి ప్రజాపతి కేసును కూడా విచారించారు. కౌసర్‌బి హత్యకు ముందు ఆమెపై అత్యాచారం చేశారని, ఆమె మరణించిన తరువాత మృతదేహాన్ని దగ్ధం చేశారనే ఆరోపణలపై సిబిఐ కేసు నమోదైంది. ఈ కేసులతో పాటు ఇషరత్ జహా ఎన్‌కౌంటర్ కేసును కూడా దర్యాప్తు చేసిన ఈ కేసులో అప్పటి ముఖ్యమంత్రి నరేంద్రమోడీ, హోం మంత్రి అమిత్‌షా సన్నిహితులైన గుజరాత్ సీనియర్ పోలీసు అధికారుల ప్రమేయం వుందంటూ ఛార్జిషీట్‌లు దాఖలు చేశారు. కాగా మోడీ ఇప్పుడు దేశ ప్రధానిగా వుండగా, అమిత్‌షా ఆయన తరువాత శక్తివంతమైన స్థానంలో వున్నారు. ఈ కేసుల్లో తమ్మగ్డే అమిత్‌షాను మూడు సార్లు ఇంటరాగేట్ చేశారు. మరోసారి తులసీ ప్రజాపతి హత్య కేసులో ప్రధాన



సందీప్ తమ్‌గడ్డే

సూత్రధారిగా పేర్కొంటూ అమిత్‌షాపై కేసు నమోదుచేశారు. సోహ్రాబుద్దీన్, కౌసర్‌బీ హత్య కేసుల్లో అమిత్‌షా ప్రమేయంపై అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేసినప్పటికీ ఆధారాలు లేవంటూ అమిత్‌షా పేరును తొలగించారు. అమిత్‌షాతో సహా కీలక నిందితులను విచారించటం వారిపై ఛార్జిషీట్‌లు దాఖలుచేయటంతో పాటు కేసు పరిస్థితులపై తమ్మగ్డే సుప్రీంకోర్టుకు పలు నివేదికలను అందచేశారు. ఈ దర్యాప్తులను పర్యవేక్షించిన న్యాయమూర్తులెన్నడూ ఆయన పనితీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేయలేదు. అయితే 2014లో మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టటానికి కొద్ది వారాల ముందు సిబిఐ ఆయన్ను కేసు దర్యాప్తు బాధ్యతల నుండి తప్పించింది. ఆ సమయంలో ప్రస్తుతం అనేక కేసుల్లో విచారణలు ఎదుర్కొంటున్న రంజిత్ సిన్హా సిబిఐ డైరెక్టర్‌గా వ్యవహరించారు. తమ్మగ్డేను ఈ కేసుల నుండి తొలగించిన ఆర్నెల్లకే అమిత్‌షాను నిర్దోషిగా పేర్కొంటూ సిబిఐ ప్రత్యేక న్యాయమూర్తి ఎంబి గోసావి తీర్పు వెలువరించారు. 2015 జులైలో తమ్మగ్డేకు కల్పించిన భద్రతను ఉపసంహరించుకోవటం ఆ తరువాత అక్టోబర్‌లో స్వరాష్ట్రానికి బదిలీ కావటం చకచకా జరిగిపోయాయి. స్వరాష్ట్రానికి వచ్చిన తమ్మగ్డేపై సిబిఐ రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. గుజరాత్ ఎన్‌కౌంటర్ కేసులతో ఈ కేసులకు ఎటువంటి సంబంధమూ లేదు. ఒక కేసు దర్యాప్తులో మాత్రం తమ్మగ్గేను ఇరికించేందుకు సిబిఐ ఉద్దేశపూర్వకంగానే ప్రయత్నిస్తోందన్న విశ్వసనీయ సమాచారం వెలుగు చూసింది. మరో కేసులో సైతం తమ్మగ్డేపై తప్పుడు సాక్ష్యాలతో దర్యాప్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. తాను దర్యాప్తు చేసిన కేసులకు సంబంధించి తమ్మగ్డే తప్పు చేసిన అభియోగాలపై సిబిఐ ఎటువంటి ఆధారాలను సంపాదించలేకపోయినప్పటికీ, గుజరాత్ ఎన్‌కౌంటర్ల కేసులకు సంబంధించి ఈ అధికారిపై తీవ్రమైన చర్యలకు సిబిఐ సిఫార్సు చేసింది. కేసు దర్యాప్తు బాధ్యతల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపిస్తూ కేసు నమోదు చేసింది. ప్రస్తుతం ఈ సిఫార్సు నాగాలాండ్ ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో వుంది. తమ్మగ్డేపై పలు కేసులు బనాయించటంతో పాటు ఈ అధికారికి సంబంధించిన వార్షిక రహస్య నివేదికను తారుమారు చేసి ఆయన్ను అప్రతిష్ట పాలు చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. అనేక కేసుల్లో నిందితులైన వారు స్వేచ్ఛగా తిరుగుతుండగా దర్యాప్తు అధికారులు మాత్రం కేసులను ఎదుర్కొంటున్నారనేందుకు ఈ ఉదంతాలను ఉదాహరణగా చెప్పవచ్చు.

సంక్షిప్తం

బాలికను వేధించినందుకు వ్యక్తికి దేహశుద్ధి

మలప్పురం : కేరళలోని కరీంకల్లతాని గ్రామంలో ఓ బాలికను వేధించినందుకు 22 ఏళ్ల వ్యక్తిని స్థానికులు దేహశుద్ధి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం ఈ ఘటన ఫిబ్రవరి 1న జరిగిందని, దీనిపై శనివారం ఫిర్యాదు అందగా కేసు నమోదు చేశామని తెలిపారు. బాలికను వేధించిన వ్యక్తిపై స్థానికులు దాడి చేయడంతో అతనికి గాయాలయ్యాయని, ఆసుపత్రికి తరలించామని పోలీసులు తెలిపారు. దీనిపై దర్యాప్తు చేపట్టనున్నట్లు తెలిపారు.

బాలిక హత్య కేసులో పోలీస్ అధికారి అరెస్టు

శ్రీనగర్ : గత నెలలో జమ్ము కాశ్మీర్‌లోని కతురా జిల్లాలో ఎనిమిదేళ్ళ బాలిక కిడ్నాప్, హత్య ఘటనలో ప్రమేయం ఉందన్న ఆరోపణపై దీపక్ ఖజురియా అనే ప్రత్యేక పోలీస్ అధికారిని క్రైం బ్రాంచ్ పోలీసులు అరెస్టు చేసినట్లు శనివారం అధికారులు తెలిపారు. జనవరి 17న సమీప అడవి ప్రాంతంలో బాలిక మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఈ ఘటనకు కారణమైన నేరస్తులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. జనవరి 23న ముఖ్యమంత్రి మోహబూబా ముఫ్తీ ఈ ఘటనపై దర్యాప్తు చేయాలని రాష్ట్ర పోలీసులను ఆదేశించారు. మైనర్ బాలికను కిడ్నాప్, హత్యకు కారణమైన పోలీస్ అధికారిని అరెస్టు చేశామని క్రైమ్ బ్రాంచ్ అదనపు డైరెక్టర్ జనరల్ అలోక్ పూరి తెలిపారు. ఈ ఘటనలో పాలుపంచుకొన్నా 15 ఏళ్ళ బాలుడిని కూడా అరెస్టు చేశామని తెలిపారు.

దుస్తుల కర్మాగారంలో అగ్ని ప్రమాదం, ఒకరు మృతి

న్యూఢిల్లీ : న్యూఢిల్లీలో శనివారం ఉదయం జరిగిన భారీ అగ్నిప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందినట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఢిల్లీలోని కరోల్‌బాగ్‌లోని దుస్తుల తయారీ కర్మాగారంలో ఉదయం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయని, ప్రమాదానికి గల కారణాలు తెలియలేదని పేర్కొన్నారు. ఐదు అగ్నిమాపక యంత్రాలతో మంటల్ని అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

మయన్మార్‌లో ప్రమాదకర స్థాయిలో హింస

ఐక్యరాజ్యసమితి: మయన్మార్‌లో రోహింగ్యా ముస్లింలపై కొనసాగుతున్న హింస ప్రమాదకరస్థాయిలో వుందని ఐరాస ఆందోళన వ్యక్తం చేసింది. మయన్మార్‌లో కొనసాగుతున్న హింసాకాండపై ఒక మీడియా సంస్థ దర్యాప్తు చేసిన వార్తా కథనంపై స్పందించిన ప్రపంచ సంస్థ ప్రతినిధి ఫర్హాన్ హక్ శనివారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ రఖినే రాష్ట్రంలో రోహింగ్యా ముస్లింలపై కొనసాగుతున్న హింసాకాండ విషయంలో సమగ్ర దర్యాప్తు జరిపించాల్సిన అవసరం వుందని అన్నారు. మయన్మార్ ప్రభుత్వం అరెస్ట్ చేసిన ఇద్దరు జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ డిమాండ్ చేశారని, వారిని విడుదల చేసే వరకూ తాము మయన్మార్‌పై వత్తిడి కొనసాగిస్తామని ఆయన చెప్పారు.

సందడి

దక్షిణ కొరియాలో జరుగుతున్న వింటర్ ఒలింపిక్స్‌లో అచ్చం ఉ.కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌లా అనిపించే హోవార్డ్ ఎక్స్, ట్రంప్‌లా అనిపించే డెన్నిస్ అలాన్ అనే నాటక రంగ కళాకారులు సందడి చేశారు.



అచ్చం ట్రంప్, కిమ్ లాగే!

ప్యాంగ్‌చాంగ్, దక్షిణ కొరియా : వింటర్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తరకొరియా నేత కిమ్‌జోంగ్ ఉన్‌లు సందడి చేశారు. భద్రతా గార్డులతో సెల్ఫీలు కూడా దిగారు. తమను చూడవచ్చిన ప్రేక్షకులకు చేతులూపుతూ హర్షధ్వానాలు తెలియచేశారు. ఏంటి ప్రత్యర్థులైన వీరిద్దరికీ ఇంత సయోధ్య ఎక్కడ కుదిరింది అనుకుంటున్నారా? నిజం నేతలు కాదండి బాబూ! వారిని పోలిన నాటక రంగ కళాకారులు. కిమ్‌ను పోలిన హోవార్డ్ ఎక్స్, ట్రంప్‌ను పోలిన డెన్నిస్ అలాన్‌లు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రెస్ ఏరియా వద్దకు రావడంతో అక్కడ అంతా కాసేపు ఉద్విగ్న వాతావరణం నెలకొంది. అథ్లెట్లను పలకరించాలనే లక్ష్యంతో మీడియా విభాగంలోకి వెళ్ళేందుకు ప్రయత్నించామని, అయితే ఈలోగా పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు తమవైపునకు రావడంలో సెక్యూరిటీ అధికారులు తమను అక్కడ నుండి దూరంగా తీసుకెళ్ళిపోయారని హోవార్డ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి వీరు టిక్కెట్లు కూడా కొనుక్కున్నారు. సెక్యూరిటీ సిబ్బంది వారిద్దరినీ వారి స్థానాల వద్దకు తీసుకెళ్ళి కూర్చొబెట్టారు. 'ట్రంప్, కిమ్‌లను తలపించేలా వారు వేసుకున్న దుస్తులతో ఎటువంటి సమస్య లేదని, అయితే మీడియా సీట్ల వద్దకు వారు వెళ్ళడంతో తాము జోక్యం చేసుకున్నామని సెక్యూరిటీ సిబ్బంది తెలిపారు.

ఉత్తర కొరియాలో పర్యటించండి

ద.కొరియా అధ్యక్షుడికి కిమ్ ఆహ్వానం

ప్యాంగాంగ్ : త్వరలో తమ దేశంలో పర్యటించాల్సిందిగా దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్‌ను ఉత్తర కొరియా నేత కిమ్‌జోంగ్ ఉన్ ఆహ్వానించారు. ఈ విషయాన్ని దక్షిణ కొరియా అధ్యక్ష భవనం శనివారం ఒక ప్రకటనలో ధృవీకరించింది. ఈ పర్యటనే గనుక జరిగితే గత పదేళ్ళ కాలంలో ఇరువురు అధ్యక్షుల మధ్య మొదటి సమావేశం కాగలదు. కిమ్ సోదరి కిమ్ యో జోంగ్ ప్రస్తుతం దక్షిణ కొరియాలో జరుగుతున్న వింటర్ ఒలింపిక్స్‌కు హాజరయ్యారు. అధ్యక్ష భవనం బ్లూ హౌస్‌లో మూన్‌తో సమావేశమైన ఆమె తన సోదరుడి తరపున మూన్ జే ఇన్‌కు ఆహ్వానం అందచేశారని అధ్యక్ష భవనం ప్రతినిధి ఒకరు తెలిపారు. ఈ ఆహ్వానాన్ని అంగీకరించేందుకు పరిస్థితులు అనువుగా వుండేలా చూడాల్సిన బాధ్యత రెండు కొరియాలదేనని ఆ ప్రతినిధి వ్యాఖ్యానించారు.

చర్చలతో స్వతంత్ర పాలస్తీనా

- భారత్ ఆకాంక్ష ఇదేనన్న ప్రధాని మోడీ
- మోడీకి 'గ్రాండ్ కాలర్ ఆఫ్ స్టేట్ ఆఫ్ పాలస్తీనా' పురస్కారం

రమల్లా: పరస్పర ఆమోదయోగ్యమైన చర్చల ద్వారా ప్రశాంతంగా స్వతంత్ర పాలస్తీనా ఏర్పడాలన్నదే భారత్ ఆకాంక్ష అని ప్రధాని నరేంద్రమోడీ స్పష్టం చేశారు. పాలస్తీనాలో అధికార పర్యటన నిమిత్తం శనివారం ఇక్కడికి చేరుకున్న ఆయనకు పాలస్తీనా అధ్యక్షుడు మహ్మూద్ అబ్బాస్ సాదర స్వాగతం పలకటంతో పాటు 'గ్రాండ్ కాలర్ ఆఫ్‌ది స్టేట్ ఆఫ్ పాలస్తీనా' పురస్కారంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ ప్రసంగిస్తూ ఇది భారత దేశానికి లభించిన గౌరవమని, పాలస్తీనా మైత్రికి గుర్తన్నారు. ఈ పురస్కారానికి భారతీయులందరి తరపున తాను కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఆయన చెప్పారు. అనంతరం ఉభయ దేశాల ప్రతినిధి వర్గాల మధ్య జరిగిన చర్చల్లో కుదిరిన ఒప్పందాలను ఇరువురు నేతలు పరస్పరం అందచేసుకున్నారు. తరువాత ఇరువురు నేతలూ



ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ త్వరలోనే ప్రశాంత పరిస్థితుల మధ్య పాలస్తీనా సర్వ స్వతంత్ర దేశంగా ఆవిర్భవిస్తుందని భారత్ ఆశిస్తోందన్నారు. పాలస్తీనా ప్రయోజనాలను పరిరక్షిస్తామన్న హామీకి భారత్ కట్టుబడి ఉందన్నారు. ఈ ప్రాంతంలో శాంతి సుస్థిరతల సాధనకు దౌత్య మార్గం ఒక్కటే శరణ్యమని ఆయన స్పష్టం చేశారు. పాలస్తీనాలో శాంతి, సుస్థిరతలు నెలకొంటాయని తాము ఆశిస్తున్నామని చెప్పారు. దూరదృష్టితో కూడిన దౌత్య పద్ధతిలోనే హింసాత్మకమైన గతానికి తెరదించి ప్రశాంతత సాధించగలమన్నారు. అది కష్టసాధ్యమన్న విషయం తెలిసినప్పటికీ, దానిని సాధించటం కోసం మనం ప్రయత్నించాల్సిన అవసరం వుందన్నారు. భారత్–పాలస్తీనా సంబంధాలు కాలపరీక్షకు ఎదురు నిలిచాయని, భారత విదేశాంగ విధానంలో పాలస్తీనాకెప్పుడూ అగ్రస్థానం వుం టుందని చెప్పారు.పాలస్తీనా అభివృద్ధిలో భారత్ భాగ స్వామిగా వుంటుందన్న మోడీ ఇక్కడ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిప్లొమసీ ఏర్పాటుకు భారత్ సహకరిస్తుందని ప్రకటిం చారు. దీనితో పాటు రమల్లాలో ఒక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణాన్ని భారత్ ప్రారంభిస్తుందని ఆయన ప్రకటించారు. అనంతరం పాలస్తీనా అధ్యక్షుడు అబ్బాస్ మాట్లా డుతూ. జెరూసలేం నగరంపై అమెరికా వివాదాస్పద నిర్ణయం తీసుకున్న ప్రస్తుత సమయంలో భారత ప్రధాని మోడీ పాలస్తీనా పర్యటన అత్యంత ప్రాధాన్యతను సంతరించు కున్నదని అభివర్ణించారు. రమల్లా నగరానికి చేరుకున్న వెంటనే నేరుగా మాజీ అధ్యక్షుడు యాసర్ అరాఫత్ స్మారక చిహ్నం వద్దకు చేరుకున్న మోడీ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. రమల్లాలో ఒక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణాన్ని భారత్ ప్రారంభిస్తుందని ఆయన ప్రకటించారు.

మార్చి 31న వెనిజులా కొత్త ప్రభుత్వ ప్రధాన కార్యాలయం ప్రారంభం

లాపాజ్ : కొత్త ప్రభుత్వ ప్రధాన కార్యాలయాన్ని మార్చి 31న ప్రారంభించనున్నట్లు బొలీవియా అధ్యక్షుడు ఎవో మొరేల్స్ ప్రకటించారు. ఎట్టకేలకు రాజ భవనం కాకపోయినా ప్రజా భవంతిని నిర్మించుకున్నట్లు మొరేల్స్ వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకు వున్న పాత ప్రభుత్వ కార్యాలయాన్ని మ్యూజియంగా మారుస్తామని చెప్పారు. దాదాపు 3.47కోట్ల డాలర్ల వ్యయంతో 28 అంతస్తుల ఈ భవంతిని నగరం నడిబొడ్డున నిర్మించారు. ఈ భవన నిర్మాణమంతా కొలంబియా ముందు కాలం నాటి సంస్కృతిని పోలి వుంటుంది. 2014లో దీన్ని నిర్మాణం ఆరంభమైంది. ఇందులో మూడు బేస్‌మెంట్‌లు, హెలిపాడ్, పెద్ద హాల్, ఎల్ఇడి స్క్రీన్లతో కారిడార్లు వున్నాయి.

ఉ.కొరియా నేతతో ఐరాస చీఫ్ భేటీ

సియోల్: ఉ.కొరియా పార్లమెంట్ స్పీకర్ కిమ్ యోంగ్ నామ్‌తో ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ శుక్రవారం నాడు కొద్దిసేపు భేటీ అయినట్లు ఐరాస ప్రతినిధి ఒకరు వెల్లడించారు. ద.కొరియాలోని ప్యాన్‌చాంగ్ గ్రామంలో శుక్రవారం నాడు శీతాకాలం ఒలింపిక్ క్రీడలు ప్రారంభమైన నేపథ్యంలో ఈ భేటీ జరిగగినట్లు ఐరాస ప్రతినిధి ఒకరు న్యూయార్క్‌లోని ఐరాస ప్రధాన కార్యాలయంలో మీడియాకు వివరించారు. కొరియా ద్వీపకల్పాన్ని అణు నిరాయుధీకరణ చేసే లక్ష్యాన్ని సాధించేందుకు అన్ని వర్గాలు చర్చల వేదికను సమర్థవంతంగా వినియోగించుకుంటాయన్న ఆశాభావాన్ని ఐరాస చీఫ్ వ్యక్తం చేసినట్లు ఆయన వివరించారు. అయితే ఇంతకు మించి ఆయన వివరాలు వెల్లడించలేదు.

శ్రీలంకలో స్థానిక ఎన్నికలు ప్రారంభం

యుఎన్‌పికి కొలంబో : శ్రీలంకలో దీర్ఘకాలంగా జాప్యం జరుగుతూ వస్తున్న స్థానిక ఎన్నికలు శనివారం ప్రారంభమయ్యాయి. కోటీ 50 లక్షల మందికి పైగా ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పాలక సంకీర్ణంలోని రెండు ప్రధాన భాగస్వామ్య పార్టీల మధ్య తీవ్రంగా పోరు తలెత్తిన నేపథ్యంలో ఈ ఎన్నికలు పాలక పార్టీకి కీలకమైన పరీక్షగా మారాయి. 2015 ఆగస్టులో ప్రస్తుత ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టినప్పట్టిన తర్వాత జరుగుతున్న మొదటి స్థానిక ఎన్నికలివే. ప్రభుత్వం అమలు చేయతలపెట్టిన సంస్కరణల ఎజెండా ముందుకు సాగాలంటే ఈ ఎన్నికల్లో విజయం సాధించడం కీలకంగా మారింది. కొత్త రాజ్యాంగాన్ని రూపొందిస్తామని, యుద్ధ నేరాలపై అంతర్జాతీయ దర్యాప్తుకు వెసులుబాటు కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అవినీతి నిర్మూలన చర్యలు తీసుకుంటామని వాగ్దానం చేసింది.

స్థానిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో భాగస్వామ్య పార్టీలు పరస్పరం నిందారోపణలు చేసుకున్నాయి. స్థానిక ఎన్నికల్లో ప్రధాని రానిల్ విక్రమసింఘె నేతృత్వంలోని యునైటెడ్ నేషనల్ పార్టీ (యుఎన్‌పి) మంచి పనితీరు కనపరిచే అవకాశాలు వున్నాయని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. దేశవ్యాప్తంగా 340 స్థానిక సంస్థల్లో 8300మంది ప్రతినిధులను ఎన్నుకోనున్నారు.

సిరియాలో నెల రోజుల పాటు కాల్పుల విరమణ

- పరిశీలిస్తున్న భద్రతా మండలి
- రష్యా వ్యతిరేకత
- సోమవారం మండలిలో చర్చ

ఐక్యరాజ్య సమితి : సిరియాలో నెల రోజుల పాటు కాల్పుల విరమణ పాటించాలన్న డిమాండ్‌ను ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి పరిశీలిస్తోంది. ప్రజలకు మానవతా సాయాన్ని అందించడానికి, గాయపడిన వారిని అక్కడ నుండి తరలించడానికి వీలుగా 30 రోజుల పాటు కాల్పులను విరమించాలనే డిమాండ్‌పై ఆలోచిస్తున్నట్లు దౌత్యవేత్తలు తెలిపారు. అయితే రష్యా దీన్ని వ్యతిరేకిస్తోంది. స్వీడన్, కువైట్‌లు రూపొందించిన ఈ తీర్మానాన్ని శుక్రవారం భద్రతా మండలిలో పంపిణీ చేశారు. ఈ తీర్మానం ఆమోదం పొందాలంటే 9ఓట్లు అనుకూలంగా రావాలి, రష్యా, చైనా, అమెరికా, బ్రిటన్ లేదా ఫ్రాన్స్‌లు వీటో చేయకూడదు. సిరియాలో కాల్పుల విరమణ అమలు చేయాలని మంగళవారమే ఐక్యరాజ్య సమితి పిలుపిచ్చింది. ఆ పిలుపునకు అమెరికా విదేశాంగ శాఖ మద్దతిచ్చింది. అయితే ఐక్యరాజ్య సమితిలో రష్యా రాయబారి నెబెంజియా మాత్రం దీన్ని వ్యతిరేకించారు. ఇది వాస్తవికతకు అనుగుణంగా లేదన్నారు. సిరియాలో యుద్ధం ముగిసినపుడే కాల్పుల విరమణ జరగాలని తాము కోరుకుంటున్నామని అన్నారు. 2011లో సిరియాలో ప్రచ్ఛన్న యుద్ధం ఆరంభమైనప్పటి నుండి భద్రతా మండలి చేపట్టే చర్యలపై రష్యా ఇప్పటి వరకు 11సార్లు వీటో చేసింది. ప్రజలు నివసించే ప్రాంతాలపై దిగ్బంధనాన్ని తక్షణమే ఎత్తివేయాలని ఆ తీర్మానం కోరుతోంది. ఈ తీర్మానంపై సోమవారం మండలిలో చర్చ జరుగుతుందని భావిస్తున్నారు. అయితే దీనిపై ఎప్పుడు ఓటింగ్ జరుగుతుందో ఇంకా తెలియరాలేదు.

లిబియా మసీదులో భారీ పేలుడు

14 మంది మృతి, 143 మందికి గాయాలు

ట్రిపోలి: లిబియాలోని బెంగాజీ నగరంలో శుక్రవారం నాడు ఓ మసీదులో సంభవించిన భారీ పేలుడులో 14 మంది మరణించారని, మరో 143 మందికి పైగా గాయపడ్డారని అధికారులు చెప్పారు. శుక్రవారం ప్రార్థనలు ముగిసిన అనంతరం వెలుపలికి వస్తున్న సమయంలో ఈ పేలుడు జరిగిందని, లిబియా తూర్పు ప్రాంత సైనిక దళాల ప్రతినిధి కల్నల్ మిలుద్ జువాయ్ చెప్పారు. మసీదులోపల ఉంచిన పేలుడు పదార్థాలుంచిన బ్యాగ్‌లను రిమోట్ ద్వారా పేల్చటంతో ఈ ఘటన జరిగినట్లు తమ ప్రాథమిక దర్యాప్తులో వెల్లడయిందని ఆయన వివరించారు. సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి ఒక మృతదేహంతో పాటు 87 మంది క్షతగాత్రులను తరలించామని, వీరిలో కొందరి పరిస్థితి విషమంగా వుందని బెంగాజీలోని అల్ జలా ఆస్పత్రి సమాచార అధికారి వివరించారు. 2017 నుండి సైనిక పాలనలో వున్న బెంగాజీ నగరంలో ఇటీవలి కాలంలో బాంబు దాడులు పెరగటం ముఖ్యంగా మసీదులపై దాడులు జరుగుతుండటం పట్ల స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మొదటి పేజీ తరువాయి

చెప్పినవన్నీ చేస్తున్నాం

గోకరాజు గంగరాజు కూడా ఉన్నారు. కాగా కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీతో కేంద్ర మంత్రి సుజనా చౌదరి, ఎంపి సిఎం రమేష్ భేటీ అయ్యారు. రెవెన్యూ లోటు, రైల్వే జోన్, ఈఎపి ప్రాజెక్టులపై చర్చించారు. ఏపికి నిధుల విడుదలపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జమ్మూలో సైనిక శిబిరంపై ఉగ్ర దాడి

ప్రాంతానికి కొన్ని మీటర్ల దూరంలోనే కేంద్రీయ విద్యాలయ కూడా ఉంది. ఈ సంఘటనతో జమ్మూలో భద్రతను పెంచారు. నగరమంతటా హై అలర్ట్ ప్రకటించారు. కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జమ్మూ కాశ్మీర్ డిజిపి ఎస్‌పితో పరిస్థితిపై సమీక్షించారు. సైనిక శిబిరం పరిసరాలలోఉన్న పాఠశాలలను మూసివేశారు. 2001లో పార్లమెంట్ భవనంపై దాడి నిందితుడు అఫ్జల్ గురుకు ఉరిశిక్ష విధించిన రోజు కావడంతో శనివారం జైష్ ఎ మహ్మద్ ఉగ్రవాద సంస్థ సైనిక శిబిరాలపైన, భద్రతా సంస్థలపైన దాడులు జరిపే అవకాశముందని ఇంటెలిజెన్స్ వర్గాలు ముందుగానే హెచ్చరించాయి. అఫ్జల్ గురును ఫిబ్రవరి 9, 2013న ఉరి తీసిన సంగతి తెలిసిందే. సైనిక శిబిరంపై ఉగ్రవాద దాడికి సంబంధించి ప్రతిపక్ష సభ్యులు అసెంబ్లీలో ఆందోళనకు దిగారు. దీంతో స్పీకర్ 15 నిముషాలపాటు సభను వాయిదా వేశారు.

హైకోర్టు ఏర్పాటుకు తాత్కాలిక భవనాల పరిశీలన

ఉన్న నిమ్రా ఇంజనీరింగ్ కళాశాల భవనాలను కూడా బృందం పరిశీలించింది. గెజిటెడ్ అధికారుల కోసం అపార్టుమెంట్లు నిర్మిస్తున్న ఎల్అండ్‌టి కార్యాలయంలో జస్టిస్ సిటీ స్థలంతో పాటు రాజధాని నిర్మాణానికి సంబంధించిన పలు విషయాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సిఆర్‌డిఎ కమిషనర్ చెరుకూరి శ్రీధర్, ఇంజినీర్లు వివరించారు. ఈ బృందంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వి రామసుబ్రహ్మణ్యం, జస్టిస్ సి ప్రవీణ్ కుమార్, జస్టిస్ ఎవి శేషసాయి, జస్టిస్ టి సునీల్ చౌదరి, జస్టిస్ పి సత్యనారాయణ మూర్తి, కృష్ణా జిల్లా జడ్జి ఎవి రవీంద్రబాబు, గుంటూరు జిల్లా కలెక్టర్ కోన శశిధర్, విజయవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు సోము కృష్ణమూర్తి, ఆర్అండ్‌బి చీఫ్ ఇంజనీర్ పి శ్రీమన్నారాయణ తదితరులు ఉన్నారు. మరోవైపు ఈ కమిటీని రాయలసీమ హైకోర్టు సాధన సమితికి చెందిన 40 మంది సభ్యులు కలిశారు. రాయలసీమలోనే హైకోర్టును ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని ఇచ్చారు.

ప్రజా పోరాటాలతోనే ఎర్ర జెండాకు పూర్వవైభవం

(మొదటి పేజీ తరువాయి)

భారతదేశంలో తొలిసారి బిజెపి ప్రైవేటు సైన్యాన్ని ఏర్పాటు చేసి, పోషిస్తోందని అన్నారు. గోరక్షణ పేరుతో ప్రజలపై దాడులకు దిగారని తెలిపారు. యాంటీ రోమియో స్క్వాడ్ పేరుతో యువతీ, యువకులపై దాడులు చేస్తున్నారన్నారు. యూనివర్శిటీల్లోనూ విద్యార్థులపై దాడులు చేస్తున్నారన్నారు. ఇవన్నీ కూడా ప్రజల్లో ఏర్పడుతున్న ఐక్యతను దెబ్బతీసే చర్యల్లో భాగమేనన్నారు. దీంతోపాటు చట్ట సంస్థల్లోనూ ఆర్‌ఎస్‌ఎస్ జోక్యం పెరిగిపోయిందని తెలిపారు. సెన్సార్‌బోర్డును, ఎన్నికల సంఘాలనూ నియంత్రిస్తోందని తెలిపారు. దేశాన్ని హిందూత్వ దేశంగా మార్చాలనే ఉద్దేశంతో ఇష్టం వచ్చినట్లు చేసుకుపోతోందని పేర్కొన్నారు. న్యాయవ్యవస్థలోనూ తోచినట్లు మార్పులు చేస్తోందని, ఇటీవల న్యాయమూర్తులు బహిర్గతమవడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. దీన్ని వ్యతిరేకించే వారిపై దాడులు చేస్తూ హత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. గోవింద్ పన్సారే, కల్బుర్గి, గౌరిలంకేష్ హత్యలు అందులో భాగమేనన్నారు. మతోన్మాద హత్యలు, ఆర్థిక సమస్యలు, దళితులపై దాడులకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమాలు పుట్టుకొస్తున్నాయన్నారు. వీటన్నిటనీ ఐక్యంగా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత వామపక్షాలపై ఉందని తెలిపారు. దళిత సంఘాలూ ఒక వేదికపైకొచ్చాయని, లాల్, నీల్ ప్రస్తావన కూడా ముందుకు వచ్చిందని తెలిపారు.

భారత్‌ను జూనియర్ భాగస్వామిగా మారుస్తున్న బిజెపి

దేశంలో మోడీ ప్రభుత్వం సంస్కరణలను వేగంగా అమలు చేస్తోందన్నారు. సంస్కరణలు అమలు చేసిన దేశాలన్నీ సంక్షోభంలో కూరుకుపోయాయని తెలిపారు. సంస్కరణలో భాగంగా ప్రజలపై పెరుగుతున్న భారాలు, ఆర్థిక ఇబ్బందులకు వ్యతిరేకంగా ప్రజల్లో పెద్దఎత్తున ఉద్యమాలు పుట్టుకొస్తున్నాయని తెలిపారు. మరోవైపు అమెరికన్ సామ్రాజ్యవాదానికి దాసోహమై స్వతంత్రను కోల్పోయే విధంగా చేస్తున్నారని విమర్శించారు. గతంలో మన్మోహన్‌సింగ్ ఆర్థిక సంస్కరణలు అమలు చేసిన సమయంలో కార్పొరేట్‌శక్తుల లాభాలు పుంజుకున్నాయని తెలిపారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల 2014 నాటికి మొత్తం జిడిపిలో 49 శాతం ఆస్తులు ఒకశాతం ఉన్న వ్యాపారవేత్తల చేతుల్లోకి వెళ్లిందన్నారు. మోడీ పాలనలో మూడేళ్లకాలంలో 2017 నాటికి వచ్చే సరికి ఆస్తులు 49 శాతం నుండి 73 శాతానికి పెరిగాయని తెలిపారు. 99 శాతం మంది ప్రజలు 23 శాతంతో బతుకుతున్నారని వివరించారు. ఆర్థిక అసమానతలు దేశంలో విపరీతంగా పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. మరోవైపు సంక్షోభంలో నుండి బయటపడేందుకు పెట్టుబడిదారీ దేశాలు, కార్పొరేట్‌శక్తులు అభివృద్ధి చెందుతున్న దేశాల్లో జోక్యం చేసుకుని వారికి అనుకూలంగా ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థను మార్చేస్తున్నాయని చెప్పారు. మన దేశంలో జిఎస్‌టి, నోట్ల రద్దు వంటి చర్యలన్నీ అందులో భాగమేనన్నారు. నోట్ల రద్దుతో బ్యాంకింగ్ రంగం దివాళా తీస్తోందన్నారు. కార్పొరేట్‌శక్తులను కాపాడే పేరుతో ప్రజలకు వెచ్చించాల్సిన ఖర్చును తగ్గిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా సామాజిక, విద్యా, వైద్యరంగాల్లో నిధుల వెచ్చింపును తగ్గించేశారన్నారు. పనిగంటలు పెంచారని, ఇది యూరోపియన్ దేశాల్లో ఎక్కువగా ఉందన్నారు. పేదలకు అందించే సబ్సిడీని కట్ చేస్తున్నారని చెప్పారు. ప్రజలపై ఆర్థిక దోపిడీని పెంచారని వివరించారు. విదేశీ పెట్టుబడులను తీసుకొస్తున్నారని చెప్పారు. బడ్జెట్లో మూడొంతులు ప్రజలకు కేటాయించే రంగాల్లో నుండే తీసుకుంటున్నారని తెలిపారు. పెట్టుబడిదారులకు లాభాలు కల్పించే ప్రక్రియను వేగవంతం చేశారన్నారు. నోట్ల రద్దు వల్ల దేశంలో చిన్న, మధ్యతరహా, సూక్ష్మ పరిశ్రమలు తగ్గాయని, వాటి ఆదాయం మొత్తం పెద్దపెద్ద కార్పొరేట్‌శక్తులకు మళ్లించారని తెలిపారు. డిజిటల్ ట్రాన్సాక్షన్ పేరుతో ఇప్పటికే రిలయన్స్, మాస్టర్‌కార్డ్ విసా వంటి సంస్థలకు పెద్దఎత్తున దోచి పెడుతున్నారని వివరించారు. దేశంలో మధ్యవర్తుల అవసరం లేకుండా పోయిందని ప్రధాని పదేపదే చెబుతున్నారని అది సరికాదని తెలిపారు. రైతులకు కల్పిస్తామన్న కనీస మద్దతు ధర కల్పించలేదని, నిరుద్యోగభృతి, ఉపాధి కల్పన వంటి సమస్యలు ఇంకా పరిష్కారం చేయలేకపోయారని పేర్కొన్నారు. ఒకవైపు రైతుల ఆత్మహత్యలు, ఆకలి మరణాలు పెరుగుతుంటే వారికి రుణమాఫీ చేయకుండా కాలయాపన చేస్తున్న ప్రభుత్వం పెద్దపెద్ద కార్పొరేట్ సంస్థలకు రెండు లక్షల కోట్ల మినహాయింపులు ఇచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లోనూ రుణమాఫీ అమలు కాలేదని చెప్పారు.

త్రిపురలో గెలుపుకోసం అడ్డదారులు

దేశంలో బిజెపి వామపక్షాలను టార్గెట్ చేసిందని, ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న త్రిపురలో ఓడించేందుకు సంఘ విద్రోహశక్తులతోనూ చేతులు కలుపుతోందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో అక్కడ సిపిఎంను ఓడించేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తోందని తెలిపారు. రాజకీయ హింసను రెచ్చగొడుతోందని అన్నారు. గతంలో అనేక రాష్ట్రాల్లో బిజెపి అదే పద్ధతి అనుసరించి అధికారంలోకి వచ్చిందన్నారు. కేరళలో చిచ్చు పెట్టేందుకు ఆర్‌ఎస్‌ఎస్ 40 ఏళ్లుగా ప్రయత్నాలు చేస్తోందని వివరించారు. బెంగాల్లోనూ బిజెపి, తృణమూల్ అరాచకాలను సిపిఎం అడ్డుకుంటోందని, ఇదే క్రమంలో 173 మంది కార్యకర్తలు అమరులయ్యారని తెలిపారు. బిజెపి పూర్తి మెజార్టీతో అధికారంలో ఉన్నామని చెబుతున్నా 112 మంది ఎంపిలు ఇతర పార్టీల నుండి వెళ్లినవారేనని లెక్కలు చెబుతున్నాయన్నారు. రాష్ట్రంలో టిడిపి కూడా బిజెపితో కలిసి ప్రజలను మోసం చేస్తోందన్నారు. ప్రత్యేక హోదా తెస్తామని చెప్పి నాలుగేళ్లు గడిచినా ఏమీ చేయలేకపోయిందని అన్నారు. హామీల అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో బిజెపి అరాచకాలను, కార్పొరేట్ల దోపిడీని అడ్డుకునేందుకు వామపక్ష ప్రజాతంత్ర శక్తులను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రభుత్వ విధానాల వల్ల ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకతను వామపక్షాలకు అనుకూలంగా మార్చుకోవాలని ఏచూరి సూచించారు. స్వతంత్రశక్తిగా ఎదగాలన్నారు.

బిజెపి వల్ల ప్రత్యేక హోదా రాదు

ప్రత్యేక హోదా బిజెపి వల్ల సాధ్యం కాదని స్పష్టం చేశారు. త్రిపురలో బిజెపి వస్తుందని ప్రకటించి మోడీ విదేశాలకు వెళ్లిపోయారని, ఎర్రజెండాను దించడం ఎవరికీ సాధ్యంకాదని ఏచూరి స్పష్టం చేశారు. గతంలో హిట్లర్, మాజీ ప్రధాని ఇందిరిగాంధీ ఎర్రజెండాను కతం చేస్తామని ప్రగల్భాలు పలికారని, అయితే అది వారికి సాధ్యం కాలేదని అన్నారు. మోడీ మాటలన్నీ ప్రగల్భాలేనని ఎర్రజెండాను దించే దమ్ము దేశంలో ఎవరికీ లేదన్నారు. దేశానికి ప్రత్యామ్నాయ విధానాలు అవసరమని, వాటిని అనుసరించే విధంగా కేంద్రంపై ఒత్తిడి తేవాల్సి ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వేలాది ఇంజినీరింగ్ సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో ఇంజినీరింగ్ చదువుపట్ల యువత ఆసక్తి చూపడం లేదన్నారు.

ఉద్యోగాలు ఇవ్వాలని యువత అడిగితే 'పకోడి అమ్ముకోమని' మోడీ చెబుతారా అని ఎద్దేవా చేశారు. ఇప్పటి వరకూ దేశంలో 8 కోట్ల కొత్త ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును బిజెపితో తిరిగి ఎందుకు కలిశారని అడిగానన్నారు. దానికి చంద్రబాబు సమాధానం చెబుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి ఉండడం వల్ల ప్రజలకు మేలు చేస్తామని చెప్పారని అన్నారు. అయితే ప్రస్తుతం ప్రత్యేక హోదా, ఇతర ప్రయోజనాల కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని తమను కోరుతున్నారని ఏచూరీ చెప్పారు. సిఎం కోరినా, కోరకపోయినా తాము ఎప్పుడూ ఎపి ప్రయోజనాల కోసం పార్లమెంట్‌లో పోరాడుతున్నామని ఏచూరీ స్పష్టం చేశారు.

ఉద్యోగుల గర్జన

చేరుకున్నారు. తొలుత ఉద్యోగులు కలెక్టరేట్ నుంచి బాలాజీచెరువు సెంటర్ మీదుగా కలెక్టరేట్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉద్యోగుల నినాదాలతో కలెక్టరేట్ ప్రాంగణం మారుమోగింది. జెఎసి సెక్రటరీ జనరల్ ఐ.వెంకటేశ్వర్లు, రాష్ట్ర పరిశీలకులు సిఎం.దాస్‌సదాశివం మాట్లాడారు.

శ్రీకాకుళం జిల్లాలో ఎన్‌జిఒ హోమ్ నుంచి కలెక్టరేట్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. విజయనగరం జిల్లా కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు పెద్దఎత్తున ధర్నా చేశారు. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. ధర్నానుద్దేశించి ఎపి ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎ.గంగిరెడ్డి, పరిశీలకులుగా వచ్చిన పిఆర్‌టియు రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరాజు మాట్లాడారు. విశాఖ జిల్లా పెన్షన్ సాధన సమితి ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద వందలాది మందితో భారీ ధర్నా నిర్వహించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, మహిళా ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ధర్నా ప్రదేశంలో స్థలం సరిపోక అనేక మంది చుట్టుపక్కల ఉన్న ఫుట్‌పాత్‌లుపైన, రోడ్లపై నిలుచుని వక్తల ప్రసంగాలను విన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డి.రాము మాట్లాడారు.

కృష్ణా : కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తొలుత ఎన్‌జిఒ హోమ్ నుండి వేలాది మంది ఉద్యోగులు కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు.

గుంటూరు నగరంలో వేలాది మంది భారీ ప్రదర్శన నిర్వహించారు. వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుండి కలెక్టరేట్ వరకూ నిర్వహించిన ప్రదర్శనతో రహదారి ఉద్యోగులతో నిండిపోయింది. సెలవు రోజైనా మహిళలు సహా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి, వివిధ సంఘాల రాష్ట్ర నాయకులు ప్రసంగించారు.

ఒంగోలు కలెక్టరేట్ వద్ద పెన్షన్ సాధన సమితి ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు.

నెల్లూరు కలెక్టరేట్ ఎదుట ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో తొలుత గాంధీ బొమ్మ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం ధర్నా నిర్వహించారు.

చిత్తూరు కలెక్టరేట్ ఎదుట పెన్షన్ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నానుద్దేశించి ఎంఎల్‌సి యండపల్లి శ్రీనివాసులురెడ్డి మాట్లాడారు.

కడప కలెక్టరేట్ ఎదుట ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తొలుత నగరంలో పెన్షన్ సాధన సమితి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పెన్షన్ సాధన కమిటీ రాష్ట్ర నాయకులు రఘురామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ తదితర ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

కర్నూలులో స్థానిక జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చేపట్టారు.

అనంతపురం కలెక్టరేట్ ఎదుట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. అంతకుముందు నగరంలోని టవర్‌క్లాక్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీలాన్, రాష్ట్ర నాయకులు ఉదయ్‌రాజు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని పార్టీలూ మద్దతునివ్వాలి ఎన్జీవో నేత అశోక్‌బాబు

రాజకీయ పార్టీలన్నీ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్) రద్దుకు మద్దతు ప్రకటించాలని ఎపి ఎన్జీవో అధ్యక్షులు అశోక్ బాబు పిలుపునిచ్చారు. సిపిఎస్ రద్దు కోరుతూ పెన్షన్ సాధన సమితి ఆధ్వర్యంలో శనివారం విజయవాడ అలంకార్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎస్ రద్దుకు రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసి కేంద్రానికి పంపాలన్నారు. ఢిల్లీలో ఈ నెల 16 న నిర్వహించే సమావేశంలో కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

టిడిపి, బిజెపి తోడుదొంగలు

నేపథ్యంలో అనేక వాగ్దానాలు చేశారని, అయితే నిధులు మాత్రం కేటాయించలేదన్నారు. రాష్ట్రం సమైక్యంగా ఉండాలని అప్పట్లో సిపిఎం గట్టిగా కోరిందన్నారు. విభజన జరిగితే సమస్యలు ఎలా ఉంటాయో అనాడే చెప్పామన్నారు. విభజన చేసి ప్రత్యేక హోదా, రాయితీలు ఇస్తామని చెప్పారన్నారు. తర్వాత బిజెపి, టిడిపి కుమ్మక్కై హోదా అవసరం లేదు.. ప్యాకేజీ గొప్పదంటూ చెప్పుకొచ్చారన్నారు. చంద్రబాబు ప్యాకేజి అద్భుతమంటూ చెప్పారని గుర్తు చేశారు. నిధులు మాత్రం ఇవ్వలేదన్నారు. పోలవరానికి రూ.58 వేల కోట్లు అవుతాయని లెక్కలు చెబుతుండగా రూ.వెయ్యికోట్లు కూడా ఇవ్వలేదన్నారు. రూ.16 వేల కోట్ల రెవెన్యూ లోటుకుగాను రూ.మూడు వేల కోట్లు కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక నిధులు ఊసే లేదన్నారు. విశాఖ రైల్వేజోన్ మాటే మరిచిపోయారని చెప్పారు. రాజధానికి ప్రణాళిక లేదు..నిధులు లేవని అన్నారు. కడపస్టీల్, కాకినాడలో రిఫైనరీ ఏఒక్కటీ లేకుండా పోయాయన్నారు. ఇప్పటి వరకూ అంతా బాగుందని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు అన్యాయం జరిగిందంటూ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

ప్రజాప్రయోజనాలు పట్టని ప్రభుత్వాలు

ప్రజల ప్రయోజనాలను ప్రభుత్వాలకు పట్టడం లేదని ఆయన విమర్శించారు. అంతా కలిసి రాష్ట్రప్రయోజనాలకోసం పోరాడుదామని పిలుపునిచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా తుందుర్రులో మోసం చేసి భూములు తీసుకుని అక్కడి పంటపొలాలను నాశనం చేస్తున్నారన్నారు. నీరు, పొల్యూషన్, పంటలు దెబ్బతింటాయని తెలిసినా ఆక్వా పరిశ్రమ స్థాపించాలని చూడటం దుర్మార్గమన్నారు. ఇష్టానుసారం అనుమతులు ఇచ్చేస్తున్నారన్నారంటూ దుయ్యబట్టారు. మత్స్యకారులు ప్రయోజనలు పట్టకుండా పోయాయని తెలిపారు. పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాలో తాగునీళ్లు కొనుగోలు చేసి తాగాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. ధ్యాన్యం ఉత్పత్తికాకపోతే ఆహార భద్రత ఏవిధంగా ఉంటుందన్నారు. తుందుర్రు పోరాటం అందరిదీ.. అంతా కలిసి సంఘీభావం తెలపాలన్నారు. వాళ్లు ఓడితే మనం ఓడినట్టే..వాళ్లు గెలిస్తే మనం గెలిచినట్టే అన్నారు.

వాటాలకోసం 'పోలవరం' తొందర

సిమెంట్‌తో గోడలు కట్టేసి తొందరగా 'పోలవరం' పూర్తిచేసి వాటాలు పంచుకోవాలని చూస్తున్నారన్నారు. అంతే తప్ప రెండులక్షల మంది నిర్వాసితుల గురించి ప్రభుత్వం ఆలోచించడం లేదన్నారు. అంతమందిని ముంచి తినే పాపపు కూడు మనకొద్దన్నారు. పోలవరం తొందరగా పూర్తిచేయాలని తాము కోరుతున్నామని, కానీ గిరిజనులకు నష్టపరిహారం పూర్తిస్థాయిలో అందించాలని సిపిఎం కోరుతుందన్నారు. అందుకు తగిన నిదులు కేటాయించి నిర్వాసితులను కాపాడాలన్నారు. దేశంలో చదువు, ఆరోగ్యం బాగోలేదన్నారు. చదువులో 30స్థానం, విద్యలో 25వస్థానంలో ఉన్నామని తెలిపారు. ఎందుకు ఇలాంటి సమస్యలు ఉండాలని ప్రశ్నించారు. ప్రసూతి మరణాల్లో కేరళలో అతి తక్కువగా ఉన్నాయన్నారు. ఇక్కడ ఎందుకు అలా చేయలేపోతున్నారో చెప్పాలన్నారు. చదువు, ఆరోగ్యంను వ్యాపారంగా మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోరాటం చేయాల్సి ఉందన్నారు. సామాజిక న్యాయం కోసం పోరాడాలన్నారు. గుంటూరు పత్తిపాడులో దళితులపై దాడులు, గరగపర్రులో అంబేద్కర్ విగ్రహం కూల్చేయడం ఏమిటి ఎందుకు ఒప్పుకోవాలన్నారు. దళిత, మైనార్టీ, గిరిజన, మహిళల హక్కులకోసం పోరాడితేనే ప్రజాస్వామ్యం అవుతుందన్నారు. తెలంగాణ, ఎపిలో కష్టజీవుల సామాజికన్యాయంకోసం అందరినీ సమీకరించి పోరాడాలన్నారు. చంద్రబాబు కార్మిక చట్టాలపై ఉక్కుపాదం మోపుతున్నారన్నారు. టిడిపి, బిజెపిలు ఎవరికోసం పనిచేస్తున్నాయో అందరికీ తెలుసునని తెలిపారు. ఆపార్టీలన్నిటికి ఒకేవిధానం ఉందన్నారు. వామపక్ష ప్రజాతంత్ర శక్తులను సమీకరించే విధంగా మహాసభలో చర్చిస్తామన్నారు. మీరంతా ఆదరించాలని కోరారు. ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని, అంతా కలిసి పోరాడితేనే న్యాయం జరగుతుందన్నారు. ఈకార్యక్రమంలో సిపిఎం జాతీయ, రాష్ట్రనాయకులు, పెద్దఎత్తున జనం పాల్గొన్నారు.

'2.0' కాదు... 'కాలా' వస్తున్నాడు


'కాలా'లో రజనీకాంత్

రజనీకాంత్ చేస్తున్న 'కాలా' చిత్రం ఏప్రిల్ 27వ తేదీన ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విషయాన్ని ఆ చిత్ర నిర్మాత ధనుష్ శనివారం తెలుపుతూ ఆ సినిమా పోస్టర్‌ను తన ట్విట్టర్ ఖాతాలో విడుదల చేశారు. శంకర్ దర్శకత్వంలో రూపొందిన '2.0' చిత్రం గత ఏడాది దీపావళికి విడుదల కావాల్సింది. అందుకే ఈ చిత్రాన్ని మొన్న గణతంత్ర దినోత్సవం నాడు ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేశారు. కానీ '2.0' దీపావళికిగానీ, ఈ ఏడాది సంక్రాంతికి గానీ విడుదల కాలేదు. చివరకూ ఏప్రిల్ 27న విడుదల చేస్తారని ప్రకటించారు. కానీ ఇప్పటికీ విజువల్ ఎఫెక్ట్స్ పనులు పూర్తికాక ఆ సినిమా రిలీజ్ చేయడం ఆలస్యం కానుంది. ఈ నేపథ్యంలో ఆ సినిమా విడుదల తేదీనాడే 'కాలా'ను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు నిర్ణయించారు. త్వరలో '2.0' రిలీజ్ చేసే కొత్త తేదీలను కూడా ప్రకటించనున్నారు. 'కాలా' చిత్రానికి పి. రంజిత్ దర్శకత్వం వహించారు. రజనీ, రంజిత్ కాంబినేషన్‌లో 2016లో 'కబాలి' వచ్చింది. కబాలి తరహాలోనే కాలా కూడా గ్యాంగస్టర్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కించారు. నాన పటేకర్, హ్యూమా కురేషీ, సముద్రకని, పంకజ్ త్రిపాఠి తదితరులు నటించారు. నటి ఈశ్వరరావు ఇందులో రజనికి జోడీగా నటించింది. సంతోష్ నారాయణ సంగీతం అందించారు.

పెళ్లయ్యాక తొలిసారి


సమంత, నాగచైతన్య

'ఏమాయ చేసావె', 'ఆటోనగర్ సూర్య', 'మనం'... ఈ చిత్రాలన్నీ నాగచైతన్య, సమంత జోడిగా చేసినవి. 'ఏమాయ చేసావె' సినిమాతోనే వీరిద్దరి మధ్య ప్రేమ పుట్టింది. గత ఏడాది దంపతులయ్యారు. వివాహం జరిగిన తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కిస్తారని ఎప్పటి నుంచో వార్తలు వస్తున్నాయి. ఆ విషయాన్ని నాగార్జున, నాగచైతన్య కూడా పలు సందర్భాల్లో వెల్లడించారు. ఇప్పుడు ఆ సినిమా పట్టాలెక్కబోతుంది. రొమాంటిక్ కథాంశంతో ఈ సినిమా ఉండబోతుంది. 'నిన్నుకోరి' ఫేమ్ శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్నారు. గత ఏడాదే ఈ సినిమా కథను చైతూ, సమంత విన్నారట. చేసేందుకు అప్పుడే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారట. కానీ ఇప్పటి వరకూ పట్టాలెక్కలేదు. ఇప్పటి వరకూ సమంత చేతి నిండా సినిమాలతో బిజీగా ఉంది. ఇటీవల తమిళ్‌లో చేసిన తన సినిమాలు ప్రేక్షకుల ముందుకొచ్చాయి. తెలుగులో చేస్తున్న 'రంగస్థలం' కూడా చిత్రీకరణ పూర్తయింది. ఇప్పుడు విజయ్ హీరోగా చేస్తున్న ఓ సినిమాలో సమంత కథానాయికగా నటిస్తుంది. ఇవి కాకుండా 'మహానటి' లోనూ కీలక పాత్రలో నటిస్తుంది. నాగచైతన్య ప్రస్తుతం మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'శైలజారెడ్డి అల్లుడు' అనే చిత్రంలో చేస్తున్నారు. అను ఇమ్మాన్యుయేల్ కథానాయిక. ఇటీవల చిత్రీకరణ ప్రారంభమైంది. మరో చిత్రం 'సవ్యసాచి' త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

రొమాంటిక్ ప్రేమ కథ

చిత్ర సమీక్ష

చిత్రం : తొలిప్రేమ
నటీనటులు : వరుణ్ తేజ్, రాశీ ఖన్నా, సప్నా పబ్బి, సుహాసిని, ప్రియదర్శి, విద్యుల్లేఖ రామన్ తదితరులు.
సాంకేతికత : దర్శకత్వం : వెంకీ అట్లూరి, నిర్మాత : బీవీఎస్ఎన్ ప్రసాద్, సంగీతం : ఎస్ఎస్ తమన్, సినిమాటోగ్రఫీ : జార్జ్ సి.విలయమ్స్, ఎడిటర్ : నవీన్ నూలి.



వరుస ఫ్లాప్‌లతో నెట్టుకొస్తున్న వరుణ్ తేజ్‌కు తన కెరీర్‌లోనే కీలకమైన హిట్ చిత్రంగా 'ఫిదా' నిలిచింది. ఆ సినిమా తర్వాత మరో ప్రేమకథా చిత్రంలో నటించాడు. ఆ సినిమాయే 'తొలిప్రేమ'. తన బాబాయ్ పవన్ కల్యాణ్ చిత్రం పేరునే వరుణ్ కూడా పెట్టేసుకున్నాడు. హిట్ అవుతుందనుకుంటేనే ఈ చిత్రానికి 'తొలిప్రేమ' టైటిల్ పెట్టాలని ఎంతో ఆలోచించి మరీ పెట్టారు. ఎప్పుడూ చేసే జోనర్ కాకుండా కొత్తగా ప్రయత్నిస్తే ఎలా ఉంటుందో చూద్దామని ఈ సినిమా చేసినట్టు చెప్పారు వరుణ్ తేజ్. ఈ సినిమా తన బాబాయ్ చిత్రం పేరు నిలబెట్టిందా? లేదా? చూద్దాం.

కథ : వైజాగ్ నుంచి హైదరాబాద్ వెళ్లే ట్రైన్‌లో ఓ అబ్బాయి అమ్మాయి కలుసుకుంటారు. లవ్ ఎట్ ఫస్ట్‌సైట్ అన్నట్టు అబ్బాయి అమ్మాయిని చూసిన వెంటనే తను ప్రేమిస్తున్నట్టు చెప్పేస్తాడు. దాన్నే ట్రైలర్‌లో చూపించారు. కానీ ఆ అమ్మాయి దాన్ని స్వీకరించదు. ముందుస్నేహం తర్వాత ప్రేమ అన్నట్టు చెబుతుంది. కానీ అతనికి చెప్పకుండానే అక్కడి నుంచి వెళ్లిపోతుంది. ఆ అబ్బాయే ఆది(వరుణ్ తేజ్). అమ్మాయి వర్ష (రాశీ ఖన్నా). ఇలా విడిపోయిన వీరిద్దరూ మళ్లీ ఇంజనీరింగ్ కాలేజీలో కలుస్తారు. అక్కడే వీరిద్దరూ ఇంజనీరింగ్ కోసం చేరుతారు. అయితే అక్కడ ఆదిని ఇష్టపడుతుంది కానీ ప్రేమను మాత్రం బయటకు చెప్పదు వర్ష. కొన్ని రోజుల తర్వాత తన ప్రేమను ఆదికి చెబుతుంది. ఆ తర్వాత రోజు ఓ అల్లరిమూక ఘటన వీరిద్దరని మళ్లీ దూరం చేస్తుంది. మళ్లీ వీరిద్దరూ ఆరేళ్ల తర్వాత లండన్‌లో జాబ్ చేసే వద్ద కలుస్తారు. ఆది ఆర్కిటెక్చర్‌గానూ, వర్ష సైట్ మేనేజర్‌గా చేస్తుంది అదే కంపెనీలో చేస్తారు. ఆ తర్వాత వీరిద్దరూ ఒక్కటయ్యారా? లేదా? అన్నదే మిగిలిన స్టోరీ.

విశ్లేషణ : ప్రేమకథలు ఎప్పుడూ ఎలా ఉంటాయో ఈ కథ అంతే. ప్రేమికులు విడిపోవడం, కలవడం, వీరి మధ్య ఇగోలు ఇవన్నీ చాలా సినిమాల్లో చూశాం. అవన్నీ ఇందులోనూ ఉన్నాయి. అయితే అవే విషయాలను యువతకు నచ్చేలా తెరకెక్కించాడు వెంకీ అట్లూరి. వెంకీ సృష్టించిన హీరోహీరోయిన్ల క్యారెక్టరైజేషన్ సినిమాను నిలబెట్టాయి. వాటి చుట్టూనే వినోదం, డ్రామా, భావోద్వేగాలు పలికించాడు. కాలేజీ సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. హీరో హీరోయిన్ల మధ్య రొమాంటిక్ సన్నివేశాలు చాలా క్యూట్‌గా ఉన్నాయి. యువతను దృష్టిలో పెట్టుకుని చేసిన సినిమాలా ఉంటుంది.

రాశీఖన్నా వరుణ్‌కు ప్రపోజ్ చేసే సన్నివేశం చిత్రంలోనే హైలైట్. వర్ష, ఆది మధ్య కెమిస్ట్రీ కుదిరింది. తమన్ సంగీతం కూడా మెలోడియస్‌గా సన్నివేశాలకు తగినట్టుగా ఉందనిపించింది. దర్శకుడు రాసిన సన్నివేశాలన్నీ కొత్తగా అనిపిస్తాయి. ఈ కథ టర్కిష్ డ్రామా అయిన 'లవ్ లైక్స్ కో ఇన్‌సైడ్స్ (2011)'లోనిది. ఇదే కథతో సుమంత్ హీరోగా 'మళ్లీ రావా' వచ్చింది. కొన్ని సన్నివేశాలు ఆ సినిమాలో చూసినా కాస్త ఫ్రెష్ అనిపిస్తాయి.

కలుసుకోవడం, విడిపోవడం, మళ్లీ ఏం జరుగుతుందా? అని చూడడం అన్న వాటి చుట్టూనే ఈ కథ తిరుగుతుంది. ఈ సినిమా ఫస్టాఫ్‌లో చాలా క్యూట్ సన్నివేశాలు ఉన్నాయి. దర్శకుడి క్రియేటివిటీ ప్రతి సన్నివేశంలో కనిపిస్తుంది.

కథకు మంచి సంగీతం కూడా తోడైంది. విజువల్స్ కూడా అద్భుతంగా ఉన్నాయి. ఈ సినిమాకు తమన్ గీతాలు బలాన్నిస్తాయి.

ఇంటర్వెల్ తర్వాత లండన్‌లో ఈ సినిమా కథ మొదలవుతుంది. అక్కడ జరిగే సన్నివేశాలు చాలా బాగుంటాయి. హైపర్ ఆది హాస్యం ఆకట్టుకుంది. కొన్ని సాంగ్స్ కూడా ఫర్వాలేదనిపించాయి.

నటన : 'ఫిదా' తర్వాత వరుణ్ తేజ్ కెరీర్‌లో మరో హిట్ సినిమాగా 'తొలిప్రేమ' తన ఖాతాలో చేరొచ్చునని చెప్పొచ్చు. వరుణ్ కూడా తన పాత్రలో ఒదిగిపోయాడు. చాలా క్యూట్‌గా కనిపించాడు. రాశీ ఖన్నా ఇందులో చాలా పరిణితి చెందిన అమ్మాయిలా మెప్పించింది. యువత హృదయాలను తన నటనతో దోచుకుంటుంది. తన కెరీర్‌లోనే ఈ సినిమాలో చేసిన పాత్ర బెస్ట్ రోల్‌గా నిలుస్తుంది. ప్రియదర్శి హాస్యం సాగదీతగా మారింది. హైపర్ ఆది నవ్వించాడు. ఎన్ఆర్‌గా నరేష్, వరుణ్ తేజ్ తల్లిగా సుహాసిని ఓకే అనిపించారు.

సంగీత దర్శకుడు తమన్ ఈ రొమాంటిక్ డ్రామాకు మంచి బాణీలు అందించాడు. సునూన..., నిన్నిలా..వంటి గీతాలు హైలైట్‌గా నిలుస్తాయి. బ్యాక్‌గ్రౌండ్‌కు కూడా ఈ సాంగ్స్ ట్యూన్స్‌నే ఉపయోగించాడు. జార్జ్ సి విలయమ్ కెమెరా పనితనం ప్రతి సీన్‌లోనూ కనిపించింది. 'జ్ఞాపకాలు మంచివైనా చెడ్డవైనా మోయక తప్పదు' వంటి డైలాగ్స్ ఆకట్టుకుంటాయి. విద్యుల్లేక తన సహచరులు 'అక్క' అంటూ పిలిచే మాటలు ఫన్నీగా ఉంటాయి. సెకండాఫ్‌లో కాస్తా ఎడిటింగ్ అవసరమనిపించింది. మొదటి సినిమా అయినా వెంకీ అట్లూరి అనుభవం ఉన్నవాడిలా చేశాడు. చాలా సన్నివేశాల్లో తన మార్కు కనిపించింది. కథలో ఆయన సృష్టించిన ఫన్నీ సీన్స్ బాగున్నాయి. మొత్తంగా చూస్తే తొలిప్రేమ రొమాంటిక్ ప్రేమకథ చిత్రంగా చెప్పొచ్చు.

– కొప్పుశెట్టి దేవరాజు

మట్టిమనుషుల ప్రేమకథ


శ్రావ్య రావు


సూర్య భరత్ చంద్ర, శ్రావ్య రావు జంటగా రూపొందనున్న చిత్రం 'సంత'. సుబ్రమణ్య పిక్చర్స్ పతాకంపై శ్రీ జై వర్దన్ బోయెనేపల్లి నిర్మిస్తున్నారు. మట్టి మనుషుల ప్రేమకథ అనేది ట్యాగ్ లైన్. నెల్లుట్ల ప్రవీణ్ చందర్ దర్శకుడు. ఓ సంత నేపథ్యంలో ప్రేమకథగా ఫీల్ గుడ్ ఎంటర్‌ట్రైన్‌మెంట్ జోనర్‌లో తెరకెక్కుతోన్న ఈ సినిమా చిత్రీకరణను ఈ నెల 13 న ప్రారంభించనున్నట్లు నిర్మాత జై వర్దన్ తెలిపారు. ఈ చిత్రానికి మాటలు : ఎస్.కె.అనీఫ్, పసునూరి రవీందర్, పాటలు : గోరెటీ వెంకన్న,కాసర్ల శ్యామ్,మౌనశ్రీ మల్లిక్, డిఓవి : ఫణీంద్ర వర్మ అల్లూరి, నిర్మాత : జై వర్దన్ బోయెనేపల్లి, కథ– కథనం– సంగీతం– దర్శకత్వం : నెల్లుట్ల ప్రవీణ్ చందర్.

ఇది నా మొదటి ఇంగ్లీష్ సినిమా

– ధనుష్

ధనుష్...రజనీకాంత్ అల్లుడు..అంతకంటే ముందు మంచి నటుడు. స్వయంకృషితో ఎదిగిన వ్యక్తి. అతను నటడే కాదు నిర్మాత, గాయకుడు కూడా. ఆయనకు తమిళంలోనే కాదు తెలుగులోనూ మంచి క్రేజ్ ఉంది. మొన్న బాలీవుడ్‌లో సినిమా చేశారు. ఇప్పుడు హాలీవుడ్‌కు ఎదిగారు. ఆ చిత్రమే 'ది ఎక్స్‌ట్రార్డినరీ జర్నీ ఆఫ్ ఫకీర్'. ఈ సినిమా టీజర్‌ను శనివారం విడుదల చేశారు. 'ఇది నా మొదటి ఇంగ్లీష్ చిత్రమ'ని ధనుష్ పేర్కొంటూ తన ట్విట్టర్‌లో ఖాతాలో టీజర్‌ను పోస్టు చేశారు. 'ఇది ఓ అద్భుతమైన ప్రయాణం. ఈ వేసవిలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. మీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నా' అని ట్వీట్ చేశారు. ఈ సినిమాలో ప్రపంచంలోని చాలా దేశాలకు వెళ్లి అక్కడి వారిని కలుస్తుంటారు ధనుష్. ఆయన ప్రయాణాలు, అక్కడ ఎదుర్కొన్న సంఘటనలే ఈ సినిమా కథ. బర్ఖద్ అబ్ది, ఎరిన్ మోరియార్టీ, అబెల్ జాఫ్రీ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. కెన్ స్కాట్ దర్శకత్వం. నా పేరు అజాతశత్రు లావిష్ పటేల్.. అనే ధనుష్ డైలాగ్‌తో టీజర్ ప్రారంభమైంది. 'ఈ కథ నాకు బాగా నచ్చింది. ఇది ముంబయిలోని చిన్న ప్రాంతం నుంచి వచ్చిన ఓ కుర్రాడి కథ. అతడికి ఏం తెలియదు. కానీ..' అంటూ ఓ వ్యక్తి మరొకరికి కథ చెబుతున్నారు. ఆ కథలో ధనుష్ ప్యారిస్, ఫ్రాన్స్, ఇటలీ.. అనేక ప్రాంతాలు చుట్టేస్తూ కనిపించారు.


ధనుష్



'ది ఎక్స్‌ట్రార్డినరీ జర్నీ ఆఫ్ ది ఫకీర్'లో ధనుష్

నేను ఎప్పుడూ వాళ్ల హితం కోరేదాన్నే


దీపికా పదుకొనే

దీపికా పదుకొనే ప్రస్తుతం బాలీవుడ్ లీడ్ హీరోయిన్. ఎన్నో వ్యయ ప్రయాసలను ఎదుర్కొని విడుదలైన ఆమె చిత్రం 'పద్మావత్' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. 230 కోట్లుకు పైగా కాసులు కురిపించింది. అయినా ఈ సినిమా సక్సెస్ సెలబ్రేషన్స్ నిర్వహించలేదు. ఈ చిత్రానికి లభిస్తున్న ఆదరణ చూసి టైటిల్ పాత్రలో పోషించిన దీపికా ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపింది. ఇంత భారీ స్థాయిలో ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదలు చెబుతూ ఓ వీడియోను విడుదల చేసింది. ఈ సినిమాలో రణవీర్ సింగ్ అల్లావుద్దీన్ ఖిల్జీగానూ, సాహిద్ కపూర్ చిత్తోర్ ప్రభువుగానూ నటించారు. ఈ సినిమాలో వీరిద్దరూ అందించిన సహకారం గురించి మాట్లాడుతూ 'నేనెప్పుడూ రణవీర్, సాహిద్ హితం కోరుకుంటాను' అని పేర్కొంది దీపికా. " ఈ సినిమా కోసం వీరిద్దరూ చాలా చేశారు. వాళ్లిద్దరితో కలసి పని చేయడం చాలా ఆనందంగా ఉంది. వచ్చే వారం చివరిలో విజయోత్సవ సంబరాలు చేసుకుందాం. అప్పటి వరకూ ఇంకా ఎక్కువ మంది ప్రేక్షకులు చూడాలి' అని చెప్పింది. వోలేర్ అవార్డు 2018 ను అందుకున్న అనంతరం దీపికా ఈ వ్యాఖ్యలు చేసింది. 'పద్మావత్' సక్సెస్‌ను ఎలా సెలబ్రేట్ చేసుకుంటున్నారన్న ప్రశ్నకు ఆమె బదులిస్తూ...నిజం చెప్పాలంటే ఆ సక్సెస్‌ను సెలబ్రేట్ చేసుకోవడానికి ఖాళీ లేదు. ఇప్పుడు చాలా పనుల వల్ల బిజీ అయిపోయాను. కానీ ఇది సెలబ్రేట్ చేసుకునే సమయం' అని చెప్పింది.

'సూపర్ స్కెచ్' వేశారు


గ్యారీ టాన్ టోనీ

స్వదేశీ, విదేశీ నటులతో చేస్తున్న వైవిధ్యభరిత చిత్రం 'సూపర్ స్కెచ్'. మైండ్ గేమ్ కాన్సెప్ట్‌తో రూపొందుతోంది. రవి కుమార్ చావలి దర్శకత్వం. నర్సింగ్, ఇంద్ర, సమీర్ దత్, కార్తీక్, చక్రి మాగంటి, అనిక, సుభాంగి, విదేశీ నటులు సోఫియా, గ్యారీ టాన్ టోనీ (ఇంగ్లండ్) ఇందులో కీలక పాత్రధారులు. యారో సినిమాస్ సమర్పణలో యు అండ్ ఐ– ఫ్రెండ్స్ ఫిల్మ్ అకాడమీ సహకారంతో శుక్ర క్రియేషన్స్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోన్న చిత్రమిది.రవికుమార్ చావలి మాట్లాడుతూ 'గ్రిప్పింగ్ స్క్రీన్ ప్లే తో, వైవిధ్యమైన పాయింట్ తో ఆద్యంతం ఆసక్తికరంగా తెరకెక్కిస్తున్నాం. ఇటీవలే చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో భాగంగా డబ్బింగ్ జరుగుతోంది. మన వాళ్లతో పాటు విదేశీ నటులు సోఫియా, గ్యారీ టాన్ టోని (ఇంగ్లండ్) పాత్రలు కూడా మెప్పిస్తాయి.

సాహసాలంటే ఇష్టం

'నేను సాహసాలు ఇష్టపడే వ్యక్తిని, సాహసోపేతమైన పాత్రలు చేయడానికి, ఆ జోనర్ కథల్లో నటించడానికి ఆసక్తి చూపుతాను. అంతిమంగా నా కోరిక నిజమైంది. నేను కొంత కాలంగా మార్షియల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతున్నాను. భవిష్యత్తులో మరిన్ని యాక్షన్ సినిమాలు చేయాలనుకుంటున్నాను" అని నికేషా పటేల్ చెప్పారు. 'పులి' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన నటి ఈమె. ఇప్పుడు పోలీస్ ఆఫీసర్‌గా కనిపించబోతుంది. ఆ చిత్రమే 'రౌడీ పోలీస్'. ఇందులో భానుచందర్ మరో కీలక పాత్రలో నటిస్తున్నారు. ముకుల్‌దేవ్ ప్రతినాయుడిగా చేస్తున్నాడు. ఈ సినిమాలో 90శాతం చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం ఆఖరి ఘట్టాలు చిత్రీకరిస్తున్నారు.


నికేషా పటేల్



సరదా సరదా సంగతులు

అక్కడ వేసే ప్రతిఅడుగులోనూ తోడుగా మనకోసమంటూ నలుగురు స్నేహితులుంటారు. సంతోషమేసినపుడు పంచుకునేందుకూ... బాధేస్తున్నప్పుడో, కష్టమొచ్చినప్పుడో భుజం తట్టేందుకో అలా మనకోసం నిలబడేవుంటారు. కొంచెం వెనక్కితిరిగి చూసుకుంటే అలాంటివి ఎన్నో జ్ఞాపకాలు కొంత ధైర్యాన్నీ, ఇంకాస్త ఆనందాన్నీ, మరికాస్త ఆహ్లాదాన్నీ ఇస్తాయి. ఓసారి వాటిని నెమరువేసుకుంటే జీవితాన్ని ఆస్వాదించిన అనుభూతి కలుగుతుంది. అలాంటి జ్ఞాపకాల్లోకి వెళ్లొద్దాం రండి.

రోజులన్నీ ఒకేలా ఉండవు. అదే కాలేజీ రోజులైతే చెప్పే పనేలేదు. ప్రతిరోజూ కొత్తగానే ఉంటుంది. సరికొత్త జీవితం, కొత్తదారి, కొద్దిపాటి భయం... భవిష్యత్తు కోసం కట్టుకుంటున్న ఆశల గూళ్లన్నీ ఒక్కసారిగా లోపలచేరతాయి. అవే ఉత్తేజాన్నిస్తాయి, అవే కలవరమూ పెడతాయి, అవే ముందుకూ నడుపుతాయి, రేపటి ప్రయాణానికీ, జీవితంలో నాలుగడుగులు ముందుకేయడానికీ మనల్ని తయారుచేస్తాయి...

పరీక్ష ముందురోజు వన్డే బ్యాటింగ్

ఏడాదంతా ఎలా గడిచినా, సెమిస్టర్ మొత్తం పుస్తకాల మొహం చూడకున్నా, ఆ రోజు మాత్రం నిద్రలేని రాత్రి జీవితంలోకొస్తుంది. మిత్రులంతా కలిసి ఒకే దగ్గరికి చేరి ఆ రోజంతా పుస్తకాల పనిపడతారు. ఎవరికి తెలిసింది వారు షేర్ చేసుకుంటూ, మరుసటి రోజు తెల్లవారేసరికి పరీక్షకు సిద్ధమవుతారు. దీనినే వాళ్లంతా వన్డే బ్యాటింగ్‌గా చెప్పుకుంటారు. యూనిట్లుగా విడగొట్టుకుని ఎవరెవరికి బాగా పరకాయప్రవేశముందన్న విషయాన్ని వారు చర్చలోకి తీసుకొస్తారు. పరీక్షకు కావాల్సినంతా ఆ రోజే పూర్తిచేస్తారు. ఆ ఒక్కరోజే కాకుండా అప్పుడప్పుడూ పుస్తకం పట్టేవారూ... పరీక్ష ముందు రోజున వీరితో చేరిపోతారు. ఆ రోజు హాస్టల్ వాతావరణమైతే మరింత ఆహ్లాదంగా ఉంటుంది. మొదటి సంవత్సరం పరీక్షలు రాస్తున్నవారికైతే మరీమరీ గుర్తుండిపోయేలా వుంటుంది. గ్రూప్ స్టడీల మధ్యలో సీనియర్ల సలహాలూ, కలగలిసిన భయాలూ అన్నీ జీవితాంతం మనతో నడిచే జ్ఞాపకాలే ఉంటాయి. పరీక్ష పూర్తయ్యాక వాతావరణం మరింత ఆహ్లాదంగా ఉంటుంది. ఎవరెలా రాసారో జరిగే విశ్లేషణ గమ్మత్తుగానూ ఉంటుంది.

కిక్‌ను ఇచ్చే గ్రూప్ షాపింగ్

అప్పటి వరకూ చేసిన షాపింగ్స్ అన్నీ ఒకలా ఉంటే, కాలేజ్‌కి వచ్చాక, మిత్రులతో కలిసి చేసేది మాత్రం భలే కిక్ ఇస్తుంది. అలా గుంపుగా వెళ్లి కొనడం ఇక్కడి నుంచే మొదలవుతుంది. షూస్ నుంచీ, క్యాప్ వరకూ స్నేహితులతో కలిసి షాపింగ్ చేయడంలో కొత్త మజా ఉంటుంది. చాలామంది కాలేజ్ వయసు వచ్చిన వెంటనే ఉన్నట్టుండి ఒక్కసారిగా లుక్ మార్చేయడానికి ఇదీ ఒక కారణమే. ఒక్కరే షాపింగ్‌కి వెళ్లడం ఎప్పుడో ఒకసారి కాని జరగదు. అప్పటివరకూ అమ్మకూచీలు, నాన్నా కూచీలుగా ఉన్న వారు సైతం... ఫ్రెండ్స్‌తో కలిసే షాపింగ్ చేయడానికి ఇష్టపడతారు. ఇందులో అంత మజా ఉంటుంది. ఎన్నో కొత్తకొత్త అనుభవాలను పరిచయం చేస్తుంది. ఆ అనుభవాలే స్వతంత్రంగా మనల్ని మనం ఈ ప్రపంచానికి పరిచయం చేసుకోవడానికీ దోహదపడతాయి. కుటుంబ బంధాల వరకే ఎక్కువగా మమేకమైన సంబధాల పరిధీ ఇక్కడే విచ్చుకుంటుంది. అనిపించడానకి షాపింగ్ చాలా చిన్న విషయంలానే ఉన్నా, ఈ క్షణాలు జీవితానికి మంచి కిక్ ఇచ్చేవిగా వెంటాడుతూ ఉంటాయి.





సరదాసరదా మాస్ బంక్

అప్పటి వరకూ పబ్లిక్ హాలిడేస్‌లో మాత్రమే సెలవులుంటాయి. వాటినే ఎంజాయ్ చేస్తూ ఉంటారు. స్నేహితులను కలవాలన్నా, సరదాగా అందరూ కలిసి ఓ సినిమాకో, దగ్గరిలోని ఇష్టమైన చోటుకు పిక్నిక్‌కు వెళ్లాలన్నా ఆ రోజుల్లోనే కుదురుతుంది. మిగతా రోజుల్లో... ఆ ఆలోచన వచ్చే అవకాశమే ఉండదు. కానీ డిగ్రీలో పడి, కాలేజీకి వచ్చాక ఆ తీరు మారిపోతుంది. ఎప్పుడన్నా ఓ సారి అందరూ కలిసి, సరదాగా సినిమాకో, షికారో వెళ్లాలంటే అందరూ కలిసి మూకుమ్మడిగా సెలవు పెట్టేస్తారు. ఎప్పుడో ఓ సారి తీర్చుకునే ఈ సరదా కూడా ఎంతో కాలం గుర్తుండిపోయే జ్ఞాపకాలను ఇస్తుంది. చదువులతో, నాన్‌స్టాప్ క్లాసులతో బోర్‌కొడుతున్న బుర్రకు కాస్తంత సేదతీరే అవకాశాన్నీ కల్పిస్తుంది. అటు క్లాసులూ మిస్సవ్వకుండా, ఇటు సరదా తీరినట్టూ, భలేగా అనిపుస్తుంది ఆ అనుభవం.

మీ కాలేజీ జీవితంలోనూ ఇలాంటివి ఎన్నింటినో చూసి ఉంటారు. అవన్నీ మీకు ఆనందాన్ని పంచిన జ్ఞాపకాలు. మీలో ఎన్నో కొత్తకోణాలనూ, మార్పులనూ పట్టిచూపించిన క్షణాలు. మనల్ని మనలానే ఎదగనిస్తూ లోపలి అంతరంగాలను బాహ్యప్రపంచానికి పరిచయం చేసిన మళ్లీరాని రోజులు. అవి తిరిగిరానివైనా సరే, తలుచుకుంటే చాలు జ్ఞాపకాలై చుట్టుముడతాయి. జీవితం చిక్కుపడ్డప్పుడల్లా, చెవుల్లో కమ్మని గీతాన్ని పాడినట్టు, కమ్మని అనుభూతిని మిగులుస్తాయి. మీరూ ఓసారి ఇవన్నీ గుర్తుచేసుకోండి. ఒక తీయని జ్ఞాపకాన్ని పాడుకుంటూ ఒకసారి ఆరోజుల్లోకి వెళ్లిరండి. ★

పర్యావరణ స్నేహితులు

ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్ నుంచి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న భావుంతి అనే గ్రామంలో 'హెల్ప్ అజ్ గ్రీన్' అనే ఓ కార్యాలయం ఉంది. స్థానికంగా ఉన్న సుమారు ఇరవై ఆలయాల్లోంచి ప్రతిరోజూ 800 కిలోల పాడైపోయిన పూలను ఇక్కడికి తీసుకోస్తారు. వాటితో అగరబత్తీలు, జీవసంబంధమైన వర్మికంపోస్టులను తయారుచేస్తారు. ఈ కంపెనీని అంకిత్ అగర్వాల్, కరణ్ రాస్తోగి అనే ఇద్దరు స్నేహితులు కలిసి నడిపిస్తున్నారు. 72వేల రూపాయలతో మొదలుపెట్టిన ఈ కంపెనీ ప్రస్తుత టర్నోవర్ అక్షరాలా రెండు కోట్లు. ఇంతకీ ఈ స్నేహితుల నేపథ్యం ఏంటి? వారు ఈ మార్గాన్ని ఎంచుకోవడానికిగల కారణాలేంటి? తెలుసుకుందాం!!





"నేను నా మిత్రునితో కలిసి 2014లో కాన్పూర్‌లోని బిటూర్ ఆలయ దర్శనానికి వెళ్లాం. అక్కడే ఉన్న గంగానదిలో చెత్తా చెదారంతోపాటు పూలు ఇతర వస్తువులు తేలుతూ ఉండడం గమనించాం. ఆ నీటినే ప్రజలు సేవించడం చూశాం. ఒకవైపు నీటిలో పూలూ, పడి నీరును కలుషితం చేస్తున్నాయి. మరోవైపు ఆ పూల వల్లే ఆ నీటిలో ఉండే జీవాలకు ప్రమాదం అని అర్థమైంది. ఆ క్షణం నా స్నేహితుడు ఆ నదిని చూపిస్తూ వీటికోసం ఏదైనా చేయాలి అన్నాడు. అప్పుడే నాకొక ఆలోచన తట్టింది. మనం ఏం చేసినా పర్యావరణాన్ని కాపాడే విధంగా ఉండాలి. నలుగురికీ సాయపడాలి అనుకున్నాం' అని 28 సంవత్సరాల అంకిత్ చెప్పుకొచ్చాడు. తన స్నేహితుడు కరణ్ విదేశాల్లో చదువుకోని ఇండియాకు వచ్చాడు. అతన్ని కలిసి, తన మనసులో మాటను క్లుప్తంగా వివరించాడు అంకిత్. అలా గంగానది నీరు కలుషితం అవ్వడానికి ముఖ్య కారణాల్లో వ్యర్థాలే మొదటి స్థానంలో ఉన్నట్లు గుర్తించారు. అందరిలా కాకుండా కాస్త వినూత్నంగా ఏదైనా చెయ్యాలని గట్టి నిర్ణయానికి వచ్చారు. మొదట్లో ఈ విషయం గురించి కొంతమందితో చర్చించారు. వారంతా వీరిని చూసి నవ్వుకున్నారు. కానీ, అలాంటి వారిని ఈ స్నేహితులిద్దరూ పట్టించుకోలేదు. 'నేను 2014 వరకూ పూణేలోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఆటోమెషిన్ సైంటిస్టుగా పనిచేశాను. మాస్టర్స్ చదువు పూర్తవగానే ఇండియా వచ్చి పలు కంపెనీల్లో పని చేశాను. నేనూ కరణ్ కలిసి నా పాత పనిని వదిలిపెట్టి 2015లో 72 వేల రూపాయలతో 'హెల్ప్ అజ్ గ్రీన్' పేరుతో ఓ కంపెనీ లాంచ్ చేశాం. అప్పుడందరూ మమ్మల్ని చూసి వీళ్లు పిచ్చివాళ్లు అని అనేవాళ్లు. రెండునెలల తర్వాత మేం మా మొదటి ప్రొడక్ట్ వర్మీకంపోస్టు లాంచ్ చేశాం. ఈ వర్మీకంపోస్టులో 17 సహజ వస్తువులు మిళితమై ఉంటాయి. అందులో కాఫీ షాపుల నుంచి వచ్చే వేస్ట్ మెటీరియల్ కూడా ఉంది' అంటున్నాడు అంకిత్.

అంచెలంచెలుగా..!

కొన్ని రోజుల తర్వాత ఈ కంపెనీ కాన్పూర్‌లోని సర్‌సోలా గ్రామంలో పర్యావరణ అనుకూలమైన అగరుబత్తీలను తయారుచేయడం ప్రారంభించింది. కొనుగోలుదారులు అగరబత్తీ డబ్బాలను పారవేయకుండా ఉండేందుకు ఓ కొత్త ఆలోచనను ప్రవేశపెట్టారు. ఆ డబ్బాలపై దేవుని బొమ్మలు పెట్టడంతో ఆ డబ్బాలను పారేసేందుకు ఎక్కువమంది ఇష్టపడేవారు కాదు. ప్రస్తుతం ఈ కంపెనీ 22 ఎకరాల్లో విస్తరించింది. 'మా కంపెనీలో 70 కంటే ఎక్కువ మంది మహిళలు పనిచేస్తున్నారు. వారికి రోజుకు రూ. 200 రూపాయలు చెల్లిస్తాం. మా కంపెనీ సంవత్సరం టర్నోవర్ 2 కోట్లకు వచ్చింది. ఈ బిజినెస్ కాన్పూర్, కన్నౌజ్, ఉన్నవ్ ప్రాంతాల్లో మాత్రమే కాకుండా చాలా ప్రాంతాల్లో విస్తరించింది' అంటూ గర్వంగా చెబుతున్నారు ఈ స్నేహితులు. మొదట్లో ఈ టీమ్‌లో ఇద్దరు మాత్రమే ఉండేవారు. ఇప్పుడు 9మంది దాకా ఉన్నారు. కంపెనీకి ఐఐటి నుంచి 4 కోట్ల కంటే ఎక్కువ ఆర్డర్స్ వచ్చాయి. పర్యావరణానికి తమవంతుగా ఏదైనా చేయాలనే ఈ స్నేహితుల తపన పలువురికి ఉపాధినివ్వడంతోపాటు యువతను ఆలోచింపజేస్తోంది. ★

వ్యవస్థలో మార్పు రావాలి అనే ఆశయంతో యువత నుంచి వచ్చే అభిప్రాయాలను ప్రజల వద్దకు చేర్చే ప్రత్యేక కాలమ్ రైజ్ యువ(ర్) వాయిస్. మీ వాయిస్ పంపవలసినది : జోష్, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం: 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-2 లేదా joshprajasakti@gmail.com **కు మెయిల్ పంపగలరు.**



చిన్నారి





పొడుపు కథ

నోట్లో ఉమ్మే దారమౌతుంది,
దాంతో అందంగా గూడు కడుతుంది,
దారంపైనే నడుస్తుంది,
ఇళ్లల్లో ఉండే అల్పప్రాణి.?

జవాబు : సాలెపురుగు

జోక్ :

గోపి : ఒరేయ్ రవీ! నేను పెద్దయ్యాక మంచి సినిమా తీస్తా..!
రవి :ఆ సినిమా పేరేంటి?
గోపి : అడిగితే తంతా!! మళ్ళీ అడగొద్దు

దారిచూపండి!




పిల్లలూ..! పక్కనున్న చిత్రంలోని పులి బొమ్మకు చుక్కలు కలిపి రంగులు వేయండి!

మానవాళికి మేలు చేసే మేక

పిల్లలూ..! మీలో చాలా మంది మేకలను చూసుంటారు కదూ! గ్రామాలలోని వారైతే కచ్చితంగా చూసే ఉంటారు. ఈ రోజు మేక గురించి కొన్ని విషయాలు తెలుసుకుందామా!



మొదట వీటిని ఆసియా, ఐరోపా దేశాలలో కొండ మేకలుగా పిలిచేవారు. కాలక్రమంలో పెంపుడు జంతువుగా మార్పుచెందాయి. ఇవి బొవిడాయ్ కుటుంబానికి చెందినవి. మేకలు ఆహారాన్ని నెమరువేస్తాయి. అంటే వాటికి కావలసినంత ఆహారాన్ని మింగేసి, గొంతులో దాచుకుంటాయి. తర్వాత కొద్దికొద్దిగా నోట్లోకి తెచ్చుకుని నములుతూ ఉంటాయి. దీనినే నెమరువేయడం అంటారు. మేకలలో సుమారు 300 సంకర జాతులున్నాయి. పురాతన కాలం నుంచి మానవుడు మేకలను పెంచుకుంటున్నాడు. వేల సంవత్సరాల నుంచి వీటి పాలు, మాంసం, ఊలు, తోలులను ప్రపంచ వ్యాప్తంగా ఉపయోగిస్తున్నారు. వీటిని భారత ఉపఖండంలో పెంపుడు జంతువులుగానే పిలుస్తారు. ఇవి మందలుగా కొండ చరియల్లో మేతకోసం సంచరిస్తాయి. మేక పేగుల నుంచి శస్త్రచికిత్సలో ఉపయోగించే 'క్యాట్‌గట్' అనే దారాన్ని తయారుచేస్తారు. మేక పాలను ఆహారానికి సంబంధించిన అనేక వస్తువులలో ఉపయోగిస్తారు. మేక పాలు పితకగానే తాగడానికి అనువైనవి. కానీ బాక్టీరియా సంబంధ వ్యాధుల నుంచి రక్షణ కోసం పాశ్చురైజేషన్ చేయడం మంచిది. మేక పాల నుంచి వెన్న, మీగడ, ఐస్‌క్రీమ్ లాంటి పదార్థాలను తయారుచేయవచ్చు. మేక పాలల్లో ఆవుపాల మాదిరిగా కాక నురుగు పైకి తేలకుండా పాలతో కలిసిపోతుంది. మేకల్లో మగ వాటిని మేకపోతు అని పిలుస్తారు. సన్నకారు రైతులకు మేకల పెంపకం అతి తక్కువ పెట్టుబడితో లాభదాయకంగా ఉంటుంది. ★





నేను గీసిన బొమ్మ





పి. యశ్వంత్
ఒకటవ తరగతి,
క్రాంతి ఇంగ్లీషు మీడియం స్కూల్
పాయకాపురం.

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవలసిన మాచిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com



సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు పాటూరు రామయ్య, సీనియర్ నాయకులు రుద్రరాజు సత్యనారాయణరాజు, బిక్షవతి మాటామంతి..



వేదికపై ఏచూరి, తమ్మినేని, రామకృష్ణ ఆత్మీయ పలకరింపు



బహిరంగసభకు హాజరైన అశేష ప్రజానీకంలో ఒకభాగం, మా భవిష్యత్తుకూ ఎర్రజెండానే అండ అంటున్న చిన్నారి



ఏచూరికి రెడ్ వాలంటీర్ల స్వాగతం



జానపదాలతో సుందరయ్య జీవన నృత్యరూపకం ప్రదర్శించిన తూర్పుగోదావరి ప్రజానాట్యమండలి దళం



ఏచూరితో వాలంటీర్ల సెల్ఫీలు



ఎర్రజెండానే మాకు అండా దండా..



ఆర్ఎస్ రచించిన 'నా జీవన పథం' పుస్తకాన్ని ఆవిష్కరించిన బి.వి.రాఘవులు వేదికపై పలువురు నేతలు

సిరీస్ భారత్‌దే!

- చివరివన్డేలో ఓటమి

పోర్చెఫ్‌స్ట్రోమ్ (దక్షిణాఫ్రికా) : ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా భారత్ మహిళ జట్టుతో జరిగిన మూడో వన్డే మ్యాచ్‌లో సౌతాఫ్రికా మహిళ జట్టు 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. శనివారం తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌటైంది. బ్యాటింగ్‌లో దీప్తీ శర్మ 79, వేదా కృష్ణమూర్తి మినహా మిగితా వారందరూ తక్కువ పరుగులకే పరిమితమయ్యారు. మహిళా సారథి మిథాలీ రాజ్ కేవలం 4 పరుగులు మాత్రమే చేసి ఖాకా బౌలింగ్‌లో లీకు క్యాచ్ ఇచ్చి పెవిలీయన్‌కు చేరింది. 241 పరుగులు లక్ష్యంతో బరిలోకి దిగిన సఫారీ అమ్మాయిలు 49.2 ఓవర్లలో 3 వికెట్లు చేజార్చుకొని విజయాన్ని సాధించారు. అయితే 169 పరుగుల వద్ద వోల్వార్ట్ పెవిలియన్ చేరడంతో డూ ప్రేజ్ చెలరేగిపోయింది. మరో క్రీడాకారిణి నైక్రిక్(41)తో కలిసి దూకుడుగా బ్యాటింగ్ చేసింది. 111 బంతుల్లో 7 ఫోర్లతో 90 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. ఈ మ్యాచ్‌లో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడిన డూ ప్రేజ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. కాగా మూడు వన్డేల సిరీస్‌ను భారత్ 2-1 తేడాతో కైవసం చేసుకుంది. ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డు భారత ఓపెనర్ స్మృతి మంధానకు దక్కింది.

భారత్ భారీస్కోర్

'వంద'లో వంద కొట్టిన ధావన్
టీమిండియా - 289/7
వర్షం కారణంగా పలుమార్లు మ్యాచ్‌కు అంతరాయం



జోహాన్స్‌బర్గ్ : భారత-దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరుగుతున్న నాల్గో వన్డేలో టీమిండియా భారీస్కోర్ సాధించింది. శనివారం టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారతజట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 289 పరుగులు చేసింది. 290 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన సఫారీజట్టు 7.2 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 43 పరుగులు చేసిన అనంతరం వర్షం కారణంగా మ్యాచ్ నిలిచిపోయింది. తొలుత టీమిండియా బ్యాటింగ్‌లోనూ చిరుజల్లులు పడడంతో 35వ ఓవర్ అనంతరం మ్యాచ్‌ను కొంతసేపు నిలిపివేశారు. ఆరు వన్డేల సిరీస్‌లో 3-0 ఆధిక్యతలో ఉన్న టీమిండియా ఈ మ్యాచ్‌లో గెలిచినా... వర్షం కారణంగా రద్దయినపక్షంలో సిరీస్ భారత్ కైవసం లాంచనమే కానుంది.

ఓపెనర్ శిఖర్ ధావన్ 109 పరుగులు చేయగా... టీమిండియా సారథి విరాట్ కోహ్లీ (75) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. వీరిద్దరి జోడీ రెండో వికెట్‌కు 158 పరుగుల భాగస్వామ్యం సాధించింది. రోహిత్ శర్మ ఈ మ్యాచ్‌లో కేవలం 5 పరుగులు మాత్రమే చేసి రబాడ బౌలింగ్‌లో కాట్ అండ్ బౌల్డ్‌గా పెవిలీయన్‌కు చేరాడు. 35 ఓవర్ల అనంతరం చిరుజల్లులు కురవడంతో కొంతసేపు ఆటకు అంతరాయం కలిగింది. వర్షం నిలిచిన అనంతరం మ్యాచ్ కొనసాగిన వెంటనే ఒక ఓవర్ తేడాతో ధావన్, రహానే(8)లు వెంట వెంటనే అవుటయ్యారు. చివర్లో టీమిండియా మాజీ సారథి మహేంద్రసింగ్ ధోనీ అజేయంగా 42 పరుగులు చేయడంతో భారతజట్టు భారీ స్కోర్ సాధించగలిగింది. ఇరు జట్లలో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. భారత జట్టులో గాయం కారణంగా కేదార్ జాదవ్ దూరం కాగా అతని స్థానంలో యువ ఆటగాడు శ్రేయస్ అయ్యర్‌ను తుదిజట్టులోకి తీసుకున్నారు. ఇక ఆతిథ్య జట్టులోకి ఏబీ డివిలియర్స్, మోర్కెల్ రాగా జోండో, ఇమ్రాన్ తాహీర్‌లకు ఉద్వాసన పలికారు. ఇక ఏబీ రాకతో ప్రొటీస్ జట్టులో ఆత్మవిశ్వాసం నెలకొంది.

సెంచరీలో సెంచరీ చేసిన ధావన్

దక్షిణాఫ్రికాతో నాలుగో వన్డేలో టీమిండియా ఓపెనర్ శిఖర్ ధావన్ శతకంతో చెలరేగాడు. ధావన్ 99 బంతుల్లో 10ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో సెంచరీ పూర్తి చేశాడు. కెరీర్‌లో 100వ వన్డే ఆడుతున్న ధావన్ వంద పరుగులు సాధించిన తొలి భారత ఆటగాడిగా, ప్రపంచ క్రికెట్ చరిత్రలో 9వ ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. వన్డే కెరీర్లో అతనికిది 13వ శతకం కావడం విశేషం.

రికార్డు సృష్టించిన ధవన్, కోహ్లీ..

దక్షిణాఫ్రికాతో జరుగుతున్న నాలుగో వన్డేలో భారత్ కెప్టెన్ విరాట్ కోహ్లీ, ఓపెనర్ శిఖర్ ధవన్‌లు రెండో వికెట్‌కు 119 పరుగుల భాగస్వామ్యాన్ని జత చేసి రికార్డు సృష్టించారు. రెండో వికెట్‌కి వీరిద్దరు కలిసి ఎనిమిదిసార్లు 100 పరుగులకు పైగా భాగస్వామ్యాన్ని జత చేశారు. ఈ ఫీట్‌తో భారత క్రికెట్ దిగ్గజాలు సౌరవ్ గంగూలీ, ద్రవిడ్‌ల రికార్డును సమం చేశారు. ఈ జాబితాలో శ్రీలంక క్రికెటర్లు సంగక్కర, దిల్షాన్‌లు మొదటిస్థానంలో ఉన్నారు. వీరిద్దరు కలిసి రెండో వికెట్‌కి 19 సార్లు 100 పరుగుల భాగస్వామ్యాన్ని జత చేశారు.

టీ20 ఫైనల్‌కు ఆసీస్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా-న్యూజిలాండ్-ఇంగ్లండ్ జట్లమధ్య జరుగుతున్న ట్రయాంగులర్ టీ20 సిరీస్‌లో ఆస్ట్రేలియా గెలుపొందింది. శనివారం ఇంగ్లండ్‌తో తలపడిన ఆసీస్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి ఫైనల్లోకి ప్రవేశించింది. ఇంగ్లండ్ 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 137 పరుగులు చేయగా.. ఆసీస్ 14.3 ఓవర్లలో మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి విజయాన్ని సాధించింది. ఆర్సీ షాట్(36), క్రిస్ లిన్(31), మ్యాక్స్‌వెల్(39)లు ఆడటంతో ఆసీస్ సునాయాసంగా గెలుపొందింది.

టెస్ట్ సిరీస్ శ్రీలంకదే...

ఢాకా : బంగ్లాదేశ్-శ్రీలంక జట్ల మధ్య జరుగుతున్న టెస్ట్ సిరీస్‌ను లంకజట్టు గెలుచుకుంది. శనివారం 338 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 123 పరుగులకే ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోర్ 8 వికెట్ల నష్టానికి 200 పరుగులతో బ్యాటింగ్ కొనసాగించిన లంక 226 పరుగులకు ఆలౌటైంది. లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో బంగ్లాదేశ్ జట్టు 123 పరుగులే చేయడంతో లంకజట్టు 215 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.



ఫెడరేషన్‌లో భాగంగా ఆసియా ఓషియానియా గ్రూప్-1 ఫైనల్లో భారత టెన్నిస్ జట్టు 2-0 చైనీస్ తైపీపై ఆధిక్యతలో నిలిచింది. శనివారం జరిగిన సింగిల్స్‌లో కర్మాన్ కౌర్ 7-6(7-4), 6-3తో డీ-డై-ఔపై ... రెండో మ్యాచ్‌లో అంకిత రైనా 6-4, 5-7, 6-1తో చి-యు-హూస్‌పై హోరాహోరీ పోరులో విజయం సాధించింది.



వింటర్ ఒలింపిక్స్ మహిళల స్కైథాట్లాన్ క్రాస్‌కంట్రీలో తొలి పతకం సాధించిన షార్లెట్ కల్ల (స్వీడన్) బంగారు, మారిట్ బోజెర్జెన్ (నార్వే) రజిత, క్రిస్టా పర్మాకోస్కి(ఫిన్లాండ్) కాంస్య పతకాలను సాధించిన అథ్లెట్లు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68